
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5



శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
శనివారం 1 మార్చి 2025



ఆదిదంపతులు కొలువైన రథాన్ని లాగుతున్న భక్తజనం

హరహర శంకర.. జయజయ శంకర..!

ఉత్సాహంగా మూలస్థానేశ్వరుడి రథోత్సవం

నగరంలోని మూలాపేట వీధులు శివశివ శంభో.. హరిహర శంకర.. హరిఓం శంకర.. జయజయ శంకర అనే నామస్మరణలతో మారుమోగాయి. శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా భువనేశ్వరీ సమేత మూలస్థానేశ్వర స్వామికి రథోత్సవం వైభవంగా జరిగింది. యువత, మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి రథాన్ని ముందుకు లాగారు. ఉదయం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, రుద్రహోమాలు జరిగాయి. భువనేశ్వరీ సమేత మూలస్థానేశ్వరుడికి ప్రత్యేక అలంకారం, విశేష పూజలు జరిగాయి. అర్చకుల వేదమంత్రాలు.. మంగళవాయిద్యలు.. శివనామ స్మరణలతో ఉత్సవర్లను పల్లకిలో ఊరేగింపుగా రథం వద్దకు తీసుకువచ్చి ప్రతిష్ఠించారు. ఉభయకర్త గిరీష్‌కుమార్‌రెడ్డి, నారాయణ విద్యా సంస్థల జీఎం వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, శివరాత్రి ఫెస్టివల్ అధికారి జిల్లా దేవదాయ సహాయ కమిషనర్ కోవూరు జనార్ధన్‌రెడ్డి, ఈవో అర్చభూమి వెంకటశ్రీనివాసులురెడ్డిలు గుమ్మడి, కొబ్బరికాయలతో దిష్టి తీశారు. ఆ తర్వాత కదిలిన రథం బ్రాహ్మణ వీధి, ఈఎస్ఆర్ఎం హైస్కూల్, పొట్టిశ్రీరాములు విగ్రహం, అలంకార్‌సెంటర్, రాజాగారివీధి, రావిచెట్టు సెంటర్ మీదుగా శివాలయం సెంటర్‌కు చేరింది. ఈ సందర్భంగా దారిపొడవునా భక్తులు ఆదిదంపతులకు కర్పూర నీరాజనాలు అందజేశారు. రథోత్సవంలో పాల్గొన్న భక్తుల ఆకలిదప్పులు తీర్చేందుకు స్థానికులు మజ్జిగ, రస్నా, కేసరి, పుచ్చకాయలు తదితర పదార్థాలను ఉచితంగా పంపిణీ చేశారు. అలాగే మూలాపేటలో వెలసి వున్న అన్నపూర్ణ సమేత నీలకంఠేశ్వర స్వామి వారి రథోత్సవం కూడా ఉత్సాహంగా సాగింది. రాత్రి నీలకంఠేశ్వరస్వామికి పుణ్యకోటి విమానంలో నగరం ఉత్సవం కనుల పండువగా జరిగింది.

- నెల్లూరు (సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి)

విజయోస్తు..!

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు ● 79 కేంద్రాల్లో నిర్వహణ

నెల్లూరు (విద్య), ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలకు విద్యార్థులు పూర్తిస్థాయిలో సన్నద్ధమవగా, ఎలాంటి లోటుపాట్లు రానీయకుండా అధికార యంత్రాంగం పటిష్ఠ ఏర్పాట్లు చేసింది. శనివారం నుంచి 20వ తేదీ వరకు జరిగే పరీక్షలను జంబ్లింగ్ విధానంలో జిల్లావ్యాప్తంగా 79 కేంద్రాల్లో నిర్వహిస్తున్నారు. ప్రతిరోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ పరీక్షలు జరుగుతాయి. అయితే, ఉదయం 8.30 గంటలకే కేంద్రానికి చేరుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. నిర్ణీత సమయం దాటాక సహేతుక కారణాలతో కేంద్రానికి చేరుకునే విద్యార్థులను మాత్రమే 2 నుంచి 5 నిమిషాల ఆలస్యం వరకు అనుమతిస్తారు. కాగా, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో జనరల్ విభాగంలో 26,931 మంది, ఒకేషనల్ 1245 మంది కలిపి 28,176 మంది హాజరవుతున్నారు. అలాగే ద్వితీయ సంవత్సరంలో జనరల్‌లో 23,994, ఒకేషనల్‌కు 1030 మంది కలిపి 25,024 మంది పరీక్షలు రాయనున్నారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరం కలిసి మొత్తంగా 53,200 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. మరోవైపు పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు 1400 మంది సిబ్బందిని, హైపవర్ కమిటీతోపాటు జిల్లా పరీక్షల కమిటీ, నాలుగు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, ఐదు సిట్టింగ్ స్క్వాడ్‌లు నియమించడంతోపాటు కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నారు.

సీసీ కెమెరాల నిఘా

ఇంటర్ పరీక్షలను సీసీ కెమెరాల నిఘా నీడలో నిర్వహిస్తున్నారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో ఒక్కో కేంద్రానికి 4 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. విద్యార్థుల తోపాటు ఇన్విజిలేటర్లు కూడా కేంద్రంలోకి సెల్‌ఫోన్‌లు, క్యాలుకులేటర్లు వంటి వస్తువులు, కాగితాలను అనుమతించరు. 79 కేంద్రాల్లో 12 సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించిన అధికారులు బందోబస్తును కట్టుదిట్టం చేశారు. పరీక్షల నిర్వహణలో ఏదైనా సమాచారం పొందాలన్నా, ఇబ్బందులను తెలియచేయాలన్నా నగరంలోని ఆర్ఐఓ కార్యాలయంలో కంట్రోల్ రూమ్, ఫోన్ 0861-2320312 నెంబర్ అందుబాటులో ఉంచారు. విద్యార్థులు ఎలాంటి ఆందోళన చెందకుండా, కంగారుపడకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలకు హాజరు కావాలని, వారికి పూర్తి సదుపాయాలను ఏర్పాటు చేసినట్లు ఆర్ఐఓ డాక్టర్ శ్రీనివాసులు తెలిపారు.

ఎన్ని పులులు ఉన్నాయ్..

ఎక్కడున్నాయ్!?

● నేటినుంచి 45 రోజులపాటు గణన

● 3 రేంజ్‌లలో 240 సీసీ కెమెరాల ఏర్పాటు

నెల్లూరు (వెంకటేశ్వరపురం), ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లావ్యాప్తంగా విస్తరించి ఉన్న అటవీ ప్రాంతంలో శనివారం పులుల గణన ప్రారంభం కానుంది. ఇప్పటికే రాపూరు, ఉదయగిరి, ఆత్మకూరు రేంజ్‌ల పరిధిలోని దాదాపు 1.50 హెక్టార్ల అటవీ ప్రాంతాన్ని టైగర్ కారిడార్‌గా మార్పు చేస్తూ కేంద్ర ప్రభుత్వం ఇటీవల నిర్ణయం తీసుకొన్నది. రాష్ట్రంలో అరుదుగా కనిపించే పులుల కదలికలు జిల్లాలోనూ గుర్తించారు. తిరుపతి వైపు శేషాచలం టైగర్ కారిడార్‌కు, ప్రకాశం జిల్లా వైపు నల్లమల టైగర్ కారిడార్‌కు మధ్యలో ఉన్న నెల్లూరు జిల్లా అటవీ ప్రాంతంలో పులుల కదలికలు పెరిగాయి.

● అటవీ సిబ్బందికి శిక్షణ

నాలుగేళ్లకు ఒకసారి జరిగే పులుల గణన మొదట నాగార్జనసాగర్, శ్రీశైలం టైగర్ రిజర్వు ఫారెస్టు ప్రాంతాల్లో పూర్తిచేశారు. శనివారం నుంచి ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాల పరిధిలోని నల్లమల, శేషాచలం టైగర్ కారిడార్ ప్రాంతాల్లో పులుల గణన జరగనున్నది. 45 రోజులపాటు అంటే ఏప్రిల్ 14వ తేదీ వరకు జరిగే గణన కోసం ఇప్పటికే రాపూరు, ఉదయగిరి, ఆత్మకూరు రేంజ్‌ల పరిధిలో 240 సీసీ కెమెరాలను అటవీశాఖ ఏర్పాటు చేసింది. పులుల గణన ఎలా చేయాలో అన్న అంశంపై అటవీ సిబ్బందికి నిపుణుల ద్వారా శిక్షణ కూడా ఇప్పించారు.

● 3 పులుల గుర్తింపు



ఆత్మకూరు రేంజ్‌లో గుర్తించిన పెద్దపులి


ఆత్మకూరు రేంజ్ పరిధిలో ఇప్పటికే మూడు పులులను అటవీ శాఖ గుర్తించింది. గత సంవత్సరం మర్రిపాడు మండలం కదిరినాయుడిపల్లి ప్రాంతంలో పులిని కారు ఢీకొన్న ఘటనతో అప్రమత్తమైన అటవీ అధికారులు అనేక చోట్ల సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. దీంతో ఆత్మకూరు, ఉదయగిరి, రాపూరు రేంజ్‌ల పరిధిలో మగ, ఆడపులుల పాదముద్రలను గుర్తించారు. అదేవిధంగా ఈ నెలలో (ఫిబ్రవరి) చిట్వేల్ ఘాట్‌లో కూడా ఓ పులిని గుర్తించారు. దీంతో జిల్లాలో మూడు పులులు ఉన్నట్లు తేలింది. అయితే శనివారం నుంచి జరగనున్న పులుల గణనలో జిల్లావ్యాప్తంగా ఎన్ని పులులు ఉన్నాయో స్పష్టత రానున్నట్లు అటవీ శాఖ అధికారులు తెలిపారు.

ఆశలు.. ఆకాంక్షలతో..

● పయ్యావుల పద్దులో సింహపురికి సముచిత స్థానం
● సాగునీటి ప్రాజెక్టులకు భారీగా నిధులు
● తెలుగుగంగ ప్రాజెక్టుకు రూ.345 కోట్లు
● సోమశిల జలాశయానికి రూ.266 కోట్లు
● యూనివర్సిటీ అభివృద్ధికి రూ.20.53 కోట్లు
● రామాయపట్నం పోర్టుకు రూ.100 కోట్లు
● తల్లులకు, మత్స్యకారులకు చేయూత

కూటమి ప్రభుత్వం తొలి బడ్జెట్ ప్రజల ఆశకు, ఆశయాలకు అనుగుణంగానే ఉందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. అభివృద్ధి-సంక్షేమం రెండు కళ్లు అనే కూటమి నినాదానికి ఈ బడ్జెట్ అనుగుణంగా ఉందని అభిప్రాయపడుతున్నారు. సాగునీటి ప్రాజెక్టులకు చెప్పుకోదగ్గ స్థాయిలో కేటాయింపులు జరిగాయి. అలాగే నిధుల కేటాయింపులతో పెండింగ్ ప్రాజెక్టుల పనుల్లోనూ కదలిక మొదలు కానుంది. ఇక తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ తదితర పథకాలకూ భారీగా నిధులు కేటాయించారు. మరోవైపు విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం, రామాయపట్నం పోర్టుకూ నిధులు విడుదల కానున్నాయి. మొత్తం మీద ఎన్డీఏ కూటమి ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాల ప్రజల్లో ఆనందం వ్యక్తమవుతోంది.





● ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి హామీ మేరకు ఒక కుటుంబంలో ఎంతమంది పిల్లలు చదువుతుంటే అంతమందికి ఒక్కొక్కరికి ఏడాదికి రూ. 15వేలు చొప్పున తల్లికి వందనం పథకం కింద తల్లుల ఖాతాల్లో జమ చేయనున్నారు, గత ప్రభుత్వ హయాంలో కుటుంబంలోని ఒక్క విద్యార్థికి మాత్రమే ఈ పథకాన్ని పరిమితం చేయడంతో లబ్ధిదారుల సంఖ్య 2.50 లక్షలకు మించలేదు. ఇందులోనూ ఏడాదికేడాది కోత పెడుతూ ఎన్నికల సంవత్సరం వచ్చే నాటికి 1.75 లక్షల మందికే అమ్మఒడి పథకాన్ని పరిమితం చేశారు. అయితే కూటమి ప్రభుత్వం ఈ పథకం వర్తించే క్రమం లో తల్లుల సంఖ్య పెద్దగా పెరగక పోయినా వారికి ఇచ్చే ఆర్థిక సాయం మాత్రం దాదాపు రెట్టింపు అయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో అమ్మఒడి కింద ఏడాదికి 262 కోట్లు పంపిణీ చేస్తుం డగా, కూటమి ప్రభుత్వంలో లబ్ధిపొందే విద్యార్థుల సంఖ్య 30 నుంచి 40 శాతం పెరగనున్న దృష్ట్యా తల్లికి వందనం పథకం ద్వారా జిల్లాలో ఏడాదికి రమారమి 350 కోట్ల రూపాయ లకుపైగా తల్లులకు పంపిణీ చేయనున్నారు.



● వీఎస్‌యూకు రూ.20.53 కోట్లు

ఇక విక్రమ సింహపురి యూనివర్సిటీకు కూడా బడ్జెట్‌లో రూ.20.53 కోట్లను కేటాయించారు. ఈ నిధులతో యూనివర్సిటీలో అభివృద్ధి పనులు చేపట్టడంతోపాటు కొత్త పరిశోధనలకు చేయూత లభించనుంది. అదే విధంగా రామాయపట్నం పోర్టు నిర్మాణానికి సంబంధించి రూ.100 కోట్లను కేటాయించారు.

● అన్నదాత సుఖీభవ పథకం కూడా ఈ ఏడాది నుంచే అమలులోకి రానుంది. వైసీపీ ప్రభుత్వంలో రైతు భరోసా కింద కేంద్ర, రాష్ట్ర పభుత్వాలు కలిపి రూ.12వేలు ఇచ్చేవి. అయితే కూటమి ప్రభుత్వం ఈ మొత్తాన్ని భారీగా పెంచింది. రాష్ట్ర వాటాగా ఒక్కో రైతుకు 14వేలు ఇస్తామని, కేంద్ర వాటా 6వేలుతో కలిపి మొత్తం రూ.20 వేలు ఇస్తామని ఎన్నికల హామీలో ప్రకటించింది. ఆ మేరకు ఇప్పుడు అన్నదాత సుఖీభవ పథకం కింద జిల్లా పరిధిలోని అర్హులైన రైతులు సుమారుగా 1.77 లక్షల మంది ఉన్నారు. వీరికి గత ప్రభుత్వం రూ.106 కోట్లు పంపిణీ చేయగా ప్రస్తుత కూటమి ప్రభుత్వం రూ.16వేలు చొప్పున రూ.247 కోట్లు పంపిణీ చేయనుంది. అంటే గత ప్రభుత్వంతో పోల్చితే కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం కింద పంపిణీ చేసే మొత్తం ఒకటిన్నర రెట్లు ఎక్కువ.



● ఇక మత్స్యకారులకు కూడా వేట నిషేధ సమయంలో ఇస్తున్న భృతిని పెంచనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఈ నిర్ణయంతో జిల్లాలో 12 వేల మందికిపైగా మత్స్యకారులకు మరింత చేయూత లభించనుంది.

నెల్లూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ శుక్రవారం ప్రవేశపెట్టిన 2025-26 బడ్జెట్‌లో జిల్లాకు సముచిత స్థానం దక్కింది. ప్రధానంగా సాగునీటి ప్రాజెక్టులకు ఊతమిచ్చేలా ప్రభుత్వం బడ్జెట్‌లో కేటాయింపులు జరిపింది. ఈ నిధులతో పెండింగ్ ప్రాజెక్టుల్లో వేగం పెరగనుంది. తెలుగుగంగ ప్రాజెక్టుకు రూ.345.48 కోట్లు కేటాయించారు. కండలేరు జలాశయంతోపాటు తెలుగుగంగ కెనాల్ వ్యవస్థ మొత్తం ఈ ప్రాజెక్టు కిందకు వస్తుంది. ఈ ప్రాజెక్టు పరిధిలో అనేక కాలువల నిర్మాణం జరుగుతోంది. అలానే సోమశిల ప్రాజెక్టుకు రూ.266 కోట్లు కేటాయించారు. ఇందులో రూ.150 కోట్ల వరకూ భూసేకరణకు కేటాయించడం విశేషం. ప్రస్తుతం సోమశిల హైలెవల్ కెనాల్‌కు భూసేకరణ పెద్ద సమస్యగా ఉంది. ఈ నిధులతో భూసేకరణ పూర్తయితే ప్రాజెక్టు వేగం పుంజుకోనుంది. అలాగే పెన్నా రివర్ కెనాల్ సిస్టమ్‌కు రూ.50.42 కోట్లు బడ్జెట్‌లో కేటాయించారు. డెల్టాలో ప్రస్తుతం



సర్వేపల్లి కాలువ, మలిదేవి డ్రెయిన్, పెన్నా ప్రొటెక్షన్ వాల్స్, ముదివర్తిపాలెం కాజ్‌వే వంటి కీలక పనులు జరుగుతున్నాయి. ప్రస్తుత బడ్జెట్‌లో కేటాయింపులతో ఆ పనులు ఊపందుకోనున్నాయి. కనుపూరు కాలువ అభివృద్ధికి రూ.7 కోట్లు ప్రభుత్వం కేటాయించింది. మరో కీలక ప్రాజెక్టు సోమశిల-స్వర్ణముఖి లింక్ కెనాల్‌కు ఈదఫా రూ.69 కోట్లు కేటాయించారు. వెంకటగిరి, శ్రీకాళహస్తి నియోజకవర్గాలకు తాగు, సాగునీరు అందించడంలో ఈ కాలువ కీలకంగా మారుతుంది. అయితే కొంతకాలంగా నిధులు లేక ఈ కాలువ పనులు సాగడం లేదు. మొత్తంగా ఎన్టీఆర్ తెలుగుగంగ ప్రాజెక్టు సర్కిల్‌కు రూ.840 కోట్లను ప్రభుత్వం కేటాయించింది. 2024-25లో రూ.887 కోట్లు కేటాయించినా చివరకు రూ.406 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. ఈదఫా రెట్టింపు కేటాయింపులు ఉన్న నేపథ్యంలో ఆ నిధులన్నింటినీ సక్రమంగా ఉపయోగించుకుంటే ప్రధాన ప్రాజెక్టులు, కాలువల రూపురేఖలు మారుతాయి.

సూపర్‌సిక్స్ పథకాలకు పంగనామాలు



రాష్ట్ర బడ్జెట్ అంతా డొల్లే. సూపర్ సిక్స్ పథకాలకు పంగనామాలు పెట్టారు. ప్రజల ఆకాంక్షలకు వ్యతిరేకంగా ఉంది. ఇది మంచి ప్రభుత్వం కాదని తొలి బడ్జెట్‌లోనే తేటతెల్లం అయింది. అన్నదాత సుఖీభవ పథకానికి రూ.6300 కోట్లు మాత్రమే కేటాయించటం అరకొరే. రాష్ట్రంలోని 54 లక్షల మంది రైతుల ఆశలపై నీళ్ల చల్లారు, కేంద్రం ఇచ్చే మ్యాచింగ్ గ్రాంట్ల కోసం రైతులను నిరీక్షించేటట్టు చేయటం సరికాదు. పండించిన పంటలకు గిట్టుబాటు ధర కూడా లేక రైతులు అల్లాడుతుంటే కేవలం రూ. 300 కోట్ల ధరల స్థిరీకరణ నిధిని ఇవ్వటం ద్రోహమే.

- చేవూరు దేవకుమార్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు

మ్యానిఫెస్టో అమలుకే ప్రాధాన్యం



అభివృద్ధి, సంక్షేమంతో పాటు మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీల అమలుకు బడ్జెట్‌లో అధిక ప్రాధాన్యత కల్పించారు. వ్యవసాయ, సాగునీటి రంగానికి అధిక నిధులు కేటాయించి రైతే రాజు అన్న నినాదానికి పెద్ద పీట వేశారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల అభివృద్ధికి బాటలు వేసేలా రాష్ట్ర బడ్జెట్ ఉంది. గత ప్రభుత్వం వివిధ పథకాల పేరుతో నిధులను దారి మళ్లించగా, కూటమి ప్రభుత్వం మాత్రం దారి మళ్లింపునకు అవకాశం లేకుండా బడ్జెట్‌ను రూపొందించింది.

- షేక్ అబ్దుల్ అజీజ్, నెల్లూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు

పేదల అభివృద్ధికి పెద్దపీట



కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పేదల అభివృద్ధికి పెద్ద పీట వేసింది. అణగారిన వర్గాలు ఆర్థికంగా ఎదిగేందుకు వీలుగా భారీగా నిధులు కేటాయించడం శుభపరిణామం. బీసీ సంక్షేమానికి రూ.23,260 కోట్లు, ఎస్సీ సంక్షేమానికి రూ.20,281 కోట్లు, ఎస్టీల సంక్షేమానికి రూ.8159 కోట్లు కేటాయించడం గొప్ప విషయం. ఎస్సీ, ఎస్టీలు నిర్మించుకనే ఇళ్లకు కూడా ఆర్థిక చేయూతను ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నారు. పట్టణాలను అభివృద్ధి చేయాలని నిర్ణయించిన ప్రభుత్వం ఆ మేరకు భారీగా నిధులను కేటాయించింది. ప్రభుత్వ కేటాయింపులతో రానున్న రోజుల్లో గుంతలు లేని రోడ్లను చూడవచ్చు.

- కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే

ప్రజల ఆకాంక్షల బడ్జెట్



రాష్ట్ర బడ్జెట్ అన్ని వర్గాల ఆకాంక్షలను ప్రతిబింబిస్తోంది. రాష్ట్ర పునఃనిర్మాణం దిశగా రూ.3.22 లక్షల కోట్లతో అభివృద్ధి, సంక్షేమమే ఎజెండాగా బడ్జెట్ కేటాయింపులు కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం. అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం పథకాలకు భారీ కేటాయింపులు చేయడం సంతోషించదగ్గ విషయం. వ్యవసాయ, జలవనరుల శాఖలకు కేటాయింపులు హర్షదాయకం. బీసీల సంక్షేమానికి సబ్ ప్లాన్ ద్వారా బడ్జెట్‌లో రూ.26.260 కేటాయించడం సంతోషకరం. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల అభివృద్ధికి బాటలు వేశారు. అభివృద్ధి ఫలాలు అందరికీ అందేలా కేటాయింపులు చేయడం కూటమి ప్రభుత్వానికే సాధ్యమైంది.

- వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, నెల్లూరు ఎంపీ

వ్యవసాయ రంగానికి మంచి రోజులు



వైసీపీ ప్రభుత్వంలో నిర్వీర్యమైపోయిన వ్యవసాయ రంగానికి మంచి రోజులొచ్చాయి. బడ్జెట్‌లో వ్యవసాయం, సాగునీటి ప్రాజెక్టులకు పెద్దపీట దక్కింది. డ్రిప్ ఇరిగేషన్‌కు పూర్వవైభవం రావడంతో మెట్ట రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. ఎన్టీఆర్ తెలుగుగంగ ప్రాజెక్టుకు రూ.840 కోట్లు కేటాయించడం గొప్ప విషయం. ఈ నిధులతో ఉమ్మడి నెల్లూరు జిల్లాలో అనేక కీలక ప్రాజెక్టుల్లో ముందడుగు పడుతుంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకే కాకుండా ఆర్థికంగా వెనుకబడిన వర్గాల కోసం స్వయం ఉపాధికి నిధులు కేటాయించారు.

- సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, సర్వేపల్లి ఎమ్మెల్యే

సంక్షేమానికి పెద్దపీట



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో సంక్షేమానికి పెద్ద పీట వేస్తూ నిధులు కేటాయించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ పథకాలు కొనసాగించే దిశగా నిధుల కేటాయింపు జరిగింది. పిల్లల చదువును ప్రోత్సహించేందుకు ఇంట్లో చదువుతున్న పిల్లలందరికీ తల్లికి వందనం అందచేసేందుకూ కేటాయింపులు జరిగాయి. వ్యవసాయానికి ప్రాధాన్యత నిస్తూ కేటాయింపులు పెంచారు. సంక్షేమం, అభివృద్ధికి సమపాళ్లలో ప్రాధాన్యం ఇచ్చారు. మొత్తం మీద అన్ని వర్గాలకు ఆమోదయోగ్యంగా బడ్జెట్ ఉంది.

- దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి, ఎమ్మెల్యే, కావలి

ఇది ప్రజల ఆకాంక్షల బడ్జెట్



కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజల ఆకాంక్షల బడ్జెట్ అని, అద్భుతంగా ఉంది. అభివృద్ధి, సంక్షేమంతోపాటు హామీల అమలుకు బడ్జెట్‌లో ప్రాధాన్యతిచ్చారు. అన్నివర్గాల ప్రజలను బడ్జెట్ ఆకర్షిస్తోంది. రాష్ట్ర పునర్నిర్మాణం దిశగా రూ.3.22 లక్షల కోట్లతో అభివృద్ధి, సంక్షేమం కోసం బడ్జెట్ కేటాయింపులు చేయడం కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం. అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం పథకాలకు భారీగా నిధులు మంజూరు చేశారు.

- కాకర్ల సురేష్, ఉదయగిరి ఎమ్మెల్యే

మాట నిలబెట్టుకొంటున్న ప్రభుత్వం



ఇది మాట నిలబెట్టుకునే ప్రభుత్వం. బడ్జెట్ కేటాయింపులే ఇందుకు నిదర్శనం. ఆర్థికంగా రాష్ట్రం ఒడిదుడుకుల్లో ఉన్నా ఇచ్చిన మాట ప్రకారం సీఎం చంద్రబాబు సూపర్ సిక్స్‌లోని ఒక్కో హామీని నెరవేర్చుకొంటూ వస్తున్నారు. ఈ బడ్జెట్‌లో తల్లికి వందనం ద్వారా తల్లులకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాము. అన్నదాత సుఖీభవ పథకం కింద గత ప్రభుత్వం ఇచ్చిన దానికంటే రెండున్నర రెట్లు అధికంగా రైతులకు పంపిణీ చేయనున్నాము. మున్సిపాలిటీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ఈ బడ్జెట్‌లో పెద్ద పీట వేశాము.

- పొంగూరు నారాయణ, రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి

తొలిసారిగా తెలుగుభాషకు రూ.10 కోట్లు



రాష్ట్ర బడ్జెట్‌లో అభివృద్ధి, సంక్షేమంతో పాటు హామీల అమలుకు అధిక ప్రాధాన్యత ఇచ్చారు. వ్యవసాయ రంగాన్ని ఆదుకుంటాం అన్న ఎన్నికల నినాదాన్ని బడ్జెట్‌లో కేటాయింపుల ద్వారా ఆచరణలో అమలు చేసి చూపించడం హర్షణీయం. బీసీల సంక్షేమానికి సబ్ ప్లాన్‌తోపాటు ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల అభివృద్ధికి బాటలు వేయడం ప్రశంసనీయం. తొలిసారిగా తెలుగు బాషకు రాష్ట్ర ప్రభుత్వం రూ.10 కోట్ల కేటాయింపు అభినందనీయం. విద్య, వైద్య, పారిశ్రామిక రంగాలకు పెద్ద పీట వేస్తూనే మరోవైపు పేదలు, మధ్య తరగతి వర్గాల ప్రజల సంక్షేమానికి బాటలు వేసి అన్ని వర్గాలకు సమన్యాయం చేసే బడ్జెట్ ఇది.

- వేమిరెడ్డి, ప్రశాంతిరెడ్డి, కోవూరు ఎమ్మెల్యే

ఉద్యాన కళాశాలకు నిధులు..



ముఖ్యమంత్రి చంద్రబాబు బడ్జెట్ రూపకల్పనలో తన పాలనాదక్షతను నిరూపించారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి వరంలా భావిస్తున్న వెలిగొండ ప్రాజెక్టును ఈ ఏడాదిలోనే పూర్తిచేసి నీరందించేలా బడ్జెట్‌లో కేటాయింపులు చేయడం హర్షనీయం. కందుకూరు విషయానికొస్తే ఉద్యాన కళాశాలకు శాశ్వత భవనాల నిర్మాణం కోసం ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయించారు. అలాగే యువతకు ఉపాధి కల్పనే లక్ష్యంగా కందుకూరులో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు కోసం భవనాల నిర్మాణానికి కూడా ఈ బడ్జెట్‌లో స్థానం కల్పించడం సంతోషదాయకం.

- ఇంటూరి నాగేశ్వరరావు, కందుకూరు ఎమ్మెల్యే



● బడ్జెట్‌పై ఏమంటున్నారంటే..

అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట

● టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చెంచలబాబు



ఉదయగిరి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్‌లో అభివృద్ధి, సంక్షేమానికి పెద్ద పీట వేశారని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చెంచల బాబుయాదవ్ శుక్రవారం పేర్కొన్నారు. బడ్జెట్‌లో బలహీన వర్గాల కోసం రూ. 47 వేల కోట్లు, ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి రూ.28వేల కోట్లు కేటాయించడం అభినందనీయమన్నారు.

రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం చంద్రబాబు ధ్యేయం

● బీజేపీ నేత కుడుముల



ఆత్మకూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం శుక్రవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో అభివృద్ధి, సంక్షేమానికి పెద్ద పీట వేశారని బీజేపీ సీనియర్ నాయకుడు, ఆత్మకూరు మాజీ ఏఎంసీ చైర్మన్ కుడుముల సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. వ్యవసాయం దగ్గర నుంచి సాగునీటి ప్రాజెక్టులు, రహదారులు, అమరావతి, పోలవరం అభివృద్ధికి నిధులు కేటాయించడంతోపాటు ఎన్టీఆర్ భరోసా, దీపం-2 పథకంలో ఉచిత గ్యాస్, ఎస్సీ, ఎస్టీ, చేనేత, నాయీబ్రాహ్మణులకు ఉచిత విద్యుత్, బీసీలకు రుణాలు, వంటి సంక్షేమ పథకాలకు బడ్జెట్‌లో పెద్దఎత్తున నిధులు కేటాయించారన్నారు. సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించడంతో జిల్లాకు వరప్రసాదిని అయిన సోమశిల జలాశయ ప్రాజెక్టు ఆప్రాన్ పనులు జరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆరోగ్య రంగానికి ప్రత్యేక నిధులు కేటాయించడం హర్షణీయమన్నారు. కూటమి ప్రభుత్వం కేంద్రంలోని నరేంద్రమోడీ సహకారంతో భారీస్థాయిలో నిధులు రాబట్టి అభివృద్ధి, సంక్షేమాన్ని పరుగులు పెట్టించడంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి కృషి అభినందనీయమన్నారు.

నిరాశ పరిచింది!

● కాకు వెంకటయ్య, జిల్లా రైతు సంఘం నాయకుడు



ఉదయగిరి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాల ప్రజలను నిరాశపర్చిందని జిల్లా రైతు సంఘం నాయకుడు కాకు వెంకటయ్య పేర్కొన్నారు. విద్య, వైద్యం, రైతు, యువత సంక్షేమం కోసం బడ్జెట్‌లో కేటాయింపులు అరకొరగా ఉన్నాయన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ధరల స్థిరీ కరణ కింద గత ప్రభుత్వం రూ.3 వేల కోట్లు కేటాయిస్తే ప్రస్తుతం రూ. 300 కోట్లు కేటాయించడం సంతృప్తికరంగా లేదన్నారు. జలాశయాలకు సైతం అరకొరగా నిధులు కేటాయించడం దారుణమన్నారు.

న్యాయవాదుల నిరసన



నిరసన తెలుపుతున్న న్యాయవాదులు


ఆత్మకూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): న్యాయవాదులు విధులు బహిష్కరించి శుక్రవారం స్థానిక కోర్టు ముందు నిరసన చేపట్టారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ పిలుపు మేరకు పట్టణంలోని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నిరసన చేపట్టారు. న్యాయవాదుల భవిష్యత్తుకు విఘాతం కలిగించే చట్టాలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు బార్ కౌన్సిల్ అధ్యక్షుడు సిరాజుద్దీన్, సెక్రటరీ ఖాజా రసూల్, సీనియర్ న్యాయవాదులు ఎల్వీ రమణయ్య, షేక్ నజీర్, కెవి శేషారెడ్డి పాల్గొన్నారు.

పొగాకు బోర్డును సందర్శించిన ఏడీ

మర్రిపాడు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : డీసీపల్లి పొగాకు బోర్డును శుక్రవారం ఎగ్జిక్యూటివ్ డైరెక్టరు అద్దంకి శ్రీధర్‌బాబు సందర్శించారు. పొగాకు సాగులో మెళకువలను రైతులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయనను సన్మానించారు. ఈ కార్యక్రమంలో బోర్డు ప్రాంతీయాధికారి లక్ష్మణరావు, వేలం నిర్వహణాధికారి (అక్షన్) రామాంజ నేయులు, డీసీపల్లి బోర్డు వేలం నిర్వహణాధికారి జి రాజశేఖర్, రైతు సంఘం నాయకులు నరసపనాయుడు, జనార్ధన్ నాయుడు పాల్గొన్నారు.

'గండిపాలెం' నిర్వహణ గాలికొదిలేశారు

● వైసీపీ పాలనలో విడుదల కాని నిధులు ● సాగునీటికి నోచుకోని రైతులు



అడవిని తలపిస్తున్న కట్ట రివిట్‌మెంట్

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి, వరికుంటపాడు మండలాలకు సాగు, తాగు నీరు అందించే గండిపాళెం జలాశయం నిర్వహణపై గత వైసీపీ ప్రభుత్వం అలసత్వం ప్రదర్శించడం రైతుల పాలిట శాపంగా మారింది. పంటల సాగు చేసిన రైతులకు సాగునీరు అందని ద్రాక్షగానే ఊరిస్తోంది. కుడి కాలువల పరిధిలో 5వేల ఎకరాలు, ఎడమ కాలువ పరిధిలో 11వేల ఎకరాల ఆయకట్టు భూములకు సాగు నీరు అందించేందుకు రూపకల్పన చేసినా ఏళ్ల తరబడి సగభాగం ఆయకట్టుకు కూడా నీరందే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు.

నిర్వహణ మరిచిన వైసీపీ ప్రభుత్వం

గత ప్రభుత్వ హయాంలో జలాశయ నిర్వహణను అప్పటి పాలకులు పూర్తిగా గాలికొదిలేశారు. అతిథిగృహం పూర్తిస్థాయి మరమ్మతులకు నోచుకోక కనీసం కిటికీలకు అద్దాలు కూడా లేని పరిస్థితి దాపురించింది. ప్రాంగణాన్ని శుభ్రం చేసే నాథులు కరువవడంతో అపరిశుభ్రంగా మారి వెక్కిరిస్తోంది. కంపచెట్లతో నిండిన కట్ట రివిట్‌మెంట్ అడవిని తలపిస్తుండడంతో నెర్రెలుబారి తెగే ప్రమాదముంది. దీంతో అటుగా వెళ్లిన సందర్శకులు కాసేపు సేదతీరే అవకాశం కూడా లేకుండా పోయింది. ప్రధాన రహదారులకు ఇరువైపులా అదే పరిస్థితి నెలకొంది. అంతేగాక రాత్రి సమయంలో దీపాలు వెలిగే పరిస్థితి లేకపోవడంతో జలాశయం అంధకారంలో చిక్కుకొంది. అడిగేవారు లేరులే అన్న ధీమాతో ఆకతాయిలు తమ అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా ప్రాంగణాన్ని మార్చుకొని ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. దీంతో ఎటువైపు చూసినా ఖాళీ మద్యం సీసాలు, ప్లాస్టిక్ కవర్లు, ఇతర వ్యర్థాలు దర్శనమిస్తుండడంతో ప్రజలు, సందర్శ కులు అధికారుల తీరుపై మండిపడుతున్నారు.

కూటమి ప్రభుత్వంపైనే ఆయకట్టు రైతుల ఆశలు

ఇటీవల కాలంలో ఆయకట్టు రైతులు కూటమి ప్రభుత్వంపైనే ఎంతో ఆశతో ఎదురుచూస్తున్న తరుణంలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ప్రత్యేక చొరవ తీసుకుని సుమారు రూ.20 లక్షల వరకు కాలువలకు మరమ్మతులకు నిధులు మంజూరు చేయించారు. అధ్వానంగా మారిన ఆయా కాలువల మరమ్మతు పనులు చేపట్టి పంటల సాగుకు అనుకూలంగా సాగునీటిని సైతం విడుదల చేశారు. అయితే ఏళ్ల తరబడి పూర్తిస్థాయి ఆయకట్టుకు నోచుకోకపోవడంతో రైతులు తమ పొలాలను సాగు చేసుకునేందుకు నానా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు దృష్టి సారించి జలాశయంతోపాటు కాలువలను పూర్తిస్థాయిలో ఆధునికీకరించి ఆయకట్టు రైతులందరికీ సాగునీరు అందేలా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం

● సివి.రామన్‌కు నివాళులు
● ఆకట్టుకున్న ప్రదర్శనలు

సంగం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో విద్యార్థులు తయారుచేసిన సైన్స్ నమూనాలను ప్రదర్శించారు. అందులో భాగంగా సంగం, గాంధీజనసంఘం, దువ్వూరు, తరుణవాయి, కొరిమెర్ల, మర్రిపాడు, అన్నారెడ్డిపాళెం ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులు ప్రదర్శించిన ప్రయోగాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

●కలువాయి: విద్యార్థులకు శాస్త్రీయ దృక్పథాన్ని అలవాటు చేయాలని తెలుగురాయపురం ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం జీవీ మురళీకృష్ణ అన్నారు. శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా పాఠశాలలో భౌతికశాస్త్రవేత్త సివి రామన్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆర్‌వీ కృష్ణారెడ్డి, ఎస్‌ఎంసీ కమిటీ చైర్మన్ అమృత, విద్యార్థులు పాల్గొన్నారు.

●ఉదయగిరి: సైన్స్ దినోత్సవం సందర్భంగా వెంగళరావునగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంఈవో-2 శ్రీనివాసులు ఉపాధ్యాయులతో కలిసి విజ్ఞాన శాస్త్రవేత్త సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులు ప్రదర్శించిన ప్రయోగాలను పరిశీలించి ఉత్తమ ప్రయోగాలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నూర్జహాన్, నాయబ్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

●దుత్తలూరు(ఉదయగిరి): మండలంలోని అన్ని పాఠశాలల్లో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవ వేడు కలను ఘనంగా నిర్వహించారు. అలాగే స్థానిక విశ్వతేజ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన ప్రయోగాలను నర్రవాడ పీ హెచ్‌సీ వైద్యాధికారి హరీష్‌రెడ్డి పరిశీలించి విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈకార్యక్రమంలో కరస్పాండెంట్ వాసుదేవరెడ్డి, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

●అనంతసాగరం: మండలంలోని కామి రెడ్డిపాడు, చిలకలమర్రి ఉన్నత పాఠశాల్లో సీవీ రామన్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. హెచ్‌ఎంలు వసుంధ రాదేవి, సురేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

●వరికుంటపాడు (ఉదయగిరి రూరల్): : విద్యార్థి దశనుంచే వైజ్ఞానిక అంశాలపై దృష్టి సారించాలని జేవీవీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కుమ్మిత శ్రీనివాసులురెడ్డి అన్నారు. శుక్రవారం పెద్దిరెడ్డిపల్లి ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులకు క్విజ్, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మండల బాధ్యులు చలం, రమణయ్య, ఉపాధ్యాయులు నాగార్జున, గోపి, శ్రీహరి, చినరామయ్య, జలీల్‌సుల్తాన్, విద్యార్థులు పాల్గొన్నారు.



కలువాయి: సివి.రామన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు.

అలాగే, స్థానిక ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు షేక్ మౌలాలీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

●సీతారామపురం: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఏపీ మోడల్ స్కూల్‌లో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, రెహమాన్‌ల ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు. సివి రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

●వింజమూరు : స్థానిక ఇన్‌ఫాంట్ జీసస్ ఇంగ్లీషు మీడియం పాఠశాలలో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

● జడ్పీ సీఈవో విద్యారమ



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ సీఈవో విద్యారమ

సంగం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): వేసవి కాలంలో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపడుతున్నామని జడ్పీ సీఈవో విద్యారమ పేర్కొన్నారు. శుక్రవారం ఆమె స్థానిక మండల పరిషత్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె రికార్డులను పరిశీలించి మండలంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ఎంపీడీవో షాలెట్‌ను అడిగి తెలుసుకున్నారు. పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో 31 (సీపీడబ్ల్యుఎస్) సమగ్ర రక్షిత నీటి సరఫరా పథకాలు ఎలా పనిచేస్తున్నాయో తెలుసుకుని వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపడుతున్నామన్నారు. అంతేకాకుండా గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు క్రాష్ ప్రోగ్రాం చేపడుతున్నామన్నారు. చేతిపంపులు మరమ్మతులు చేసుకునేందుకు మండలానికి రూ. 25వేల నుంచి 30 వేలు మంజూరు చేస్తున్నామన్నారు. పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా ఇటీవల జిల్లాలోని 222 చెత్తసంపద కేంద్రాలను ప్రారంభించినట్లు తెలిపారు. జిల్లాలో 50 గ్రామాలను ఓడీయస్ గ్రామాలుగా ఎంపిక చేయడం జరిగిందన్నారు. పంచాయతీ కార్యదర్శులు ప్రతి నెలా మూడో శనివారం పారిశుధ్య కార్యక్రమాలు తప్పక చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్డీ వరప్రసాద్ పాల్గొన్నారు.

నూరు శాతం పన్నులు వసూలు చేయాలి:డీఎల్‌పీవో

ఉదయగిరి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు డివిజన్ పరిధిలోని అన్ని పంచాయతీల్లో నూరు శాతం పన్నులు చేయాలని డీఎల్‌పీవో నయూమ్‌తాజ్‌హుస్సేన్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఉదయగిరి, సీతారామపురం పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 10 నాటికి 60, మార్చి 31వ తేదీ నాటికి నూరుశాతం పన్నులు వసూలు చేయాలన్నారు. పంచాయతీ కార్యాలయంలో 35 రికార్డులను నిర్వహించాలన్నారు. పంచాయతీల్లో ఏర్పాటు చేసిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలన్నారు. అలాగే స్థానిక పంచాయతీ కార్యాలయంలో మరమ్మతులకు గురైన ఆటోలు, రిక్షాలకు నిర్వహించిన వేలంపాటలు కొన్ని అనివార్య కారణాల వాయిదా పడ్డాయని, తిరిగి ఎప్పుడు నిర్వహించేది ప్రకటిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అప్పాజీ, ఈవోపీఆర్డీ కరీముల్లా, సర్పంచ్ సామ్రాజ్యం, ఉప సర్పంచ్ ముర్తుజాహుస్సేన్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణపై అవగాహన

సంగం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిద్దీపురంలో డివిజనల్ పంచాయతీ అధికారి నయూమ్ తాజ్ హసన్ ఆధ్వర్యంలో శుక్రవారం రహదారులపై పశువుల ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పశువుల కొమ్ములకు రేడియం స్టిక్కర్ అంటించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ, రాష్ట్ర రహదారులపై ప్రమాదాల నివారణకు యజమానులు పశువుల కొమ్ములకు రేడియం స్టిక్కర్లు అంటిస్తే వాహనదారులకు స్పష్టంగా కనిపిస్తాయని, దీనివల్ల ప్రమాదాలు నివారించవచ్చునని తెలిపారు.

లక్ష్యాలను అధిగమించాలి:ఎంపీడీవో



సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీవో అప్పాజీ

ఉదయగిరి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ సిబ్బందికి కేటాయించిన లక్ష్యాలను నూరు శాతం అధిగమించాలని ఎంపీడీవో అప్పాజీ, ఏపీవో శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక స్త్రీశక్తి భవనంలో సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మండలానికి 270 ఫారంపాండ్స్ మంజూరుకాగా ఇప్పటివరకు 112 ఏర్పాటుచేయడం జరిగిందని, మిగిలిన పనులు సైతం త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. గోకులం షెడ్ నిర్మాణ పనులు వేగవంతం చేయాలన్నారు. ప్రతి 50 మంది కూలీలు ఒక శ్రమశక్తి సంఘాన్ని ఏర్పాటు చేసుకోవాలన్నారు. వేసవి దృష్ట్యా పనుల వద్ద కూలీలకు వస తులు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్లు, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

ఇళ్లు నిర్మించుకున్న వారికి రిజిస్ట్రేషన్ సౌకర్యం

చేజర్ల, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఎటువంటి ఆక్షేపణలేని ప్రభుత్వ భూముల్లో ఇళ్లు నిర్మించుకున్న వారికి ప్రభుత్వం రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పిస్తున్నట్లు తహసీల్దారు బి మురళి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ, అనాధీనం భూముల్లో 150 నుంచి 300 చదరపు గజాల స్థలంలో ఇల్లు నిర్మించుకున్న తెల్లరేషన్ కార్డు కలిగిన వారికి భూమి విలువల్లో 15 శాతం మినహాయింపు సౌకర్యం కల్పించి 50 శాతం తగ్గింపుతో రిజిస్ట్రేషన్, 301 నుండి 450 చదరపు గజాల స్థలంలో ఇల్లు నిర్మించుకున్న వారికి భూమి విలువ రెండు వందల శాతం చలానా రూపంలో నగదు చెల్లించి రిజిస్ట్రేషన్ ఫీజుతో ప్రభుత్వం జీవో నెం.30 ఆదేశాలతో భూములు క్రమబద్ధీకరణ ద్వారా రిజిస్ట్రేషన్ చేయించి పత్రాలను అందజేస్తామని పేర్కొన్నారు. 16.10.2019కి ముందు ఇంటి వసతి లేకుండా అనధికారికంగా ప్రభుత్వ స్థలాలలో ఎలాంటి తగాదాలు, ఆక్షేపణలు లేకుండా ఇల్లు నిర్మించుకుని ఉంటే అటువంటి వారు దగ్గరలోని సచివాలయం, ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దారు తెలియజేశారు.

వైభవంగా భీమేశ్వరుడికి గజవాహనసేవ



గజవాహనంపై ఊరేగుతున్న భీమేశ్వరుడు

సంగం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వంగల్లు భీమేశ్వరాలయంలో జరుగుతున్న మహాశివరాత్రి వేడుకల్లో భాగంగా శుక్రవారం తెల్లవారుజామున భీమేశ్వరస్వామి గజవాహన సేవ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా కామాక్షిదేవి, భీమేశ్వర స్వామి ఉత్సవ విగ్రహాలను గజవాహనంపై ఉంచి గజపూలమాలలతో అలంకరించారు. అనంతరం జరిగిన గ్రామోత్సవానికి భక్తులు కర్పూర హారతులతో స్వాగతం పలికి మొక్కులు తీర్చుకున్నారు.

56 ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

● జాయింట్ కలెక్టర్ కార్తీక్

సంగం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు నియోజకవర్గంలో 56 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు జాయింట్ కలెక్టర్ కార్తీక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు పండించిన ధాన్యానికి మద్దతు ధర కల్పించడమే లక్ష్యంగా ఈ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేసినట్లు ఆయన పేర్కొన్నారు. నియోజకవర్గంలో ఆత్మకూరు మండలంలో మహిమలూరు, నువ్వూరుపాడు, ఆత్మకూరు మున్సిపాలిటీ, వాసిలి, వెన్నవాడ, కరటంపాడు, బట్టేపాడు, మురగళ్ల, అప్పారావుపాళెం, బొయిళ్లచెరువెళ్ల , సీహెచ్ యడవల్లి మొత్తం 12 ధాన్యం కొనుగోలు కేంద్రాలు, అనంతసాగరం మండలంలో అనంతసాగరం -1, రేవూరు, దేవరాయపల్లి, బిట్-1, మినగల్లు, లింగంగుంట, కొత్తపల్లి, ఆమనిచిరువెళ్ల, వరికుంటపాడు, పాతాలపల్లి, పడమటికంభంపాడు, చిలకలమర్రి, అనంతసాగరం -2, అదేవిధంగా ఏయస్‌పేటలో కొండమీద కొండూరు, పెద్దబ్బీపురం, గుడిపాడు, జమ్మవరం, శ్రీకొలను, గుంపర్లపాడు, అనుమసముద్రం రాజవోలు, చిరమన, సంగం మండలంలో అన్నారెడ్డిపాళెం, సిద్దీపురం, పడమటిపాళెం, దువ్వూరు, వంగల్లు, మర్రిపాడు, తరుణవాయి, కొరిమెర్ల, సంగం-1, 3 కేంద్రాలు, మర్రిపాడు మండలంలో బూదవాడ, బీమవరం, చేజర్ల మండలంలో చేజర్ల, కోటితీర్థం, మాముడూరు, నాగులవెల్లటూరు, పాతపాడు, పెరుమాళ్లపాడు, తిమ్మాయిపాళెం, తూర్పుపల్లి, యామదల, వేటూరు రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన ప్రకటనలో పేర్కొన్నారు.

బాధ్యతగా విధులు నిర్వహించాలి

ఉదయగిరి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం నుంచి జరిగే ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల నిర్వహణకు నియమించిన ఇన్విజిలేటర్లు పరీక్షా కేంద్రంలో బాధ్యతగా విధులు నిర్వహించాలని పరీక్షా కేంద్రం చీఫ్ సూపరిండెంటెంట్, డిపార్టుమెంట్ అధికారిణి ఎం.వాసు, జమునలు కోరారు. శుక్రవారం స్థానిక కళాశాలలో ఇన్విజిలేటర్లతో సమావేశం నిర్వహించారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూసుకోవాలని, మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని ఇన్విజిలేటర్లకు సూచించారు. పరీక్షా కేంద్రంలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు.

3లోపు సర్వే పూర్తి చేయాలి : ఎంపీడీవో

ఆత్మకూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో నిర్వహిస్తున్న పీ4 సర్వేను మార్చి 3వ తేదీ లోపు పూర్తిచేయాలని ఎంపీడీవో ఐజాక్ ప్రవీణ్ సచివాలయ సిబ్బందికి సూచించారు. శుక్రవారం ఆయన నువ్వూరుపాడు సచివాలయం పరిధిలో ఇంటింట జరుగుతున్న సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సర్వే ఆధారంగా పేదరికంలో ఉన్న 20 శాతం ప్రజల జీవనోపాధులు మెరుగుపరచడంలో తగిన ప్రణాళికలు రూపొందించడం జరుగుతుందన్నారు.

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ఉదయగిరి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరు కీటక జనిత వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని గండిపాళెం పీహెచ్‌సీ ఆరోగ్య బోధకుడు వెంకటసుబ్బయ్య, మలేరియా సబ్ యూనిట్ అధికారి నౌషాద్‌బాబు సూచించారు. శుక్రవారం మండలంలోని అప్పసముద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులకు కీటక జనిత వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటిస్తూ ప్రతి శుక్రవారం నివాసంలో డ్రైడే పాటించాలన్నారు. ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు విజయకుమార్, ఉపాధ్యాయులు, వైద్యఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేర వార్తలు crime news ఆంధ్రజ్యోతి



రెండు వర్గాల వారితో మాట్లాడుతున్న పోలీసులు

శ్మశాన స్థలంపై వివాదం

● దహన సంస్కారం విషయమై ఉద్రిక్తత
● పోలీసు, రెవెన్యూ శాఖల రంగ ప్రవేశంతో సద్దుమణిగిన వివాదం
● శాశ్వత పరిష్కారం చూపాలంటూ దళితుల డిమాండ్

వెంకటాచలం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామదాసుకండ్రిగ పంచాయతీ నాయుడుపాళెం గ్రామంలో శుక్రవారం శ్మశాన స్థలం విషయమై రెండు వర్గాల మధ్య తీవ్ర వివాదం నెలకొనడంతో ఉద్రిక్తత నెలకొంది. వివరాల్లోకి వెళితే దళిత వర్గానికి చెందిన తాటిపర్తి ఏడుకొండలు (40) అనారోగ్యంతో మృతి చెందాడు. దహన సంస్కారాలు నిర్వహించేందుకు శ్మశానానికి తీసుకెళ్లారు. అక్కడ ఇది తమ శ్మశానం అంటూ ఇక్కడ దహన సంస్కారాలు చేయడానికి వీలులేదని బీసీలు (వడ్డెరలు) అడ్డుకున్నారు. దీంతో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. పోలీస్, రెవెన్యూ శాఖలకు సమాచారం అందడంతో వారు హుటాహుటిన అక్కడకు చేరుకుని రెండువర్గాల వారితో చర్చలు జరిపి వివాదాన్ని సద్దుమణిగించారు. కాగా, దళితులు మాత్రం తమ శ్మశాన స్థలాన్ని బీసీ వర్గానికి చెందిన ఒక వ్యక్తి ఆక్రమించుకొని మిర్చి సాగు చేస్తున్నాడని, గతంలో కూడా ఇదే మాదిరిగా ఇద్దరికి ఇక్కడే దహనసంస్కారాలు నిర్వహించామని, ప్రస్తుతం దహన సంస్కారాలు నిర్వహిస్తుంటే బీసీలు వచ్చి అడ్డుకుని వారి శ్మశాన స్థలం అంటున్నారని, ఆక్రమణకు గురైన తమ శ్మశాన స్థలాన్ని తమకు అప్పగించాలని అధికారులను వారు డిమాండ్ చేశారు. ఈవిషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. చివరకు దళితుల శ్మశానం పక్కనే దహనసంస్కారాలు నిర్వహించారు.

మా బిడ్డను అల్లుడే చంపేశాడు

● యువతి తల్లిదండ్రుల రోదన
● నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు



కన్నీరు పెట్టుకుంటున్న మృతురాలి తల్లి

నెల్లూరు(క్రైం), ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): తమ బిడ్డ ఆత్మహత్యకు ఆమె భర్తే కారణం, వాడిని చంపేసి నా బిడ్డతో పాటు పంపండి అంటూ ఓ యువతి తల్లిదండ్రులు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి మార్చురీ వద్ద శుక్రవారం గుండెలు బాదుకుంటూ కన్నీటి సంద్రంలో మునిగి పోయారు. బిడ్డను అల్లారు ముద్దుగా పెంచుకున్నామని, డబ్బు కోసమే భర్త చంపేశాడని ఆరోపించారు.



శివప్రియ(ఫైల్)

పొదలకూరు మండలం మర్రిపల్లి గ్రామానికి చెందిన పిచిరెడ్డి పెద్ద కుమార్తె శివప్రియ (25) నగరంలోని ఓ ప్రైవేటు కళాశాలలో డిగ్రీ చదవుతుండగా నెల్లూరు రూరల్ మండలం కాకుపల్లికి చెందిన శేషసాయిని ప్రేమ వివాహం చేసుకుంది. వారికి ఒక బిడ్డ కలిగాడు. ఇటీవల ఆ కుటుంబం నవాబుపేటకు కాపురం వచ్చింది. అప్పటి నుంచి శివప్రియ తల్లిదండ్రులకు ఫోన్ చేసి తన భర్త తనతో గొడవ పడుతున్నాడని, శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నాడని, అనవసరంగా పెళ్లి చేసుకున్నానని చెప్పి బాధపడుతూ ఉండేది. ఈ క్రమంలో గురువారం శేషసాయి పిచ్చిరెడ్డికి ఫోన్ చేసి శివప్రియ మరణించినట్లు చెప్పాడు. దీంతో తల్లిదండ్రులు నెల్లూరు చేరుకుని అల్లుడిని నిలదీశారు. ఇంట్లో ఉరి వేసుకుందని చెప్పాడు. ఈ ఘటనపై గురువారం రాత్రి నవాబుపేట పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా, కుమార్తె మృతికి కారణమైన శేషసాయిపై చర్యలు తీసుకొని న్యాయం చేయాలని కోరుతూ నవాబుపేట పోలీసులకు శివప్రియ తండ్రి పిచ్చిరెడ్డి ఫిర్యాదు చేశారు.

మద్యం, మటన్ లాగించి ఇంజనీరు మృతి

● కుర్చీలో కూర్చున్నోడు కూర్చున్నట్లే..!



కుర్చీలో రఘురామ్ మృతదేహం

నెల్లూరు రూరల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : ఓ ఇంజనీరు ఫుల్లుగా మద్యం సేవించి, మూడు ప్యాకెట్ల సిగరెట్లు తాగి, మటన్ బిరియాని తింటూ మరణించాడు. ఈ ఘటన నెల్లూరు రూరల్ ధనలక్ష్మీపురం వద్దనున్న కల్పన రెసిడెన్సీలో శుక్రవారం వెలుగు చూసింది. రూరల్ సీఐ గుంజి వేణు అందించిన వివరాలు మేరకు.. ఉమ్మడి గుంటూరు జిల్లా బాపట్ల సూర్యలంక రోడ్డుకు చెందిన చాపల రఘురామ్ (40) నెల్లూరు జిల్లాలోని అమేజింగ్ కంపెనీలో ఇంజనీరుగా పని చేస్తున్నారు. ఈ నెల 14వ తేదీన నెల్లూరు వచ్చారు. అప్పట్నుంచి ధనలక్ష్మీపురం కేజీకే కల్యాణ మండపం అనుబంధ కల్పన రెసిడెన్సీలో గది అద్దెకు తీసుకుని సహచర ఉద్యోగి భగవాన్‌తో కలిసి ఉంటున్నాడు. గురువారం రాత్రి కుర్చీలో కూర్చుని ఒక హాఫ్, రెండు క్వార్టర్ బాటిళ్ల మందు తాగాడు. మూడు ప్యాకెట్ల సిగిరెట్లు కాల్చాడు. మటన్ బిరియానీ ఆర్డర్ చేసి తెప్పించుకుని తింటూ అదే కుర్చీలో వెనుకకు వాలి ప్రాణాలు కోల్పోయాడు. పక్కన నిద్రపోతున్న సహచర ఉద్యోగి శుక్రవారం ఉదయం లేచి చూసుకునే సరికి రఘురామ్ నిర్జీవంగా ఉన్నాడు. దీంతో హోటల్ సిబ్బంది ద్వారా పోలీసులకు సమాచారం అందించారు. రఘురామ్ అవివాహితుడని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

దాడి ఘటనలో ఇద్దరిపై కేసు

నెల్లూరు(క్రైం), ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): సెంట్రింగ్ మేస్త్రీపై దాడి చేసిన ఘటనలో ఇద్దరు వ్యక్తులపై వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... నెల్లూరులోని చంద్రబాబునగర్‌కు చెందిన సుబ్రహ్మణ్యం రమేష్ సెంట్రింగ్ మేస్త్రీగా జీవనం సాగిస్తున్నాడు. అదే ప్రాంతానికి చెందిన మణికంఠ, సెల్వ అనే అన్నదమ్ములు రమేష్ వద్ద పనులుకు వెళ్లేవారు. ఈ నెల 25వ తేదీ రాత్రి రమేష్ వద్దకు వెళ్లి డబ్బు కావాలని కోరారు. తనవద్ద లేవని అతను చెప్పడంతో ఆవేశంతో అన్నదమ్ములు మేస్త్రీపై దాడి చేశారు. గాయాలపాలైన ఆయన వైద్యశాలలో చికిత్స పొంది శుక్రవారం వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

న్యూస్ బాక్స్

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

లింగసముద్రం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): శనివారం నుంచి ప్రారంభం కానున్న ఇంటర్మీడియట్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని మండలంలోని పెదపవనిలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల బాలికల కళాశాల ప్రిన్సిపాల్, చీఫ్ సూపరింటెండెంట్ కె.స్నేహలత తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ ఈ పరీక్ష కేంద్రంలో మొదటి సంవత్సరం విద్యార్థులు 142 మంది, రెండవ సంవత్సరం విద్యార్థులు 88 మంది పరీక్షలు రాయనున్నట్టు తెలిపారు.

ఉపాధి కల్పించకపోతే ఉద్యమం

కందుకూరు, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు స్మార్ట్ మీటర్లు తీసుకువచ్చి మా ఉపాధి కోల్పోయేలా చేస్తున్నందున ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించకపోతే ఉద్యమం తప్పదని ఆంధ్రప్రదేశ్ విద్యుత్ మీటర్ రీడర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కుంచాల సిద్ధయ్య హెచ్చరించారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శుక్రవారం యూనియన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ మీటర్ల రీడింగ్ తీసే కార్మికులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. మార్చి నెలాఖరువరకు దశలవా రీగా నిరసన, ఏప్రిల్ 1 నుంచి సమ్మె, 4న చలో విజయవాడ కార్యక్రమంతో చేస్తామని పేర్కొన్నారు. సమావేశంలో ఇ.మాల్యాద్రి, డి.శ్రీను, జె.రాము, మల్లికార్జున, వంశీకృష్ణ, మధు, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

అధికారులపై ఫిర్యాదు

లింగసముద్రం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఈ నెల 23న జరిగిన మండల సమావేశాన్ని జరగకుండా ప్రయత్నం చేసిన ఎంపీడీవో, అడ్డుకున్న ఇతరులపై చర్యలు తీసుకోవాలని ఎంపీపీ పెన్నా కృష్ణయ్య, ఎర్రారెడ్డిపాలెం సర్పంచు డి మల్లికార్జున, వైసీపీ జిల్లా అధికార ప్రతినిధి ఎం కిషోర్‌లు శుక్రవారం జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. నెల్లూరులో జిల్లా కలెక్టర్, జడ్పీ సీఈవో, ఏఎస్పీలకు వినతిపత్రం అందజేసినట్టు ఎంపీపీ చెప్పారు.

చేపల చెరువు వేలం

కొండాపురం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని రేణమాల చెరువులో చేపల పెంపకానికి సంబంధించిన వేలం ప్రక్రియను పంచాయతీ అధికారులు శుక్రవారం నిర్వహించారు. గ్రామానికి చెందిన మెట్టుకూరు సుబ్బారెడ్డి రూ.70వేలకు దక్కించుకొన్నట్లు పంచాయతీ కార్యదర్శి పృధ్వీరాజ్ తెలిపారు. వేలం పాడుకున్న వ్యక్తి ఈ ఏడాది జూన్ 30 వరకు చెరువులో చేపలను పట్టి విక్రయించుకోవచ్చని ఆయన తెలిపారు.

సేంద్రియ ఉత్పత్తులకు అధిక ధర

అల్లూరు, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి) : సేంద్రియ పద్ధతిలో సాగు చేసిన ఉత్పత్తులకు మార్కెట్లో 20 శాతం అధిక ధరలు కలిగి ఉంటాయని ఉత్పత్తుల ధ్రువీకరణ రాష్ట్ర అధికారి ఆర్.వెంకట సునీల్‌కుమార్ అన్నారు. శుక్రవారం అల్లూరులో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొని రైతులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. ఈకార్యక్రమంలో వ్యవసాయాధికారి ఆర్.వెంకటేశ్వర్లు, వీఏఏలు పాల్గొన్నారు.

5న దుకాణాలకు వేలం

కందుకూరు, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాత లారీస్టాండ్ ఆవరణలో నిర్మించి ఉన్న మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో మిగిలి ఉన్న 1, 13, 15వ నెంబరు గదులు అద్దెకు ఇచ్చేందుకు మార్చి 5న ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ కె. అనూష ఒక ప్రకటనలో తెలిపారు. 1వ నెంబరు షాపు ఎస్సీలకు, 13, 15వ నెంబరు షాపులు జనరల్‌కు రిజర్వ్ చేసినట్లు ఆమె తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో జరిగే వేలంలో ఔత్సాహికులు పాల్గొనాలని ఆయన కోరారు.

● **మాంసం మార్కెట్ గదులకు..**

పట్టణంలోని చేపల మార్కెట్ వద్ద నిర్మించిన మాంసం మార్కెట్ నూతన గదులకు ఈనెల 5న మున్సిపల్ కార్యాలయంలో ఉదయం 11గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ కె. తెలిపారు. ఈ మార్కెట్‌లో 18 గదులు ఉండగా 1,2,3 గదులు ఎస్సీలకు, 4వ నెంబరు ఎస్టీలకు, 5వ నెంబరు వికలాంగులకు రిజర్వ్‌చేయగా మిగిలిన 13 గదులు జనరల్ కేటగిరిలో ఉంటాయని తెలిపారు. మూడేళ్ల కాలపరిమితితో అద్దెకు ఇచ్చేందుకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నామని తెలిపారు.

చెత్తతో సంపద సృష్టించాలి

కావలి రూరల్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): చెత్త నుంచి సంపద సృష్టించి పంచాయతీలను అభివృద్ధి పథంలో నడపాలని డివిజనల్ పంచాయతీ అధికారి మాధవీలత పేర్కొన్నారు. కావలి మండలం మన్నంగిదిన్నెలో శుక్రవారం చెత్త నుంచి సంపద తయారీ, నిర్వహణపై ఈవోపీఆర్డీలతో జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను ఉపయోగంలోకి తీసుకురావాలన్నారు. చెత్త సేకరణలో తడి, పొడి చెత్త వేరుచేసి నాడెప్ తొట్టెల్లో నిల్వచేసి 45 రోజుల్లో ఎరువు తయారు చెయ్యవచ్చన్నారు. అలాగే వర్మి కంపోస్టుతో ఎరువు తయారు చేసి రాయతీపై రైతులకు అందించాలన్నారు. జీరో వేస్టు మేనేజ్‌మెంట్ ద్వారా గ్రామాలల్లో రోడ్ల ప్రక్కన పేడదిబ్బలు, చెత్తకుప్పలు లేకుండా శుభ్రపరిచి మొక్కలు నాటాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చెలంచర్ల ప్రభాకర్‌రెడ్డి, ఈవోపీఆర్డీలు, పంచాయతీ కార్యదర్శి గీత, గ్రీన్ అంబాజిడర్లు తదితరులు పాల్గొన్నారు.

పట్టణ సరిహద్దులు

మాయం చేసి..

- ఇష్టానుసారంగా ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు
- లబ్ధిదారులకు తగ్గుతున్న ఖర్చు
- జేబులు నింపుకొంటున్న అధికారులు
- మున్సిపల్ ఖజానాకు గండి
- పట్టించుకొనేవారేరీ?

కావలి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): అక్రమ ఆదాయాలు కోసం అధికారులు ఎంతటికైనా తెగిస్తున్నారు. తమ జేబులు నింపుకునేందుకు మున్సిపల్ ఆదాయాలకు కూడా గండి కొట్టేందుకు వెనుకాడటం లేదు. పట్టణ ప్రణాళికా విభాగంలో గత కొన్నేళ్లుగా ఈ అక్రమ దోపిడీ సాగుతున్నా దానికి ఎవరూ అడ్డుకట్ట వేయకుండా తలా పాపం తిలా పిడికెడు అన్నట్లుగా ఎవరి మామూళ్లు వారు తీసుకుంటున్నారు. మున్సిపల్ మాస్టర్ ప్లాన్ ప్రకారం ఉన్న పట్టణ పాత పరిధిని చెరిపేసి దానిని అధికారులు తమ ఆదాయవనరుల కోసం కొత్త పరిధిని సృష్టించారు. 9 ఏళ్ల కిందట పాత పరిధిని చెరిపి కొత్త పరిధిని చూపించి నట్లు మున్సిపల్ అధికారి ఒకరు తెలిపారు. వాస్తవంగా పట్టణ పాత పరిధి దాటి ఇళ్ల నిర్మాణాలకు అనుమ తులు ఇవ్వాలంటే ఆ ప్రాంతాల్లో రోడ్లు, డ్రైనేజీలు ఇతర మౌలిక వసతుల కల్పన కోసం పురపాలక సంఘానికి 14 శాతం డెవలప్‌మెంట్ చార్జీల కింద చెల్లించాలి. ఆ నిధులతో విస్తరణ ప్రాంతాల్లో మున్సిపాల్టీ అభివృద్ధి, మౌలికవసతుల సమకూర్చే పనులు చేపడుతోంది. అయితే కావలి పురపాలక సంఘంలో పాత పట్టణ పరిధిని తురిపేసి దాని విస్తరణ మరింత చూపించారు. దీని వలన విస్తరణ చూపించిన ప్రాంతాలలో మున్సిపాల్టీకి చెల్లించాల్సిన డెవలప్‌మెంట్ చార్జీలలో సగం అధికారుల జేబుల్లోకి వేసుకుని భవన నిర్మాణాలకు అనుమతులు ఇస్తున్నారు. వాస్తవంగా పాత సరిహద్దులు దాటితే 14 శాతం డెవలప్‌మెంట్ చార్జీలు మున్సిపాల్టీకి చెల్లించాల్సిందే. దీంతో అధికారులకు పెద్దగా మామూళ్లు రావు. విస్తరణ ప్రాంతాలలో కొద్దిపాటి భవనం నిర్మించాలన్నా డెవలప్‌మెంట్ చార్జీల కింద సుమారు రూ.2లక్షలు వరకు మున్సిపాల్టీకి చలానా రూపంలో చెల్లించాలి. అయితే దానిలో లక్ష రూపాయలు అధికారులకు ఇస్తే ఆ విస్తరణ ప్రాంతాన్ని పట్టణ పాత సరిహద్దుల ప్రాంతంలో చూపించి డెవలప్‌మెంట్ చార్జీలు లేకుండా చేస్తుండటంతో ఇళ్లు నిర్మించుకునే వారికి కూడా మరో లక్ష రూపాయలు మిగులుతోంది. పాతూరుకు తూర్పు వైపున విస్తరణ ప్రాంతాలలో జరిగిన అనేక నిర్మాణాలలో డెవలప్‌మెంట్ చార్జీలు లేకుండానే పాత పట్టణ పరిధిలో చూపించి అధికారులు తమ మామూళ్లు తీసుకుని అనుమతులు ఇచ్చారనే ఆరోపణలు ఉన్నాయి. గత 9 ఏళ్లుగా కావలి పురపాలక సంఘంలో ఈ తంతు కొనసాగుతున్నా ఎవరూ పట్టించుకోవటంలేదనే విమర్శలు ఉన్నాయి. దీని వలన మున్సిపల్ ఖజానాకు బారీగా గండి పడటంతో విస్తరణ ప్రాంతాలలో అభివృద్ధి పనులకు నిధులు కొరత ఏర్పడు తోంది. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి పాత పట్టణ పరిధిని గుర్తించి అక్రమ వసూళ్లకు అడ్డుకట్ట వేసి విస్తరణ ప్రాంతాలలో డెవలప్‌మెంట్ చార్జీల కింద వసూలు చేస్తున్న సొమ్ము మున్సిపల్ ఖజానాకు జమ అయ్యేట్లు చూడాలని ప్రజలు కోరుతున్నారు.



కావలి పట్టణ వ్యూ

మా దృష్టికి వచ్చింది

పట్టణ పాత సరిహద్దు చెరిపేసి వాటిని విస్తరించిన విషయం ఆలస్యంగా తమదృష్టికి వచ్చింది. దీనిని క్షుణ్ణంగా పరిశీలించి మాస్టర్‌ప్లాన్ ప్రకారం పాత సరిహద్దులు గుర్తించి అది దాటి భవనాలు నిర్మించే వారి వద్ద డెవలప్‌మెంట్ చార్జీలు వసూలు చేసే విధంగా చర్యలు తీసుకుంటాం.

- జీ. శ్రావణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్, కావలి

వర్షం నీరు కాదండోయ్.. మంచినీరే!

● పైపులైన్ పగిలి వృథాగా పోతున్న వైనం



లింగసముద్రం కొళ్లఫారం వద్ద మంచినీటి పైపులైన్ పగిలి రోడ్డుపై ప్రవహిస్తున్న నీరు

లింగసముద్రం సమీపంలోని కొళ్లఫారం వద్ద రోడ్డుపై నిలిచిన ఈ నీరు వర్షపునీరు అనుకుంటే పొరపాటే.. ఇది ప్రజలకు పైపులైన్ల ద్వారా సరఫరా చేసే మంచినీరు. లింగసముద్రం నుంచి వాకమళ్లవారిపాలెంకు వెళ్లే పైపులైన్ పగిలి ఇలా వృథాగా పోతోంది. మూడు రోజుల క్రితం మహాశివ రాత్రి సందర్భంగా కొళ్లఫారం పక్కనే ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్డు మార్జిన్లలో గుంతలను పూడ్చేందుకు రోడ్డు పక్కనే ఉన్న మట్టిని ఎక్స్‌కవేటర్‌తో తవ్వి గుంతలకు వేశారు. ఆ సందర్భంలో ఎక్స్‌కవేటర్ బకెట్ తగిలి మంచినీటి పైపులైన్ పగిలింది. దాని ద్వారా నీరులీకై వృథాగా పోతూ పక్కనే ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్డుపై ప్రవహిస్తోంది. దీంతో ఈ తారు రోడ్డు దెబ్బతినే అవకాశం ఉందని వాహనదారులు, ప్రజలు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

- లింగసముద్రం(ఆంధ్రజ్యోతి)

'బుడంగుంట'కు ఎస్ఎస్ ట్యాంకు నుంచి నీరు



బుడంగుంటలో పరిశీలిస్తున్న కమిషనర్ శ్రావణ్‌కుమార్, డీఈ సాయిరామ్

కావలి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 17వ వార్డు బుడంగుంట ఇందిరమ్మ కాలనీలోని 9 వీధులకు ఇకనుంచి ఎస్ఎస్ ట్యాంకు నుంచి తాగునీరు పునరుద్ధరిస్తామని మున్సిపల్ కమిషనర్ జీ.శ్రావణ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన మున్సిపల్ డీఈ సాయిరామ్, ఇంజనీరింగ్ సిబ్బందితో కలిసి ఆ కాలనీలోని 9 వీధులలో పర్యటించారు. తాగునీటికి వారు పడుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ ఈ కాలనీలో ఇంజనీరింగ్ సిబ్బంది గత రెండు నెలలుగా పర్యటించి గత కొన్నేళ్లుగా ఉన్న మంచినీటి సమస్యను పునరుద్ధరించేందుకు పైపులైన్లు విస్తరణ, మరమ్మతులు, వాల్వులను బిగించి మంచినీటి సరఫరాకు అంతరాయం కలుగకుండా చేశామన్నారు. దీంతో ఇక నుంచి ఈ కాలనీలోని 9 వీధులకు మంచినీటి సరఫరాకు ఎలాంటి అంతరాయం లేకుండా ఎస్ఎస్‌ట్యాంకు నుంచి నీటి సరఫరా చేస్తా మని పేర్కొన్నారు.

మానవాళి మనుగడకు సైన్సు అవసరం



లింగసముద్రం : పెంట్రాల యూపీ పాఠశాలలో చార్టులు ప్రదర్శిస్తున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

లింగసముద్రం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి) : మానవాళి మనుగడకు సైన్స్ అత్యంత అవసరమని మండలంలోని పెంట్రాల యూపీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం శ్రీనివాసులు చెప్పారు. శుక్రవారం పాఠశాలలో సైన్స్ దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు తయారు చేసిన మోడల్ చార్టులను ప్రదర్శించిన అనంతరం వారికి బహుమతులు, స్వీట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో సైన్సు ఉపాధ్యాయుడు కె మోహన్‌రావు, ఉపాధ్యాయులు ఆచారి, హైమారాణి, సంధ్యారాణి, లక్ష్మీనారాయణ, వెంకటేశ్వర్లు, సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

● వలేటివారిపాలెం : మండలంలోని అయ్యవారిపల్లె ఎంపీయూపీ స్కూల్‌లో సైన్స్‌దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులచే సైన్స్ పరికరాలను తయారు చేయించి ప్రదర్శించారు. సైన్సు టీచరు శివకుమారిని సహోపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. హెచ్‌ఎం హనుమంతరావు విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

● ఉలవపాడు : మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులు తమ సృజనాత్మకతకు తగిన విధంగా సైన్స్ నమూనాలతో కొత్తరకం ఆవిష్కరణలు ప్రదర్శించారు. ఉలవపాడు శాంతనికేతన్ కరస్పాండెంట్ శ్రీరాం బాహూజి విద్యార్థులకు సర్ సీవీ రామన్ గురించి వివరించి ఉత్తమ ప్రదర్శనకు బహుమతులు అందచేశారు. శ్రీసాయి పాఠశాలలో కరస్పాండెంట్ శేషమ్మ, సెయింట్ జోసెఫ్ పాఠశాల కరస్పాండెంట్ వర్గీస్ విద్యార్థులు తయారు చేసిన ఉత్తమ సైన్స్ నమూనాలకు బహుమతులు అందచేశారు.

● కావలిటౌన్ : రెడ్‌క్రాస్ భవనంలో జేవీవీ అధ్యక్షుడు తోట వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన జాతీయ సైన్సు దినోత్సవంలో ముఖ్య అతిధులుగా డాక్టర్ బెజవాడ రవికుమార్, డాక్టర్ ఆనంద్, డాక్టర్ శివప్రసాద్‌లు పాల్గొని సర్ సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రతిభా పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులందించారు. కార్యక్రమంలో జేవీవీ బాధ్యులు హరనాథ్, సుబ్బరాయశర్మ తదితరులు పాల్గొన్నారు. అలాగే అలాగే పట్టణంలోని రూపాయి మిద్దె కూడలిలోని జయ ఉష ఉన్నత పాఠశాలలో కరస్పాండెంట్ ఊసా వెంకట్రావు పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా సామాజిక వేత్త కూనం తాతిరెడ్డి, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు జాఫర్‌ఖాన్‌లు పాల్గొని విద్యార్థులు ప్రదర్శించిన ఎగ్జిబిట్స్ తిలకించి అభినందించి బహుమతులందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తల్లితండ్రులు పాల్గొన్నారు.

● కందుకూరు: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని శుక్రవారం ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలలో ఘనంగా నిర్వహించారు. స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టరు ఎం.రవికుమార్ ఆధ్వర్యంలో జంతుశాస్త్ర విభాగం వారు ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయగా కేంద్రీయ విద్యాలయ విద్యార్థినీ విద్యార్థులు ఉత్సాహంగా పరిశీలించారు. జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం నరసింహమూర్తి ఆధ్వర్యంలో సైన్స్ దినోత్సవం నిర్వహించారు. సర్ సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థులు రూపొందించిన పరికరాలను ప్రదర్శించారు. విద్యార్థులకు వక్తృత్వము, వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. పాఠశాల ఉపాధ్యాయుడు గుళ్లా నరసింహం రూ.5వేల ప్రోత్సాహకం అందించారు. పట్టణంలోని ఆక్స్‌ఫర్డ్ ఉన్నత పాఠశాల, శ్రీ గాయత్రీ ఒలింపియాడ్ స్కూల్, నారాయణ ఓలింపియాడ్ స్కూల్, చైతన్య టెక్నోస్కూల్, నాగార్జున ఇంగ్లీష్ మీడియం స్కూల్లో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.



కావలిటౌన్ : సర్ సీవీ రామన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైద్యులు రవికుమార్, ఆనంద్



కందుకూరు : బాలికల ఉన్నత పాఠశాలలో ఇంజనీరింగ్ విద్యార్థులు రూపొందించిన స్ప్రేయర్

● జాతీయ విజ్ఞాన దినోత్సవం సందర్భంగా స్థానిక జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు తాము రూపొందించిన ప్రాజెక్టులను ప్రదర్శించారు. కళాశాల డీన్ డాక్టరు ఎం.లక్ష్మణరావు ఆధ్వర్యంలో విద్యార్థులు స్వయంగా రూపొందించిన మల్టీపర్పస్ స్ప్రేయరు, క్రాప్ సేవర్, స్మార్ట్ కూలర్, బయోగ్యాస్ జనరేషన్ వంటి వినూత్న ప్రాజెక్టులను ప్రదర్శించటంతో పాటు వాటిపనితీరును హైస్కూల్ విద్యార్థినులకు వివరించారు. ఈ ప్రదర్శనలో భాగస్వాములైన కళాశాల విద్యార్థులు బి.వైష్ణవి, కె.వినయ్, సి.శంకర్, యం.విజయేంద్ర, ఎస్కే షాహిద్, వి.శ్రీహరి, డి.సాయిశ్రీ, డి.మానిషా, వి.భాగ్యలక్ష్మిలను హెచ్‌ఎం ద్వారకారాణి, పీడీలు ఎం.రాజ్యలక్ష్మి, కె.ఆదిలక్ష్మి, కళాశాల కరస్పాండెంట్ కంచర్ల రామయ్య అభినందించారు.

● బిట్రగుంట : బోగోలు మండలం కడనూతల ఆర్ఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల్లో జాతీయ సైన్స్ డే పురస్కరించుకుని సైన్స్ ఎక్స్పో 2కె 25 కార్యక్రమం కళాశాల ప్రిన్సిపాల్ పీవీఎస్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన పాఠశాల విద్యార్థులు తాము తయారు చేసిన వివిధ రకాల పరికరాలను ప్రదర్శించి వాటి పనితీరును వివరించారు.

రైతులకు అందుబాటులో

ధాన్యం కొనుగోలు కేంద్రాలు : జేసీ

కావలి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): కావలి నియోజకవర్గంలోని కావలి, అల్లూరు, బోగోలు, దగదర్తి, మండలాల్లోని గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు చేసి అవసరమైన సిబ్బందిని నియమించినట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ కార్తీక్ ఒక ప్రకటనలో తెలిపారు. కావలి మండలంలోని ఆముదాలదిన్నె, అన్నగారిపాలెం1, చెంచుగానిపాలెం, గౌరవరం, తాళ్లపాలెం, తుమ్మలపెంట1, 2, చెన్నాయపాలెం, పెదపట్టపుపాలెం, ఆనెమడుగు, ఎర్రాయపాలెం, రుద్రకోట, చలంచర్ల, సిరిపురం, కొత్తపల్లిలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అల్లూరు మండలంలో అల్లూరు-1, అల్లూరు-2, బీరంగుంట, నార్తుమోపోరు, సింగపేట,అల్లూరు-3,4, గోగులపల్లి, గద్దగుంట, ఇస్కపల్లి-1,2, ఇందుపూరు, పురిణిలలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తినట్లు తెలిపారు. బోగోలు మండలంలో బోగోలు-1, కడనూతల, జువ్వలదిన్నె, జేపీగూడూరు, ఏనుగులబావి, నాగులవరం, ముంగమూరు, కోవూరుపల్లి, బోగోలు-4, బిట్రగుంట, తాళ్లూరులలో కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దగదర్తి మండలంలో బోడిగెడిపాడు, చెన్నూరు, దగదర్తి, దర్మవరం(మనుబోలుపాడు) దామవరం(కేకేగుంట), దుండిగం, కాట్రాయపాడు, వెలుపోడు, ఉలవపాళ్ల, శ్రీరామపురం(పెదపుత్తేడు), తడకలూరు, తురిమెర్ల లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

● **కందుకూరులో 14..**

కందుకూరు : వరిసాగు చేసిన రైతులకు మద్ధతు ధర దక్కేలా చూడటమే లక్ష్యంగా కందుకూరు నియోజకవర్గంలో 14 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టరు కార్తీక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కందుకూరు మండలంలో మోపాడు, మహదేవపురం, ఓగూరు, పలుకూరు, గుడ్లూరు మండలంలో గుడ్లూరు, దారకానిపాడు, లింగసముద్రం మండలంలో చినపవని, మొగిలిచర్ల, తూనుగుంట, ఎర్రారెడ్డిపాలెం, వలేటివారిపాలెం మండలంలో పోకూరు, వలేటివారిపాలెం, ఉలవపాడు మండలంలో చాగొల్లు, ఉలవపాడులలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు తెలిపారు.


ఆర్టీసీ ఆకర్ష పథకం లక్కీడిప్



ప్రయాణికులకు బహుమతులు అందజేసిన అధికారులు

కావలి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): ప్రయాణికులను ఆకర్షించి ఆర్టీసీ ఆదాయం పెంచుకునేందుకు కావలి ఆర్టీసీ డిపో ప్రయాణికులకు లక్కీ డిప్‌ల ద్వారా ఆకర్ష పథకంను ప్రవేశపెట్టింది. డాక్టర్ రామస్వామి సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఈ పథకంలో భాగంగా శుక్రవారం కావలి డిపో ఆవరణలో జరిగిన కార్యక్రమంలో పెద్దపవని-లింగసముద్రం రూట్‌లో ఎస్కే నాయబ్ రసూల్, కొమ్మి-కొండాపురం రూట్‌లో ఎం.సరోజనీదేవి, అల్లూరు రూట్‌లో జీ.పద్మలకు చీరలను అసిస్టెంట్ మేనేజరు ఎం.కల్పనారెడ్డి బహూకరించారు. ఈ మూడు రూట్లలో బస్సులలో ఒక పెట్టెను ఏర్పాటు చేసి ప్రయాణికులు తమ టిక్కెట్ల వెనుక పేర్లు, ఫోన్‌నెంబర్లు రాసి వాటిని అందులో వేస్తారు. ఇలా ప్రతి నెలలో ఒక సారి లక్కీడిప్‌ద్వారా విజేతలను ఎంపిక చేసి వారికి బహుమతులను అందచేస్తూ ఆర్టీసీ ప్రయాణికులను ఆకర్షిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సూపరింటిండెంట్ ఎం. రామకృష్ణ, మార్కెటింగ్ ఎగ్జిక్యూటీవ్ డీ.రవిప్రకాష్, ఏడీసీ ఎస్. మాల్యాద్రి పాల్గొన్నారు.

మొక్కుబడిగా సామాజిక తనిఖీ ప్రజావేదిక



సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహిస్తున్న అధికారులు

అల్లూరు, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 17వ విడత పనులపై సామాజిక తనిఖీ నిర్వహించిన అధికారుల బృందం శుక్రవారం కార్యాలయ ఆవరణలో మొక్కుబడిగా రెప్పపాటు కాలంలో ముగించేశారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని అధికారులు తెలిపినప్పటికీ మధ్యాహ్నం ఎవరూ లేని సమయం చూసి కేవలం అర్థగంటలో ముగించేశారు. అసలు ఈ తనిఖీలు చేసిన అధికారులు పూర్తిస్థాయిలో వివరించే అవకాశం ఇవ్వకుండానే పూర్తి చేశారు. 2023 ఏప్రిల్ 1 నుంచి గతేడాది మార్చి చివరి వరకు జరిగిన పనులపై గత కొన్ని రోజులుగా తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీలపై ప్రజావేదికను ఏర్పాటు చేసి రూ.30,920 మాత్రమే రికవరీకి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రిసైడింగ్ అధికారి గంగాభవాని, విజిలెన్స్ అధికారి విజయలక్ష్మి, ఎంపీడీవో రజనీకాంత్, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

కొలతలు ప్రకారమే కూలి : ఏపీవో



కూలీలకు అవగాహన కల్పిస్తున్న ఏపీవో ఉమామహేష్

వలేటివారిపాలెం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): కొలతల ప్రకారమే కూలీ లబిస్తుందని ఏపీవో ఉమామహేష్ తెలిపారు. మండలంలోని నూకవరంలో జరుగుతున్న ఉపాధి పనులను ఏపీవో ఉమామహేష్ ఈసీ వంశీకృష్ణతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న ఎండలను దృష్టిలో పెట్టుకొని ఉదయం 6 గంటలకే పనులకు రావాలని సూచించారు. అవసరమున్న ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల ముందు ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని తెలిపారు. అందుకు ప్రభుత్వం రూ.6 వేలు అందిస్తుందని తెలిపారు. ఆయన వెంట ఫీల్డ్‌అసిస్టెంట్ బద్ధిపూడి హరిబాబు ఉన్నారు.

శనగలో తెగుళ్ల నివారణకు సస్యరక్షణ చర్యలు

వలేటివారిపాలెం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : శనగలో తెగుళ్ల నివారణకు సమగ్ర సస్య రక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడులు సాధించవచ్చునని కందుకూరు డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకురాలు పి.అనసూయ తెలిపారు. మండలంలోని శాఖవరంలో శుక్రవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ఏఓ హేమంత్‌భరత్‌కుమార్‌తో కలిసి శనగ పంటను పరిశీలించింది. ఈ కార్యక్రమంలో కందుకూరు సాంకేతిక వ్యవసాయశాఖాధికారి పి.దుర్గ, విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్ ప్రభు, రైతులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ ఉపాధ్యాయినికి సన్మానం

బిట్రగుంట, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం విశ్వనాథరావుపేట జడ్పీ పాఠశాల ప్రాంగణంలో ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయిని సుహాసిని వీడ్కోలు సమావేశం హెచ్‌ఎం రవీంద్రఠాగూర్ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగింది. మొదట జాతీయ విజ్ఞాన దినోత్సవ సందర్భంగా సీవీరామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళర్పించారు. అనంతరం సుహాసిని, సీహెచ్.నాగరాజు దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచు గండూరి మంజుల, ఎంఈవో నరసింహారావు, హెచ్‌ఎం గంగాధర్‌రావు పాల్గొన్నారు.

నేటి నుంచి గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు

కలిగిరి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో శనివారం నుంచి 31వ తేదీ వరకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం జరుగుతుందని ప్రాంతీయ వైద్యశాల ఏడీ డాక్టర్ కే.సురేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు.

దర్జీలను ప్రభుత్వం గుర్తించాలి




సీనియన్ టైలర్‌ను సత్కరిస్తున్న అళహరి

అల్లూరు, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): దర్జీలను ప్రభుత్వం గుర్తించి ప్రత్యేక అవకాశాలు కల్పించాలని దర్జీల అసోసియేషన్ మండల అధ్యక్షుడు కావలి కృష్ణ కోరారు. దర్జీల దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం అల్లూరు పాతబస్టాండు కూడలిలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో షహాబ్, వెంకటేశ్వర్లు, వాసు, చిన్న పాల్గొన్నారు.

● కావలిటౌన్ : కావలి టైలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం టైలర్స్ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ముందుగా పట్టణ ట్రంకురోడ్డులో టైలర్లు ప్లకార్డులు చేతపట్టి తమ సమస్యలు పరిష్కారించాలని పెద్దఎత్తున నినదిస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఐదు లాంతర్ల సెంటర్‌లోని ఏవీఎస్ కల్యాణ మండపంలో జరిగిన సమావేశంలో ముఖ్య అతిధులుగా జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ అళహరి సుధాకర్, అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు, స్థానిక మాజీ కౌన్సిలర్ అమరా వేదగిరి పాల్గొని సీనియర్ టైలర్లను సత్కరించారు. ఈ కార్యక్రమంలో అతిధులుగా ఖాదర్‌బాషా, మాలకొండారెడ్డి, జమీర్, గనీబాషా, అసోసియేషన్ బాధ్యులు వేణు, రఫి, రెహమాన్ పాల్గొన్నారు.

శ్రీధర్‌బాబు సేవలు మరువలేనివి



శ్రీధర్‌బాబును సన్మానిస్తున్న సిబ్బంది, రైతులు

కలిగిరి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): పొగాకు బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఐఏఎస్ అధికారి అద్దంకి శ్రీధర్ బాబు సేవలు, కృషి మరువలేనివని కలిగిరి పొగాకు వేలం కేంద్రం పరిధిలోని పొగాకు రైతులు పేర్కొన్నారు. గత ఏడున్నరేళ్లుగా పొగాకుబోర్డులో విధులు నిర్వహించి ఉత్తరాఖండ్‌కు జాయింట్ సెక్రటరీగా పదోన్నతిపై వెళ్తున్న ఆయనను శుక్రవారం కలిగిరి వేలం కేంద్రంలో సిబ్బంది, రైతులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడుతూ పొగాకు బోర్డులో రైతులకు అందించిన ప్రయోజనాలతో తనకు పూర్తి సంతృప్తి కలిగిందన్నారు. ఈ బోర్డులో విధులు నాకు జీవితానికి సరిపడా ఆనందాన్నిచ్చాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వేలం నిర్వహణాధికారి మహేష్‌కుమార్, ఫీల్డ్ ఆఫీసర్ సంతోష్ పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల ధర్నా

కావలిటౌన్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ కార్మికులు శుక్రవారం ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేసి ఆర్డీవో వంశీకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ గౌరవాధ్యక్షుడు పసుపులేటి పెంచలయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆప్కాస్ రద్దు చేసి మున్సిపల్ కార్మికులను ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పజెప్పాలని చూడడం దుర్మార్గమన్నారు. పోరాటాలతో సాధించుకున్న హక్కులను కూటమి ప్రభుత్వం తిరిగి రద్దు చేసి కార్మికులను ఇబ్బందులు పెట్టే ఆలోచనలు చేయడం సమంజసం కాదన్నారు. సీఎం చంద్రబాబు ఎన్నికల హామీలు నిలబెట్టుకోవాలని కోరారు. కార్యక్రమంలో తిరుపాల్, కృష్ణమోహన్, మధుసూధన్‌రావు, యూనియన్ నాయకులు తురకా శీనయ్య, బి మహేష్, ఒ మహేష్, కె బాబు, పోలయ్య తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్లు, కండక్టర్లకు ప్రోత్సాహకాలు

కావలి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): శివరాత్రి సందర్భంగా కావలి డిపో నుంచి లింగసముద్రం, మొగిలిచర్ల క్షేత్రములకు తిరిగిన బస్సులలో అత్యధిక ఆదాయం, సీట్ల భర్తీ శాతం పెంచిన డ్రైవర్లు, కండక్టర్లకు నగదు ప్రోత్సహకాలను అందచేసినట్లు కావలి డిపో మేనేజరు రాహూరు శ్రీనివాసులు తెలిపారు. కావలి డిపో ఆవరణలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆదాయం, సీట్ల భర్తీలో మొదటి స్థానం సాధించిన కండక్టర్ పీ.శ్రీనివాస్, డ్రైవర్ ఎస్కే జలీల్, ద్వితీయస్థానం సాధించిన కండక్టర్ కే. రాంప్రసాద్, డ్రైవర్ బీ. కోదండయ్య, తృతీయస్థానం సాధించిన కండక్టర్ వై.శేఖర్, డ్రైవర్ ఎం.శ్రీనివాసులకు నగదు బహుమతులను అందచేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు కల్పనారెడ్డి, ఎస్కే ఖాదర్‌మొహిద్దీన్, ఎం.రామకృష్ణ, డీ.రవిప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి రంజాన్ మాసం

- మసీదుల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు
- నేటి రాత్రి తారావీ ప్రార్థనలు



నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : పవిత్ర రంజాన్ మాసం ఆదివారం నుంచి ప్రారంభమవుతోంది. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా మసీదులను శుభ్రం చేస్తున్నారు. విద్యుత్, తాగునీరు, పారిశుధ్యం ఏర్పాట్లు చేస్తున్నారు. నెల్లూరు నగరంలోని ప్రధాన మసీదుల్లో రంజాన్ ప్రార్థనలు చేసుకునే ముస్లింలకు మెరుగైన వసతులు, సేవల కల్పనకు రాష్ట్ర వక్ఫ్‌బోర్డు అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ ఆధ్వర్యంలో ఫెస్టివల్ కమిటీలను ఏర్పాటు చేశారు. రంజాన్ మాసానికి స్వాగతం పలుకుతూ అన్నీ మసీదుల్లో శనివారం రాత్రి 8 గంటల నుంచి తారావీ నమాజ్‌లు జరగనున్నాయి.

ప్రార్థనలు.. ఉపవాసాలు

ప్రార్థనలు, ఉపవాసాలు, దానధర్మాలకు రంజాన్ మాసం ప్రత్యేకమైనది. శనివారం నెలవంక దర్శనం అనంతరం ఉపవాస దీక్ష ప్రారంభిస్తారు. ఈ మాసంలో ప్రతి ముస్లిం వయసుతో సంబంధం లేకుండా పగటి పూట ఉపవాసం చేస్తారు. ఆ సమయంలో ఉమ్మిని కూడా మింగకుండా కఠోర దీక్షను పాటిస్తారు. ఈ నెలంతా ఆధ్యాత్మిక భావనతో దైవ చింతన కలిగి, ఖురాన్ పఠనం, దాన ధర్మాలతో గడుపుతారు. సహరి, ఇఫ్తార్ సమయాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. అలాగే ఇఫ్తార్‌కు ఉచితంగా ఆహారం అందించేందుకు దాతలు ముందుకు వస్తున్నారు. ఇక, రంజాన్ నెల అంటే నోరూరించే వంటకం హలీమ్. దాని విక్రయాలకు పలుచోట్ల దుకాణాలు వెలుస్తున్నాయి.

పరిశ్రమల ఏర్పాటుకు వేగంగా అనుమతులు

- ప్రోత్సాహక కమిటీ సమావేశంలో జేసీ కార్తీక్

నెల్లూరు (వెంకటేశ్వరపురం) ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో నూతన పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన అనుమతులను వేగంగా మంజూరు చేయాలని జాయింట్ కలెక్టర్ కార్తీక్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఉదయం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో జరిగిన జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశంలో జేసీ మాట్లాడారు. అదే విధంగా పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన భూసేకరణ వేగవంతంగా పూర్తిచేయాలని సూచించారు. ఎంఎస్ఎంఈ పరిశ్రమలను ప్రోత్సహించేందుకు పీఎంఈజీపీ రుణాలను విరివిగా మంజూరు చేయలని పేర్కొన్నారు. ఎంఎస్ఎంఈ పార్కుల కోసం ఏపీఐఐసీ అధికారులు భూమిని గుర్తించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ జీఎం మారుతీప్రసాద్, ఏపీఐఐసీ జెడ్ఎం శివకుమార్, డీజెడ్ఎం వెంకటసురేష్, ఎల్‌డీఎం శ్రీకాంత్ పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ కార్తీక్

హమాలీ చార్జీల పెంపు

అమరావతి : పౌర సరఫరాలశాఖకు చెందిన మండలస్థాయి గోడౌన్లలో రేషన్ బియ్యం, ఇతర నిత్యావసర సరుకుల లోడింగ్, అన్‌లోడింగ్ పనులు చేసే హమాలీలకు ప్రభుత్వం చార్జీలు (జీసీసీ హమాలీలతో సహా) పెంచింది. క్వింటాలుకు రూ.25 నుంచి రూ.28 వరకు పెంచుతూ సివిల్ సప్లయిస్ కమిషనర్, ప్రభుత్వ ఎక్స్-అఫీషియో కార్యదర్శి సౌరభ్ గౌర్ శుక్రవారం ఉత్తర్వులు విడుదల చేశారు. వీరితోపాటు స్వీపర్లు, స్టిచ్చింగ్ సిబ్బంది, స్వీట్ పాకెట్, తాగునీటి చార్జీలను కూడా పెంచారు. దీనివల్ల ఏడాదికి రూ.11.80 కోట్లు అదనపు భారం పడుతుందని పేర్కొన్నారు.

ఫిట్‌నెస్... ఇక ఏటీఎస్...!

- రవాణాశాఖ అధికారుల ప్రమేయం ఉండదు
- ఏప్రిల్ 1 నుంచి ప్రారంభం
- ప్రస్తుతం రోజుకు సుమారు 250 ఎఫ్‌సీలు
- స్థానిక రవాణా కార్యాలయాల్లో జారీ
- ఇకపై జిల్లా మొత్తానికి ఒక్కటే స్టేషన్
- అందరూ అక్కడికి రావలసిందే!
- దూరప్రాంతాల వారికి ఇబ్బందే!

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): రవాణాశాఖ అధికారులు వాహనాలను పరీక్షించి, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు జారీచేసే విధానానికి ఇక కాలం చెల్లింది. ఆటోమేటిక్ టెస్టింగ్ స్టేషన్(ఏటీఎస్)ల ద్వారా వాహనాలను పరీక్షించి ఎఫ్‌సీలు జారీ చేసే విధానానికి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రాష్ట్రంలోని అనంతపురం, నంద్యాల, కాకినాడ, గుంటూరు... ఇలా ఐదు ప్రాంతాల్లో ఏటీఎస్‌ల ద్వారా వాహనాల ను పరీక్షించి ఎఫ్‌సీలు జారీ చేస్తున్నారు. ఏప్రిల్ 1 నుంచి నెల్లూరు జిల్లాలోనూ ఆ ప్రక్రియ ప్రారంభం కానుంది.



ముత్తుకూరు : కప్పలదొరువు వద్ద నిర్మాణంలో ఉన్న రవాణా శాఖ ఎఫ్‌సీ సెంటర్

సరకు, ప్రజా రవాణా చేసే భారీ, మధ్యతరహా వాహనాలు అయిన లారీలు, బస్సులు, లైట్ మోటారు వాహనాలైన కార్లు, జీపుల వంటివాటికి పరీక్షలు నిర్వహించి రవాణాశాఖ అధికారులు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ జారీ చేసేవారు. అయితే ఇకపై ఆ పనిని యంత్రాలు చేయనున్నాయి. ఇందుకోసం ముత్తుకూరు మండలం కప్పలదొరువులో ఏటీఎస్ కేంద్రాన్ని నిర్మిస్తున్నారు. ఇప్పటివరకు ఆయా ఆర్టీవో కార్యాలయాల పరిధిలో ఎఫ్‌సీలను అధికారులు జారీ చేసేవారు. కానీ, నూతన విధానంలో కందుకూరు, సీతా రామపురం, కావలి ప్రాంతాల్లో ఎఫ్‌సీలకు దరఖాస్తు చేసుకునే వాహనదారులు కప్పలదొరువులో ఏర్పాటు చేయనున్న ఏటీఎస్ కేంద్రానికి వచ్చి ఎఫ్‌సీ పొందాల్సి ఉంటుంది. జిల్లా వ్యాప్తంగా ఎఫ్‌సీల కోసం ఒకే ఒక ఏటీస్ కేంద్రం ఏర్పాటు చేస్తుండటంతో తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది.

పరికరాలతో ఫిట్‌నెస్

ఆటోమొబైల్ రీసెర్చ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఏఆర్ఏఐ) నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా వాహనానికి సంబంధించిన 40 అంశాలను ఆటోమేటిక్ టెస్టింగ్ స్టేషన్‌లో పరికరాలు తనిఖీలు చేసి సదరు వాహనం సామర్థ్యాన్ని నిర్ణయి స్తాయి. ఇంజన్, టైర్లు, బాడీ... ఇలా అన్ని అంశాలకు సంబంధించి యంత్రాలే పరీక్షలు జరుపుతాయి. జిల్లా వ్యాప్తంగా సుమారుగా రోజుకు 250కుపైగా వాహనాలు ఫిట్‌నెస్ కోసం స్థానిక ఆర్టీవో కార్యాలయాలకు వెళుతుంటాయి. ఇకపై ఆ వాహనాలన్నీ ఏటీఎస్‌కు రావలసి ఉంటుంది.

విద్యార్థులతో వెట్టి చాకిరీ..!

- తల్లిదండ్రుల ఆగ్రహం

దుత్తలూరు (ఉదయగిరి), ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆదర్శ పాఠశాలలో విద్యార్థుల చేత వెట్టి చాకిరీ చేయించిన సంఘటన శుక్రవారం వెలుగు చూసింది. వివరాల మేరకు.. పాఠశాలలో సరస్వతిదేవి విగ్రహ నిర్మాణానికి ఆరుబయట ఉన్న ఇసుకను బస్తాల్లో నింపి విద్యార్థులతో లోపలికి మోయించారు. ఇటీవల గండిపాళెం గ్రామంలో విద్యార్థుల చేత పాఠశాల యాజమాన్యం వందల చపాతీలు చేయించిన ఘటన మరువకముందే ఆదర్శ పాఠశాలలో విద్యార్థుల చేత ఇసుక బస్తాలు మోయించడంపై తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై పాఠశాల ప్రిన్సిపాల్ సైమన్‌రావును వివరణ కోరగా తాము విద్యార్థులకు పని చెప్ప లేదని, ఇసుక గుట్టపై ఉన్న పట్టలను విద్యార్థులే లోపలికి తీసుకొచ్చారని తెలిపారు.



సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులతో డీఈవో, ఇతర అధికారులు

భావిశాస్త్రవేత్తలుగా ఎదగాలి

- విద్యార్థులకు డీఈఓ బాలాజీరావు పిలుపు

నెల్లూరు(విద్య), ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) :నూతన ఆవిష్కరణలతో భావిశాస్త్రవేత్తలుగా ఎదగాలని డీఈఓ డాక్టర్ ఆర్. బాలాజీరావు విద్యార్థులకు పిలుపునిచ్చారు. నగరంలోని దర్గామిట్ట జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జరిగిన జిల్లాస్థాయి క్విజ్, డ్రాయింట్ పోటీల విజేతల బహుమతి ప్రదానోత్సవంలో డీఈవో పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల్లో విజ్ఞానశక్తి పెరుగుతోందని, ఎంతోమంది తమ ప్రతిభను చూపి పలు ఆవిష్కరణలు చేపడుతున్నార న్నారు. జిల్లాకు చెందిన పలువురు విద్యార్థులు జాతీయ, రాష్ట్రస్థాయిలో సైతం సత్తాచాటి విజేతలుగా నిలవడం గర్వకారణమన్నారు. మిగిలిన విద్యార్థులు కూడా తమలోని విజ్ఞాన ప్రతిభతో ఉత్తమ శాస్త్రవేత్తలుగా ఎదగాలని తెలిపారు. ఈ సందర్భంగా సైక్రియాట్రిస్ట్ డాక్టర్ సురేష్ విద్యార్థులకు మోటివేషన్ స్పీచ్ అందజేశారు. అలాగే జాతీయ సైన్స్‌దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ఉత్తమ అవార్డు గ్రహీత ఏవీ.సుధాకర్‌ను సన్మానించారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు నగదు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో సెట్నల్ సీఈఓ నాగేశ్వరరావు, డిప్యూటీ ఈఓ వెంకటేష్ నాయక్, జిల్లా సైన్స్ అధికారి కరుణాకర్ రెడ్డి, ఎంఈవోలు ఆర్.మురళీధర్‌రావు, హమీద్, పాఠశాల హెచ్ఎం కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దుకాణాల వేలం ద్వారా మాలకొండకు రూ.1.67 కోట్ల రాబడి

వలేటివారిపాలెం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి) : మండలంలోని మాలకొండ మాల్యాద్రి లక్ష్మీనరసింహ స్వామి ఆలయానికి 8 దుకాణాల నిర్వాహణకు నిర్వహించి బహిరంగ వేలం ద్వారా రూ.1,67,10,000 ఆదాయం లభించిందని ఆలయ డిప్యూటీ కమిషనర్ కేవీ సాగర్‌బాబు తెలిపారు. మాలకొండ ఆలయ కల్యాణ మండపంలో శుక్రవారం భైరవకోన భైరవేశ్వరస్వామి ఆలయం కార్యనిర్వాహణాధికారి డి.వంశీ పర్యవేక్షణలో శుక్రవారం 8 దుకాణాలకు బహిరంగ వేలం నిర్వహించారు. ఈ దుకాణాలకు గత ఏడాది కంటే ఈ ఏడాది రూ.18,20,000 అదనంగా ఆదాయం లభించింది. గత ఏడాది 8 దుకాణాలకు రూ.1,48,90,000 ఆదాయం రాగా ప్రస్తుతం రూ.1,67,10,000 వచ్చింది. కొబ్బరి చిప్పలు పోగు చేసుకునేందుకు మహంకాళి మల్లికార్జున రూ.19,62,000, నెయ్యి, పాలు విక్రయానికి బచ్చు వెంగళరావు రూ.50 వేల, టోల్‌గేట్ నిర్వహణ మంచాల చినవీరయ్య రూ.28,25,000, వస్త్రముల విక్రయం, వసూలు చేసుకొనేందుకు జాలాది ప్రసాద్ రూ.34,35,000, కొబ్బరికాయలు అంగడి నిర్వహణను మహంకాళి మల్లికార్జున రూ.26,20,000, అద్దములు, ఫొటోలు, పూజాద్రవ్యములు విక్రయం ఇంటూరి శంకరయ్య రూ.35,33,000, కూల్‌డ్రింక్ షాపు కామినేని రఘురామయ్య రూ.16,75,000, పాదరక్షలు భద్రపరచు పాటను నల్లబోతుల ఏడుకొండలు రూ.6,10,000లకు దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ సీనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



మాలకొండలో వేలం నిర్వహిస్తున్న ఆలయ అధికారులు

నైపుణ్య శిక్షణ ద్వారా నిరుద్యోగులకు ఉపాధి

- స్కిల్ డెవలప్‌మెంట్ ప్లాన్ సమీక్షలో కలెక్టర్

నెల్లూరు (హరనాథపురం) ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : రాబోయే ఆర్థిక సంవత్సరంలో మంచి నైపుణ్య శిక్షణ ఇచ్చి ఎక్కువ మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆనంద్ స్కిల్‌డెవ లప్‌మెంట్ అధికారులకు సూచించారు. శుక్రవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ ప్లాన్ 2025-26పై సమీక్ష జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరిశ్రమల అధికారులు, యాజమాన్యాలతో సమావేశాలు నిర్వహించి నిరుద్యోగులకు వారి ప్రాంతాలలోనే ఎక్కువ మందికి ఉపాధి కలిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి షేక్.అబ్దుల్ ఖయ్యూం, డీఆర్‌డీఏ పీడీ నాగరాజ కుమారి, బీసీ, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ఏ.నిర్మలాదేవి, గిరిజన సంక్షేమ అధికారి పరిమళ పలువురు అధికారులు పాల్గొన్నారు.

డిగ్రీ సప్లిమెంటరీ పరీక్షలకు ఐదుగురు గైర్హాజరు

వెంకటాచలం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ కళాశాలలో శుక్రవారం జరిగిన డిగ్రీ ఒకటవ, నాలుగవ సెమిస్టర్ మెగా సప్లిమెంటరీ పరీక్షలకు ఐదుగురు విద్యార్థులు గైర్హాజరైనట్లు వీఎస్‌యూ పరీక్షల నిర్వాహణాధికారి డాక్టర్ సీహెచ్ వెంకట్రాయులు ఒక ప్రకట నలో తెలిపారు. ఉదయం, మధ్యాహ్నం జరిగిన పరీక్షలలో 155 మంది విద్యార్థులకు గాను 150 మంది హాజరయ్యారు.

శునకాలకు కు.ని శస్త్రచికిత్సలు.. ఆవులు గోశాలకు!

- 2 వేల పందులు తరలింపునకూ నోటీసులు
- నెల్లూరును స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దేందుకు చర్యలు

నెల్లూరు (సిటీ), ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోనే మొదటిగా నెల్లూరును స్మార్టు సిటీగా తీర్చిదిద్దేందుకు ప్రయోగాత్మకంగా తీసుకున్న పురపాలక శాఖ మంత్రి నారాయణ, ఎన్ఎంసీ కమిషనర్ సూర్యతేజల శ్రమ ఒక్కొక్కటిగా ఫలిస్తోంది. తొలి ప్రయత్నంగా కుక్కలను నియంత్రించాలని చేపట్టిన ఏబీసీ (పశువుల జనన నియంత్రణ) కార్యక్రమం చురుగ్గా సాగుతోంది. నెల్లూరులో 27,500 కుక్కలు ఉన్నట్లు గుర్తించిన కార్పొరేషన్ అధికారులు వాటిల్లో 24,144లకు ఇప్పటికే కు.ని శస్త్రచికిత్సలు చేయించారు. ఇందుకోసం ఒక్కో శునకానికి రూ.1000 ఖర్చు చేస్తున్నట్టు సమాచారం. పాతమున్సిపల్ కార్యాలయం వద్దనున్న కుక్కలకు ఆపరేషన్లు చేసే ఏబీసీ సెంటరులో 66 గదులను 200లకు విస్తరించే పనులు మొదలుపెట్టారు. ఇదే సమయంలో పౌరులను కరిచినా ఎలాంటి ప్రమాదం తలెత్తకుండా యాంటీ రేబీస్ ఇంజక్షన్లు కూడా వేస్తున్నారు. కాగా, నగరానికి శివారునున్న విలీన ప్రాంతాలలో 3,356 కుక్కలు పట్టుకోవడం సిబ్బందికి సవాల్‌గా మారింది.



కు.ని శస్త్రచికిత్సల అనంతరం గదిలో ఉన్న శునకాలు

● నగరవాసులకు, వాహనదారులకు ప్రధాన సమస్యగా మారిన ఆవులను కల్లూరిపల్లి వద్ద నున్న గోశాలకు తరలిస్తున్నారు. ఇప్పటి వరకు 120 ఆవులను తరలించగా, ఇంకా 300 ఆవులు రోడ్లపై ఉన్నట్టు లెక్కగట్టారు. గతంలో గోశాలకు తరలించిన ఆవులకు జరిమానా చెల్లించి వాటి యజమానులు తిరిగి తెచ్చుకునే అవకాశం కల్పించిన కార్పొరేషన్ అధికారులు తాజాగా ఒకసారి గోశాలకు తరలించిన ఆవును తిరిగి యజమానులకు ఇవ్వకుండా కఠినంగా వ్యవహరిస్తున్నారు. ఆవులను నిరంతరం తరలించేందుకు ప్రత్యేక వాహనాన్ని కొనుగోలు చేయనున్నారు.



నగరంలోని వీధి కుక్కలను తీసుకువచ్చిన బండి

● అంటురోగాలు, దుర్వాసనకు ప్రధాన కారణాలైన పందులను నివాసాల మధ్య నుంచి బయటకు తీసుకెళ్లిపోవాలని వాటి యజమానులకు ఇప్పటికే నోటీసులు జారీ చేశారు. ధనలక్ష్మీపురం, వావిలేటిపాడు, కొత్తూరు, బుజబుజనెల్లూరు, అయ్యప్పగుడి, వెంకటేశ్వరపురం, నవలాకులతోట, నారాయణరెడ్డిపేట, పడారుపల్లి, పొదలకూరురోడ్డు, ఇరగాళమ్మ సంఘం, మనుమసిద్ధినగర్, సంతపేట, కపాడిపాళెం, మద్రాసుబస్టాండ్, మన్సూర్‌నగర్, మినీబైపాస్‌రోడ్డు, ఆత్మకూరుబస్టాండ్ ప్రాంతాలలో వీటి సంచారం ఎక్కువగా ఉంది. ఈ ప్రాంతాలలో 2 వేల పందులు వరకు ఉన్నట్లు లెక్కకట్టారు.

పశువుల నియంత్రణ నిరంతర ప్రక్రియ



మంత్రి నారాయణ, కమిషనర్ సూర్యతేజల ఆదేశాలతో నగరంలోని పశువులను నిరంతరం నియంత్రించే పనిలోనే ఉన్నాము. కుక్కలకు ఆపరేషన్ల ప్రక్రియ దాదాపుగా లక్ష్యం పూర్తికావస్తోంది. పందులను బయటకు తీసుకెళ్లిపోవాలని ఇప్పటికే నోటీసులు ఇచ్చాము. వాళ్ల స్పందించకుంటే మేమే తరలిస్తాము. ఆవులను ఎలాగూ తీసుకెళ్లిపోతున్నాము.

- డాక్టర్ మదన్‌మోహన్, ఎన్ఎంసీ పశువైద్యుడు

అప్కాస్ రద్దు చేస్తే కార్మికులను రెగ్యులర్ చేయాలి

- కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ధర్నా

నెల్లూరు (వైద్యం), ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం అప్కాస్‌ను రద్దు చేస్తే అప్కాస్ కింద పనిచేస్తున్న మున్సిపల్ కార్మికులను రెగ్యులర్ చేయాలంటూ శుక్రవారం కలెక్టరేట్ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా చేశారు. సీఐటీయూ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి పెంచల నర్సయ్య మాట్లాడుతూ ఇటీవల జరిగిన కేబినెట్ సమావేశంలో అప్కాస్‌ను రద్దు చేసి ప్రైవేట్ ఏజెన్సీలకు ఇవ్వాలని తీర్మానించారన్నారు. ఈ ఆలోచనను వెంటనే విరమించు కోవాలని డిమాండ్ చేశారు. గతంలో ప్రైవేట్ ఏజెన్సీలకు ఇవ్వడం వల్ల మున్సిపల్ కార్మికులు చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. ప్రాణాలను సైతం లెక్క చేయకుండా ప్రజారోగ్యానికి ప్రాధా న్యత ఇస్తున్న మున్సిపల్ కార్మికులకు అన్యా యం చేస్తే ఆందో ళనకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సి పల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షు రాలు కామాక్షమ్మ, నాయకులు అశోక్, సుజాత, వజ్రమ్మ, భాగ్యమ్మ, కొండయ్య, శ్రీనివాసులు, బాలు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

అప్కాస్ నుంచి వైద్య ఉద్యోగుల తొలగింపు

నెల్లూరు (వైద్యం, ఆంధ్రజ్యోతి) : యల్లాయపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అప్కాస్ కింద పనిచేస్తున్న ఎఫ్ఎన్‌వో దార్ల జీవిత, సర్వాయపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న ఎఫ్ఎన్‌వో వాసుకిలను ఉద్యోగాల నుంచి తొలగిస్తున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బంగారు గొలుసు చోరీకి పాల్పడ్డ వారిని పోలీసులు అరెస్టు చేశారని, ఈ నేపథ్యంలో ఉద్యోగాల నుంచి తొలగిస్తున్నట్లు వెల్లడించారు.

అండర్-17 క్రికెట్ విజేత కావలి

నెల్లూరు(విద్య), ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుజబుజ నెల్లూరులోని సీఏపీ క్రికెట్ మైదానంలో జరుగుతున్న సమాధి మాలకొండయ్య మెమోరియల్ అండర్-17 బాలుర క్రికెట్ పోటీల్లో కావలి జట్టు విజేతగా నిలిచింది. శుక్రవారం జరిగిన బహుమతి ప్రదానోత్సవంలో అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి కే ముని గిరీష్ మాట్లాడుతూ ఐదు జట్లు టోర్నీలో తలపడ్డాయని, యువ క్రీడాకారులు అవకాశాలను అందిపుచ్చుకుని ఉత్తమంగా రాణించాలని సూచించారు.కావలి జట్టును, రన్నర్‌గా నిలిచిన వెంకటగిరి జట్టును అభినందించి బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేష న్ కేర్‌టేకర్ శ్రీనివాసులు రెడ్డి, ఎన్‌డీసీఏ కోచ్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.



విజేతగా నిలిచిన కావలి జట్టు

మెప్మాలో 'ప్రేరణ సఖి'లు

ఒక్కో జిల్లా నుంచి నలుగురు ఎంపిక.. 8న సత్కారం

అమరావతి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘాలను ప్రోత్సహించేందుకుగాను.. స్వయం ఉపాధి కార్యక్రమాలతో వృద్ధి చెంది అందరికీ ఆదర్శంగా నిలిచిన మహిళలను 'ప్రేరణ సఖి'లుగా ఎంపిక చేసి సత్కరించాలని ఏపీ మెప్మా నిర్ణయించింది. మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున వారిని సత్కరించాలని నిర్ణయించారు. రాష్ట్ర వ్యాప్తంగా 100 మందిని ఎంపిక చేస్తారు. ఏఎస్ఆర్ జిల్లా తప్ప మిగిలిన 25 జిల్లాల్లో ఒక్కో జిల్లా నుంచి నలుగురు ప్రేరణ సఖిలను ఎంపిక చేయాలని నిర్ణయించారు. సీనియర్ స్వయం సహాయక సంఘ సభ్యులై ఉండి, జీవనోపాదుల కార్యక్రమాలను నిర్వహిస్తూ ఏడాదికి యూనిట్ టర్నోవర్ విలువ రూ.25 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు ఉన్న మహిళలను ఎంపిక చేస్తారు.

నేడు పింఛన్ల పంపిణీ

నెల్లూరు (హరనాథపురం) : ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం జిల్లావ్యాప్తంగా శనివారం ఉదయం ప్రారంభమవుతుంది. 3,07,232 మంది లబ్ధిదారులకు రూ.132.16 కోట్ల పింఛన్ మొత్తాన్ని ప్రభుత్వ సిబ్బంది అందజేయనున్నారు. రాష్ట్ర మంత్రి పొంగూరు నారాయణ నగరంలోని భగత్‌సింగ్ నగర్‌లో లబ్ధిదారులకు పింఛన్లు అందజేయనున్నారు.

ఖాళీలను పదోన్నతులతో భర్తీ చేయాలి: ఎన్ఎంయూ

విజయవాడ, (బస్‌స్టేషన్), ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రజా రవాణా సంస్థలో ఫైనాన్స్, పర్సనల్, మెటీరియల్ విభాగాల్లో డిప్యూటీ సూపరింటెండెంట్ పోస్టులను నిబంధనల ప్రకారం భర్తీ చేస్తున్నారని, అయితే అర్హులైన సీనియర్ అసిస్టెంట్, ఫైనాన్స్, పర్సనల్, మెటీరియల్ విభాగాల్లో ఖాళీ లేనప్పుడు మాత్రమే డైరెక్టు రిక్రూట్‌మెంట్ ద్వారా భర్తీ చేయాలని పీటీడీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ అధ్యక్షుడు పి.రమణారెడ్డి, జనరల్ సెక్రటరీ వైశ్రీనివాసరావు సంస్థ కమిషనర్‌కు లేఖ రాశారు. డైరెక్టు రిక్రూట్‌మెంట్‌కు అనుమతి ఇవ్వడం వల్ల పదోన్నతులు పొందవలసి ఉన్న సీనియర్ అసిస్టెంట్లు తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. ఖాళీలను పదోన్నతుల ద్వారా మాత్రమే భర్తీచేసి ఆయా విభాగాల్లో సూపర్‌వైజర్లు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

బడ్జెట్‌పై ఏమంటున్నారంటే..

రైతులకు మేలు చేకూరేలా..



రాష్ట్ర బడ్జెట్ రైతులకు మేలు చేకూర్చనుంది. వ్యవసాయ రంగానికి అత్యధికంగా రూ.48 వేల కోట్లను కేటాయించడం అభినందనీయం. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ చేపడుతున్న పాలనా విధానాలకు అనుగుణంగా అభివృద్ధి, సంక్షేమాలకు ప్రాధాన్యతనిస్తూ బడ్జెట్‌ను రూపొందించారు. సూపర్ సిక్స్ పథకాలకు నిధులు కేటాయించడంతో ప్రజానికానికి ఈ బడ్జెట్ మేలు చేకూర్చనుంది.

- పూండ్ల స్టాలిన్, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, కోవూరు

ప్రజల ఆకాంక్షలకు అద్దం పడుతుంది

కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజల ఆకాంక్షలకు అద్దం పడుతుంది. ప్రభుత్వ పాఠశాలకు ఉచిత విద్యుత్, అమరావతిలో రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చేయాలనే నిర్ణయం హర్షనీయం. అభివృద్ధి, సంక్షేమంతో పాటు హామీల అమలుకు బడ్జెట్‌లో అధిక ప్రాధన్యతనిచ్చారు. గత వైసీపీ ప్రభుత్వం వ్యసాయరంగాన్ని కుదేలు చేస్తే కొన ఊపిరితో ఉన్న వ్యవసాయ రంగానికి ప్రాణం పోస్తూ రైతే ముందు అనే నినాదాన్ని బడ్జెట్ కేటాయింపుల్లో స్పష్టంగా కనపడింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ప్రవేశపెట్టిన తొలి పూర్తిస్థాయి బడ్జెట్ ప్రజల జీవితాలను మారుస్తుంది.

- సత్యవోలు సత్యంరెడ్డి, ఐటీడీపీ రాష్ట్ర కార్యదర్శి, విడవలూరు

రాష్ట్ర అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం

వెంకటాచలం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని సర్వేపల్లి నియోజకవర్గ జనసేన పార్టీ పరిశీలకుడు బోనుబోయిన ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కూటమి ప్రభుత్వం రాష్ట్ర బడ్జెట్‌లో విద్య, వ్యవసాయ రంగాలతోపాటు అభివృద్ధికి పెద్ద పీట వేసిందన్నారు.

ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

పొదలకూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): పొదలకూరులో శనివారం నుంచి ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షల నిర్వహణకు అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, విజ్ఞాన్ జూనియర్ కళాశాలలను పరీక్షా కేంద్రాలుగా కేటాయించినట్లు ఆయా కళాశాలల చీఫ్ సూపరింటెండెంట్‌లు కె లక్ష్మీనారాయణ, పచ్చిపాల పెంచలయ్య, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు కృష్ణ, యల్లయ్య తెలిపారు.

బుచ్చి వాసికి డాక్టరేట్



కొండయ్య

బుచ్చిరెడ్డిపాళెం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): బుచ్చిరెడ్డిపాళెం లోని సెయింట్ మేరీస్ కళాశాల తెలుగు అధ్యాపకుడుగా పని చేస్తున్న బుచ్చికి చెందిన కోసూరు కొండయ్య పీహెచ్‌డీ పట్టా పొందాడు. ఆత్మకూరు వాసి దోర్నాల రామిరెడ్డి సుబ్బమ్మ నిమ్న జాతులకు చెందిన మహిళల కష్టాలపై అధ్యయనం చేసి నవలలు రచించారు. అయినా ఆ కథలకు ఆదరణలేక అంతగా గుర్తింపు లేకపోయింది. వాటిపైనే పరిశోధనలు చేసి డాక్టరేట్ పొందినట్టు కొండయ్య తెలిపారు.

సర్వీస్ ప్రొవైడర్స్‌కు ఎలక్ట్రీషియన్ కోర్సుపై శిక్షణ

బుచ్చిరెడ్డిపాళెం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీలోని మెప్మా ఆధ్వర్యంలో సర్వీస్ ప్రొవైడర్లకు శుక్ర వారం ఎలక్ట్రీషియన్ కోర్సుపై శిక్షణ కార్య క్రమాన్ని చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అంకయ్య, సీవో నర్మద, ఆర్పీలు, కేకే సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

వైభవంగా అన్నలింగ ప్రతిష్ఠ

ముత్తుకూరు : మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం కృష్ణపట్నం సిద్ధేశ్వరాలయంలో అన్నలింగ ప్రతిష్ఠ వైభవంగా జరిగింది. అనంతరం అన్నలింగ రూపంలో స్వామివారిని ఊరేగించారు. పూర్ణాహుతి అనంతరం అన్నలింగ నిమజ్జనం నిర్వహించారు. స్వామివారికి అభిషేకం చేసిన అన్నంతో భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి కోవూరు జనార్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు వసతులు కల్పించారు.

క్యాన్సర్ వ్యాధిపై అవగాహన అవసరం

ముత్తుకూరు, (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పంటపాలెంలో శుక్రవారం ఎస్ఈఐఎల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ సహకారంతో సీఎస్ఆర్‌లో భాగంగా క్యాన్సర్ వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. మండల టీడీపీ అధ్యక్షుడు పల్లంరెడ్డి రామ్మోహన్ రెడ్డి కార్య క్రమాన్ని ప్రారంభించారు. ఎస్ఈఐఎల్ ఉద్యోగులు, హోమిబాబా క్యాన్సర్ హాస్పిటల్, రీసెర్చ్ సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

కనుల పండువగా ఉదయకాళేశ్వర రథోత్సవం



గండవరం గ్రామంలో గంగాపార్వతి సమేత ఉదయకాళేశ్వర స్వామి రథోత్సవం

గండవరం వీధుల్లో కిక్కిరిసిన భక్తులు

కొడవలూరు, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన గండవరంలో వెలిసి ఉన్న గంగా పార్వతి సమేత ఉదయకాళేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రథోత్సవం, తెప్పో త్సవం కార్యక్రమం కనుల పండువగా జరిగింది. ఉదయం రథోత్స వంలో ఊరేగుతున్న ఉత్సవమూర్తులకు అర్చకులు, వేదపండితులు ప్రత్యేక హారతులిచ్చారు. అనంతరం అశేష జనవాహిని మధ్య రథోత్సవం కదలగానే జిల్లాలోనే నలుమూలల గ్రామాల్లో వచ్చిన భక్తులు ఓం నమఃశివాయ అంటూ నినదించడంతో గండవరం క్షేత్రం పులకించిపోయింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి, ఆలయ చైర్మన్ ఆలం మాలకొండయ్య, తదితరులు పాల్గొన్నారు.



ఉదయ కాళేశ్వరుడి తెప్పోత్సవంలో పాల్గొన్న వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

● తెప్పోత్సవంలో..

ఉదయకాళేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి శుక్రవారం పాల్గొన్నారు. గంగా పార్వతి సమేత ఉదయకాళేశ్వరుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తెప్పో త్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గం ప్రజలు సుఖశాంతులతో ఆయురారోగ్యాలతో ఉండేలా ఆశీర్వదించాలని స్వామివారిని కోరుకున్నట్లు తెలిపారు. ఆమె వెంట రాష్ట్ర పౌరసరఫరాలశాఖ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి, నారాయణ విద్యా సంస్థల జీఎం వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, ఆలయ చైర్మన్ ఆలం మాలకొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా జాతీయ సైన్సు దినోత్సవం

కోవూరు, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పాఠశాలల్లో శుక్రవారం జాతీయ సైన్సు దినోత్సవం అట్టహాసంగా నిర్వహించారు. స్థానిక శ్రీచైతన్య స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో టీడీపీ పార్లమెంటు కమిటీ ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి మాట్లాడుతూ భౌతిక శాస్త్రంలో నోబెల్ బహుమతి పొందిన ఏకైక భారతీయ శాస్త్రవేత్త సర్ సీవీ రామన్ ఒక్కరేనన్నారు. సీవీ రామన్ ఆదర్శంగా విద్యార్థులు చదవాలన్నారు. కార్యక్రమంలో టెక్నో స్కూల్ ప్రిన్సిపాల్ డీ సుబ్రహ్మణ్యం, డీన్ అశోక్‌కుమార్, టీడీపీ నాయకు ఇంటూరు విజయ్ తదితరులు మాట్లాడారు. గీతాంజలి ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సందీప్‌కుమార్ జాతీయ సైన్సు దినోత్సవం వేడుకల్ని ప్రారంభించారు. సర్ సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు పీఎం కిషోర్, జీ సుబ్బారావు మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్విజ్‌పోటీల్ని నిర్వహించారు.

● విడవలూరు : జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు స్థానిక డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నెహ్రూ యువ కేంద్రం అధికారి మహేంద్రరెడ్డి పాల్గొని విద్యార్థులకు పలు సూచనలు చేశారు. మని షి చేసే ప్రతి పనిలో సైన్స్ దాగి ఉందన్నారు. దానిని గుర్తించి మానవాళికి ఉపయోగపడేలా విద్యార్థులు ముందుకు సాగాలన్నారు. ప్రతి అధ్యాపకులు విజ్ఞానవృద్ధి, వికసిత్ భారత్‌కి దోహదపడాల న్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సుజాత, వైస్ ప్రిన్సిపాల్ మధు, అధ్యాపకులు పాల్గొన్నారు.

● తోటపల్లి గూడూరు : జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు మండల పరిధిలోని సౌత్ ఆములూరు, చెన్నాపల్లెపాళెం జడ్పీ హైస్కూల్స్‌లో శుక్రవారం ఘనంగా జరిగాయి. సౌత్ ఆములూరు గ్రామ ఉపసర్పంచు సుధారాణి విద్యార్థులు ఏర్పాటు చేసిన సైన్స్ ప్రదర్శనలు తిలకించి అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం అహ్మద్‌బాషా, పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ రాగూర్, సైన్స్ ఉపాధ్యాయులు ఫణికుమార్ వసంత, లక్ష్మీ పాల్గొన్నారు.

వీఎస్‌యూలో సైన్సు దినోత్సవ వేడుకలు

● వెంకటాచలం : స్థానిక వీఎస్‌యూలో శుక్ర వారం జాతీయ సైన్స్ దినోత్సవ వేడుక లను ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత విచ్చేసి మాట్లాడుతూ వైజ్ఞానిక రంగం అభివృద్ధిలో యువత పాత్ర ఎంతో కీలకమన్నారు. కార్యక్రమంలో వర్సిటీ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ హనుమారెడ్డి, ప్రొఫెసర్ విజయా నంద్‌కుమార్‌బాబు, డాక్టర్ శివశంకర్‌రెడ్డి, డాక్టర్ మేరీ సందీప్, డాక్టర్ త్రివేణి తదితరులున్నారు.



కనుపూరులో సీవీ రామన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

వెంకటాచలం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కను పూరు, నిడిగుంటపాళెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం జాతీ య సైన్సు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా పాఠశాలల విద్యార్థులు వారి పాఠశాలల్లో వైజ్ఞానిక ప్రదర్శన ఏర్పాటు చేశారు. అనంతరం విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహు మతులు అందజేశారు. కార్యక్రమంలో కనుపూరు, నిడిగుంటపాళెం హెచ్‌ఎంలు మురళీమోహన్, చలపతి, సైన్సు ఉపాధ్యాయులు హరిత, సురేఖ, శ్రీధర్, శర్మరియన్, వ్యాయామ ఉపాధ్యాయుడు చెరుకూరు పెంచలయ్య తదితరులున్నారు.

● మనుబోలు : మండలంలోని మడమనూరు ఉన్నత పాఠశాలలో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. సీ.వి. రామన్ చిత్రపటానికి ఉపా ధ్యాయులు, విద్యార్థులు నివాళులు అర్పించారు. రెడ్‌క్రాస్ సంస్థ ద్వారా 100మంది పిల్లలకు రక్త పరీక్షలు చేయించి, వారి బ్లడ్ గ్రూప్ వివరాలు అందించారు. అనంతరం సైన్స్ ప్రయోగాలను ప్రదర్శించారు. వీటిని రెడ్ క్రాస్ ప్రతినిధులు డా. భాస్కర్ రావు, డా. వరప్రసాద్‌లు తిలకించి విద్యార్థులను అభినందించారు. అనంతరం పిల్లలకు పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఇద్దరు ఉపాధ్యాయులు రక్తదానం చేశారు.



మడమనూరు ఉన్నత పాఠశాలలో సైన్సు ప్రదర్శనను తిలకిస్తున్న రెడ్‌క్రాస్ ప్రతినిధి డా.వరప్రసాద్



తోటపల్లి గూడూరు: విద్యార్థుల ప్రదర్శనలను తిలకిస్తున్న ఉపాధ్యాయులు

ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం. వివి రాదాకృష్ణ, టీడీపీ నాయకులు నూనె లక్ష్మయ్య, ఉడతా విజయ్‌కుమార్, సుధీర్ కుమార్, పాఠశాల చైర్మన్ గుమ్మా రమేష్ పాల్గొన్నారు.

సంక్షేమం, శ్రేయస్సు కొసమే విజ్ఞానశాస్త్రం ఆవిర్భావం



రామచంద్రాపురం పాఠశాలలో రామన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

● బుచ్చిరెడ్డిపాళెం : మానవాళి సంక్షేమం, శ్రేయస్సు కోసమే విజ్ఞాన శాస్త్రం ఆవిర్భవించిందని జిల్లా రిసోర్సు సభ్యుడు గండికోట సుధీర్‌కుమార్ అన్నారు. శుక్రవారం జాతీయ విజ్ఞాన శాస్త్రం దినోత్సవం సందర్భంగా బుచ్చి నగర పంచాయతీ రామచంద్రాపురం ప్రాథమికోన్నత పాఠశాలలో సివి. రామన్ చిత్ర పటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అలాగే బుచ్చిలోని గ్లోబల్ స్కూల్లో విద్యార్థులు తయారు చేసిన పలు రకాల సైన్స్ ప్రాజెక్టులు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమాలలో హెచ్‌ఎం శ్రీనివాసులురెడ్డి, సైన్స్ ఉపాధ్యాయుడు బ్రహ్మరెడ్డి, ఉపాధ్యాయులు, గ్లోబల్ స్కూలు కరస్పాండెంట్ గౌసియా మగ్దుం. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

298 ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు : జేసీ

కోవూరు, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం జిల్లావ్యాప్తంగా 298 ధాన్యం కొనుగోలు కేంద్రాల్ని ఏర్పాటు చేసినట్లు జాయింట్ కలెక్టర్ కార్తీక్ తెలిపారు. అందులో కోవూరు నియోజకవర్గం పరిధిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల వివరాలను ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కోవూరు మండలంలో 8, బుచ్చిరెడ్డిపాళెంలో 13, విడవలూరులో 11, ఇందకూరుపేటలో 11, కొడవలూరులో 13 కేంద్రాల్లో కొనుగోలు చేసేందుకు సిబ్బందిని నియమించామని తెలిపారు.

సర్వేపల్లిలో 69 కేంద్రాలు..

వెంకటాచలం, (ఆంధ్రజ్యోతి): సర్వేపల్లి నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న ఐదు మండలాల్లో 69 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు జాయింట్ కలెక్టర్ కార్తీక్ శుక్రవారం ప్రకటనలో పేర్కొ న్నారు. పొదలకూరులో 14, తోటపల్లిగూడూరులో 14, మనుబోలులో 14, ముత్తుకూ రులో 9, వెంకటాచలంలో 18 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారన్నారు. గ్రామాలవారీగా రైతులకు అందుబాటులో ఉండేలా ధాన్యం కొనుగోలు కేంద్రాలు పనిచేస్తాయన్నారు. కొనుగోలు కేంద్రాల్లో కొనుగోళ్లకు సంబంధించి సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. రైతులు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కులంపేరుతో దూషించారని ఫిర్యాదు

మనుబోలు: పనిచేసినందుకు వేతనాలు ఇమ్మని అడిగితే కులంపేరుతో అసభ్య పదజాలంతో దూషించారంటూ చెర్లోపల్లి, కుడితిపల్లికి చెందిన దళిత మహిళలు సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం ఆందోళన చేశారు. దీనిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ చెర్లోపల్లి, కుడితిపల్లి నుంచి పదిమంది దళిత మహిళలు అక్కంపేట గ్రామంలో ఉన్న ఊరగాయ ఫ్యాక్టరీలో కొంతకాలంగా పనిచేస్తున్నామన్నారు. అయితే గతేడాది డిసెంబర్ నెలనుంచి జీతాలు ఇవ్వడం లేదన్నారు. విసుగుచెంది ఫిబ్రవరి 20వరకు పనిచేసి మానేశామన్నారు. తమకు జీతాలు వచ్చేలా న్యాయం చేయాలంటూ పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి తలారి దేవదానం పాల్గొన్నారు.

సీఆర్‌సీకి పూర్తి సహాయ సహకారాలు అందిస్తా



చిన్నారులతో మదీనా వాచ్ గ్రూప్ అధినేత ఇంతియాజ్, సీఆర్‌సీ డైరెక్టర్ మనోజ్‌కుమార్

వెంకటాచలం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): సంయుక్త ప్రాంతీయ కేంద్రానికి (సీఆర్‌సీ) తనవంతు పూర్తి సహాయ సహకారాలు అంది స్తానని మదీనా వాచ్ గ్రూప్ అధినేత షేక్ ఇంతియాజ్ అన్నారు. మండలంలోని చవటపాళెం పంచాయతీ అనుపల్లిపాడు రైల్వే గేటు వద్ద ఉన్న సీఆర్‌సీలో శుక్రవారం జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన విచ్చేసి మాట్లాడారు. అనంతరం దివ్యాంగులకు వీల్ చైర్స్, ట్రైసైకిల్స్, చేతి గడియారాలను అందజేశారు. కార్యక్రమంలో సీఆర్‌సీ డైరెక్టర్ మనోజ్‌కుమార్ తదితరులున్నారు.

కోడిపందాల స్థావరాలపై దాడులు

పొదలకూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అమ్మవారిపాలెం గ్రామంలో కోడిపందాల స్థావరాలపై శుక్రవారం పొదలకూరు ఎస్ఐ షేక్ హనీఫ్ తమ సిబ్బందితో కలిసి ఆకస్మిక దాడి నిర్వహించారు. కోడిపందాలు వేస్తున్న నలుగురిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

కనుల పండువగా ఆది దంపతుల కల్యాణం



వేదమంత్రాలతో పార్వతీ పరమేశ్వరుల కళ్యాణం

పొదలకూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్ర జ్యోతి): పట్టణం లోని పురాతన శివాలయంలో శుక్రవారం ఆది దంపతుల కల్యాణం కన్నుల పండువగా జరిగింది. ఆలయంలోని ప్రత్యేక వేదికపై కామా క్షితాయికి రామలింగే శ్వరుడి మాంగల్య ధారణ కార్యక్రమం శాస్త్రోక్తంగా జరిగింది. అనంతరం స్వామివారిని గజవాహనంపై ఊరేగించారు. కల్యాణోత్సవానికి ఉభయకర్తలుగా మండలంలోని ఆర్యవైశ్య సంఘం వారు వ్యవహరించారు. అనంతరం అన్నప్రసాద వితరణను తన్నీరు వెంకటచలపతి, సునీతలక్ష్మీ వారి కుమారుడు హరీష్, చందన దంపతులు నిర్వహించారు. పూల అలంకరణ చీమకుర్తి శంకర్‌కుమార్, వాకాటి జయరామయ్య కుటుంబ సభ్యులు చేశారు. ఈకార్యక్రమంలో ఆలయ ఈఓ ప్రసాదరెడ్డి, ప్రధాన అర్చకులు ప్రసాద్‌స్వామి, రమేష్, మనోహర్, శివ, కుమార్, పట్టణ ఆర్యవైశ్య సంఘం నాయకులు, ఆర్యవైశ్య అసోసియేషన్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. శుక్రవారం రాత్రి పారువేట కార్యక్రమాన్ని లింగంపల్లి గ్రామస్థులు నిర్వహించారు.

కోవూరు అభివృద్ధికి నిధులివ్వండి

● మంత్రి లోకేష్‌కు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి విజ్ఞప్తి



మంత్రి లోకేష్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

నెల్లూరు (హరనాథపురం), ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర బడ్జెట్ సమావేశాల సందర్భంగా శుక్రవారం అసెంబ్లీ లాబీలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌తో కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కొద్దిసేపు మాట్లాడారు. కోవూరు నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి, పెండింగ్ ప్రాజెక్టులను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని కోరారు.

నేర వార్తలు



రెండు వర్గాల వారితో మాట్లాడుతున్న పోలీసులు

శ్మశాన స్థలంపై వివాదం

- దహన సంస్కారం విషయమై ఉద్రిక్తత
- పోలీసు, రెవెన్యూ శాఖల రంగ ప్రవేశంతో సద్దుమణిగిన వివాదం
- శాశ్వత పరిష్కారం చూపాలంటూ దళితుల డిమాండ్

వెంకటాచలం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామదాసుకండ్రిగ పంచాయతీ నాయుడుపాళెం గ్రామంలో శుక్రవారం శ్మశాన స్థలం విషయమై రెండు వర్గాల మధ్య తీవ్ర వివాదం నెలకొనడంతో ఉద్రిక్తత నెలకొంది. వివరాల్లోకి వెళితే దళిత వర్గానికి చెందిన తాటిపర్తి ఏడుకొండలు (40) అనారోగ్యంతో మృతి చెందాడు. దహన సంస్కారాలు నిర్వహించేందుకు శ్మశానానికి తీసుకెళ్లారు. అక్కడ ఇది తమ శ్మశానం అంటూ ఇక్కడ దహన సంస్కారాలు చేయడానికి వీలులేదని బీసీలు (వడ్డెరలు) అడ్డుకున్నారు. దీంతో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. పోలీస్, రెవెన్యూ శాఖలకు సమాచారం అందడంతో వారు హుటాహుటిన అక్కడకు చేరుకుని రెండువర్గాల వారితో చర్చలు జరిపి వివాదాన్ని సద్దుమణిగించారు. కాగా, దళితులు మాత్రం తమ శ్మశాన స్థలాన్ని బీసీ వర్గానికి చెందిన ఒక వ్యక్తి ఆక్రమించుకొని మిర్చి సాగు చేస్తున్నాడని, గతంలో కూడా ఇదే మాదిరిగా ఇద్దరికి ఇక్కడే దహనసంస్కారాలు నిర్వహించామని, ప్రస్తుతం దహన సంస్కారాలు నిర్వహిస్తుంటే బీసీలు వచ్చి అడ్డుకుని వారి శ్మశాన స్థలం అంటున్నారని, ఆక్రమణకు గురైన తమ శ్మశాన స్థలాన్ని తమకు అప్పగించాలని అధికారులను వారు డిమాండ్ చేశారు. ఈవిషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. చివరకు దళితుల శ్మశానం పక్కనే దహనసంస్కారాలు నిర్వహించారు.

మా బిడ్డను అల్లుడే చంపేశాడు

- యువతి తల్లిదండ్రుల రోదన
- నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు



కన్నీరు పెట్టుకుంటున్న మృతురాలు తల్లి

నెల్లూరు(క్రైం), ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): తమ బిడ్డ ఆత్మహత్యకు ఆమె భర్తే కారణం, వాడిని చంపేసి నా బిడ్డతో పాటు పంపండి అంటూ ఓ యువతి తల్లిదండ్రులు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి మార్చురీ వద్ద శుక్రవారం గుండెలు బాదుకుంటూ కన్నీటి సంద్రంలో మునిగి పోయారు. బిడ్డను అల్లారు ముద్దుగా పెంచుకున్నామని, డబ్బు కోసమే భర్త చంపేశాడని ఆరోపించారు.



శివప్రియ(ఫైల్)

పొదలకూరు మండలం మర్రిపల్లి గ్రామానికి చెందిన పిచ్చిరెడ్డి పెద్ద కుమార్తె శివప్రియ (25) నగరంలోని ఓ ప్రైవేటు కళాశాలలో డిగ్రీ చదవుతుండగా నెల్లూరు రూరల్ మండలం కాకుపల్లికి చెందిన శేషసాయిని ప్రేమ వివాహం చేసుకుంది. వారికి ఒక బిడ్డ కలిగాడు. ఇటీవల ఆ కుటుంబం నవాబుపేటకు కాపురం వచ్చింది. అప్పటి నుంచి శివప్రియ తల్లిదండ్రులకు ఫోన్ చేసి తన భర్త తనతో గొడవ పడుతున్నాడని, శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నాడని, అనవసరంగా పెళ్లి చేసుకున్నానని చెప్పి బాధపడుతూ ఉండేది. ఈ క్రమంలో గురువారం శేషసాయి పిచ్చిరెడ్డికి ఫోన్ చేసి శివప్రియ మరణించినట్లు చెప్పాడు. దీంతో తల్లిదండ్రులు నెల్లూరు చేరుకుని అల్లుడిని నిలదీశారు. ఇంట్లో ఉరి వేసుకుందని చెప్పాడు. ఈ ఘటనపై గురువారం రాత్రి నవాబుపేట పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా, కుమార్తె మృతికి కారణమైన శేషసాయిపై చర్యలు తీసుకొని న్యాయం చేయాలని కోరుతూ నవాబుపేట పోలీసులకు శివప్రియ తండ్రి పిచ్చిరెడ్డి ఫిర్యాదు చేశారు.

మద్యం, మటన్ లాగించి ఇంజనీరు మృతి

● కుర్చీలో కూర్చున్నోడు కూర్చున్నట్లే..!



కుర్చీలో రఘురామ్ మృతదేహం

నెల్లూరు రూరల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : ఓ ఇంజనీరు ఫుల్లుగా మద్యం సేవించి, మూడు ప్యాకెట్ల సిగరెట్లు తాగి, మటన్ బిరియాని తింటూ మరణించాడు. ఈ ఘటన నెల్లూరు రూరల్ ధనలక్ష్మీపురం వద్దనున్న కల్పన రెసిడెన్సీలో శుక్రవారం వెలుగు చూసింది. రూరల్ సీఐ గుంజి వేణు అందించిన వివరాలు మేరకు.. ఉమ్మడి గుంటూరు జిల్లా బాపట్ల సూర్యలంక రోడ్డుకు చెందిన చాపల రఘురామ్ (40) నెల్లూరు జిల్లాలోని అమేజింగ్ కంపెనీలో ఇంజనీరుగా పని చేస్తున్నారు. ఈ నెల 14వ తేదీన నెల్లూరు వచ్చారు. అప్పట్నుంచి ధనలక్ష్మీపురం కేజీకే కల్యాణ మండపం అనుబంధ కల్పన రెసిడెన్సీలో గది అద్దెకు తీసుకుని సహచర ఉద్యోగి భగవాన్‌తో కలిసి ఉంటున్నాడు. గురువారం రాత్రి కుర్చీలో కూర్చుని ఒక హాఫ్, రెండు క్వార్టర్ బాటిళ్ల మందు తాగాడు. మూడు ప్యాకెట్ల సిగిరెట్లు కాల్చాడు. మటన్ బిరియానీ ఆర్డర్ చేసి తెప్పించుకుని తింటూ అదే కుర్చీలో వెనుకకు వాలి ప్రాణాలు కోల్పోయాడు. పక్కన నిద్రపోతున్న సహచర ఉద్యోగి శుక్రవారం ఉదయం లేచి చూసుకునే సరికి రఘురామ్ నిర్జీవంగా ఉన్నాడు. దీంతో హోటల్ సిబ్బంది ద్వారా పోలీసులకు సమాచారం అందిం చారు. రఘురామ్ అవివాహితుడని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

దాడి ఘటనలో ఇద్దరిపై కేసు

నెల్లూరు(క్రైం), ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): సెంట్రింగ్ మేస్త్రీపై దాడి చేసిన ఘటనలో ఇద్దరు వ్యక్తులపై వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... నెల్లూరులోని చంద్రబాబునగర్‌కు చెందిన సుబ్రహ్మణ్యం రమేష్ సెంట్రింగ్ మేస్త్రీగా జీవనం సాగిస్తున్నాడు. అదే ప్రాంతానికి చెందిన మణికంఠ, సెల్వ అనే అన్నదమ్ములు రమేష్ వద్ద పనులుకు వెళ్లేవారు. ఈ నెల 25వ తేదీ రాత్రి రమేష్ వద్దకు వెళ్లి డబ్బు కావాలని కోరారు. తనవద్ద లేవని అతను చెప్పడంతో ఆవేశంతో అన్నదమ్ములు మేస్త్రీపై దాడి చేశారు. గాయాలపాలైన ఆయన వైద్యశాలలో చికిత్స పొంది శుక్రవారం వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నెల్లూరు రూరల్

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

విద్యార్థులకు ట్రాఫిక్ గండం



- వాహన చక్రబంధంలో నగరం ● ఆటోలు, సిటీ బస్సులు ఇష్టానుసారం
- ఒకవైపు రోడ్ల ఆక్రమణ.. ● మరోవైపు రోడ్లపైనే పార్కింగ్
- బృందావనం, పొగతోటలో వీధుల నిండా వాహనాలే!
- సమయానికి పరీక్షకు వెళ్లడం సవాలే!

రోడ్ల విస్తరణ జరగక పోవడం, షాపింగ్ మాల్స్, దుకాణాలకు పార్కింగ్ ప్రాంతాలు లేకపోవడం, రోడ్లపై ఆక్రమణలు విపరీతంగా పెరగడం, ఫుట్‌పాత్‌లు లేకపోవడం, వాహనాల సంఖ్య ప్రతి ఏడాది రెండింతలు అవుతుండటం, అధికారులు ప్రత్యేక పార్కింగ్ ప్రాంతాలు ఏర్పాటు చేయక పోవడం, ట్రాఫిక్‌ను నియంత్రించాల్సిన పోలీసులు చలానాలు రాయడానికే పరిమితం కావడం, ట్రాఫిక్ రూల్స్ పాటించకుండా ఎక్కడ పడితే అక్కడ ఆటోలు, సిటీ బస్సులు నిలపడం, పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ఆటో స్టాండ్లు, వాహనచోదకుల్లో క్రమశిక్షణ లేకపోవడం... వెరసి నెల్లూరు నగరం ట్రాఫిక్ నరకానికి కేరాఫ్ అడ్రస్‌గా మారింది. దీనివల్ల ప్రజలు నిత్యం అవస్థలు పడుతున్నారు. అత్యవసర సేవలు అందించే అంబులెన్స్‌లు, ఫైర్ ఇంజన్లు కూడా సకాలంలో వెళ్లలేని పరిస్థితి. ఏడాదంతా ఎలా ఉన్నా ప్రస్తుతం పరీక్షల సీజన్ మొదలైంది. శనివారం నుంచి ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు మొదలవుతున్నాయి. ఆలస్యమైతే పరీక్ష రాయడానికి అనుమతించారు. ఇలాంటి పరిస్థితుల్లో.. ఈ ట్రాఫిక్ ఝుంఝూటంలో పరీక్ష కేంద్రాలకు ఎలా చేరుకోవాలా..? అని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

నెల్లూరు(క్రైం), ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది. నగరంలో ప్రయాణమంటేనే నరకమనే స్థాయిలో ప్రజలు భయపడుతున్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారుతున్నా, కొత్తగా ఎంత మంది అధికారులు వస్తున్నా ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం చూపేవారు మాత్రం కనిపించడం లేదు. 'నగర రోడ్లపై ఆక్రమణలు తొలగిస్తాము, సిగ్నల్ వ్యవస్థను ప్రారంభిస్తాము, పార్కింగ్ ప్రాంతాలను ఏర్పాటు చేస్తాము, ట్రాఫిక్ సమస్య పరిష్కరిస్తాం' అని పాలకులు చేస్తున్న ప్రకటనలు నీటి మూటల్లా మారుతున్నాయి. జిల్లా కలెక్టర్లు సైతం నగరంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారం కోసం ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేయాలంటూ ఆదేశాలు జారీ చేస్తూనే ఉన్నారు. అయినా సమస్య రోజురోజుకు తీవ్రమవుతోందేగానీ తరగడం లేదు. శనివారం నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభమవుతున్నాయి. త్వరలో పదో తరగతి పరీక్షలు కూడా మొదలవుతాయి. వీటికి పరీక్షల కేంద్రాల్లో నగరమంతా ఉన్నాయి. ఈ క్రమంలో నిర్ణీత సమయంలోపు పరీక్ష కేంద్రాలకు చేరుకోవడమే విద్యార్థులకు పెద్ద పరీక్షగా మారనుంది.

పార్కింగ్ ప్రాంతాలు ఎక్కడ?

నగరంలో ప్రత్యేకంగా కొన్ని ప్రాంతాలను గుర్తించామని ఆ ప్రాంతాల్లో వాహనాల పార్కింగ్ పాయింట్లు ఏర్పాటు చేస్తామని ఇప్పటికే పలువురు అధికారులు అనేక సార్లు ప్రకటనలిచ్చారు. అయితే అవి ఆచరణకు మాత్రం నోచుకోవడం లేదు. ఈ నేపథ్యంలో ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు, నిపుణులతో ప్రత్యేక కమిటీ వేసి పటిష్ట చర్యలతో ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.



ట్రాఫిక్ సమస్యకు ప్రధాన కారణాలు...

- నగరంలోని ఆత్మకూరు బస్టాండు కూడలి పక్కన రైల్వే అండర్ బ్రిడ్జీ వద్ద సిటీ బస్సుల కోసం స్టాండు ఏర్పాటు చేయడంతో బస్సులు ఎక్కడ పడితే అక్కడ నిలపడం, వాటిని ఆనుకొని వందల ఆటోలు నిలిపి ప్రజలను ఎక్కించుకోవడం.
- పొట్టిశ్రీరాములు విగ్రహం వద్ద కోవూరు వైపు వెళ్లే ఆటోలు, సిటీ బస్సులు ఇష్టానుసారంగా నిలపడం.
- స్టోన్‌హౌస్‌పేట వైపు వెళ్లే మార్గంలో నాలుగు వంతెనలు ఉండగా పాత వంతెనలు రెండూ పండ్ల బండ్లు, ఆటో స్టాండ్లతో నిండిపోయాయి. మిగిలిన రెండు వంతెనలపైనా చిరు వ్యాపారులు చేరడం.
- స్టోన్‌హౌస్‌పేటలో దుకాణాల ముందు రోడ్డుపైనే వందలాది పార్కింగ్. పప్పులవీధిలోకి సరుకుల దిగుమతి కోసం భారీ వాహనాల వస్తే అవి వెళ్లే వరకు అటూ.. ఇటూ వాహనాలు నిలిచిపోవలసిందే..!
- మినీ బైపాస్‌లో శ్రీనివాస అగ్రహారం వద్ద రాత్రి 7 గంటల నుంచి రోడ్డు పక్కన పెద్ద సంఖ్యలో ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు నిలిపివేయడం.
- టీడీపీ కార్యాలయం నుంచి వనంతోపు సెంటర్ వరకు రోడ్డుకు ఇరువైపులా చికెన్ పకోడా, ఫ్రైడ్‌రైస్, హాట్‌ఫుడ్స్ న్యూడిల్స్, పానీపూరీ బండ్లు పెట్టి వ్యాపారం చేస్తున్నారు. వాటిని తినడానికి వచ్చే వారు రోడ్లపైనే వాహనాలు నిలిపివేస్తున్నారు.
- అయ్యప్పగుడి సెంటర్‌లో ట్రాఫిక్ పోలీసులు తరచూ విధుల్లో ఉండక పోవడంతో వాహనాల రాకపోకలు అస్తవ్యస్తం అవుతున్నాయి.
- వేదాయపాళెం సెంటర్, కరెంటాఫీసు సెంటర్‌లో రోడ్డు ఆక్రమణలు, రోడ్లపై పార్కింగ్
- బొల్లినేని వైద్యశాల కూడలిలో ఒకవైపు పెట్రోల్‌బంకు నుంచి వాహనాలు బయటకు రావడం, మరోవైపు ఆసుపత్రిలోకి వచ్చి వెళ్లే వాహనాలు, అక్కడే ఇతర వాహనాలు మలుపు తిరగడం, రోడ్డు వెడల్పు తక్కువ కావడంతో నిత్యం వాహనాలు నిలిచి పోతున్నాయి.
- ఆర్టీసీ బస్టాండు వద్ద ప్రైవేటు ట్రావెల్స్ బస్సులు నిలిపి ప్రయాణి కులను ఎక్కించుకోవడం, అక్రమ ఆటో స్టాండ్లతో ట్రాఫిక్ అంతరాయం.
- కూరగాయల మార్కెట్ సెంటర్‌లో పెద్దపెద్ద హోటల్స్ ఉండటం, వాటికి తగినట్లు పార్కింగ్ లేకపోవడం, మార్కెట్‌కు వచ్చే వారు కూడా రోడ్డుపైనే వాహనాలు నిలిపివేయడంతో ఆ ఏరియా మొత్తం పార్కింగ్ ప్రాంతంగా మారిపోయింది.
- లీలామహల్ రోడ్డులో పోలీసులు సెంటర్ పార్కింగ్ ఏర్పాటు చేశారు. అయితే ఇది కాకుండా రోడ్డుకు అటూ.. ఇటూ కూడా వాహనాలు నిలిపివేస్తున్నారు.
- వీఆర్సీ నుంచి రామలింగాపురం వెళ్లే వాహనాలు, పొగతోట నుంచి మార్కెట్ వైపు వచ్చే వాహనాలు అండర్ బ్రిడ్జి వద్ద కలుస్తుండటంతో ట్రాఫిక్ జామ్ అవుతోంది.
- రామలింగాపురంలో రోడ్డుకు మధ్యలో, ఆ చివర.. ఈ చివర మొత్తం పార్కింగే..!
- గాంధీబొమ్మ సెంటర్ వద్ద సిటీ బస్సులు, ఆటోలు ఇష్టానుసారంగా నిలిపి వేయడం.
- ట్రంకురోడ్డులో రహదారి వెడల్పు తక్కువ కావడం, పార్కింగ్ వసతి లేకపోవడం, వన్‌వే అయినప్పటికీ వాహనాలు ఎదురుగా వస్తుండటంతో ఆ ప్రాంతం ట్రాఫిక్‌కు అడ్డాగా మారింది.
- వైద్యశాలలు అధికంగా ఉండే పొగతోట, బృందావనంలోని దాదాపుగా అన్నీ వీధులు వాహనాలతో నిండిపోతున్నాయి.
- వ్యాపార కేంద్రాలైన చిన్నబజారు, పెద్ద బజారులో ఇరుకైన రోడ్డు, దానిపైనే కార్లు, ఆటోలు రావడంతో ఆ వీధిలోకి వెళితే ఎప్పటికి బయటకు వస్తామో చెప్పలేని పరిస్థితి.

సుందరేశ్వరుడి ఉత్సవాలు సమాప్తం



ఏకాంతసేవ నిర్వహిస్తున్న అర్చకులు

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి) : నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఉన్న సుందరేశ్వర స్వామి ఆలయంలో శివరాత్రి మహోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. ఉదయం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, రుద్ర హోమం, మహా పూర్ణాహుతి, తీర్థవాది, వసంతోత్సవం జరిగాయి. సాయంత్రం ధ్వజావరోహణం, ప్రాకారోత్సవం, కుంభ హారతులు జరిగాయి. రాత్రి ఏకాంతసేవ చేశారు. ఈ కార్యక్రమాల్లో దేవదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్, ఆలయ ఈవో కోవూరు జనార్దన్‌రెడ్డి, అర్చకులు సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శనలు



నమూనాలు తిలకిస్తున్న డీఎస్పీ సింధుప్రియ

నెల్లూరు(విద్య), ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా నగరంలోని పలు పాఠశాలల్లో శుక్రవారం వైజ్ఞానిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. నారాయణ విద్యాసంస్థల్లో జరిగిన వైజ్ఞానిక ప్రదర్శనల్లో భాగంగా గోమతి నారాయణ పాఠశాలలో జరిగిన కార్యక్రమానికి నగర డీఎస్పీ పీ సింధుప్రియ అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సాంకేతిక నైపుణ్యతను వెలికి తీసేందుకు వైజ్ఞానిక ప్రదర్శనలు ఎంతో దోహదం చేస్తాయని చెప్పారు. పలు ప్రాజెక్టులను పరిశీలించి విద్యార్థులను అభినందించారు. అలాగే రామలింగాపురం, బాలాజీనగర్, స్టోన్‌హౌస్‌పేట, ధనలక్ష్మీపురం తదితర బ్రాంచ్‌లలో జరిగిన వైజ్ఞానిక ప్రదర్శనలు కూడా అందరినీ అలరించినట్లు విద్యాసంస్థల జనరల్ మేనేజర్ వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో నారాయణ మెడికల్ కళాశాల సూపరింటెండెంట్ బీ హరిప్రసాద్‌రెడ్డి, నెల్లూరు ఎంఈవో తిరుపాలు, బాలాజీనగర్ సీఐ సాంబశివరావు, ఏజీఎం రవివర్మ, ఆర్ఐ ఆదిశేషయ్య, డీన్ నరేంద్ర, ప్రిన్సిపాళ్లు వందన, ప్రసాద్, వెంగళరావు, రాజేశ్వరి, సుధాకర్ పాల్గొన్నారు.

- నగరంలోని బాలాజీనగర్ శ్రీగీతాంజలి పాఠశాలలో సర్ సీవీ రామన్ వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. అర్బన్ ఎంఈవో సయ్యద్ హమీద్ మాట్లాడుతూ మానవ ప్రగతికి మూలమైన సైన్స్‌పై విద్యార్థులు అవగాహన పెంచుకుని నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలని పిలుపునిచ్చారు. అనంతరం ప్రదర్శనలు తిలకించి అభినందించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఎంఈవోలు నరసయ్య, రమేష్‌బాబు, అపస్మా జిల్లా అధ్యక్షుడు ఎన్ శ్రీధర్, పాఠశాల కరస్పాండెంట్ వై వెంకటరామయ్య, హెచ్‌ఎం కే ప్రసన్నలక్ష్మి, సైన్స్ ఉపాధ్యాయులు కుసుమ, వేణు, నరసింహమూర్తి పాల్గొన్నారు.



గీతాంజలి పాఠశాలలో..

- వేదాయపాళెం శ్రీసాయి మహావిద్యాలయంలో నిర్వహించిన సైన్స్ ఎక్స్‌పో అందరినీ ఆకట్టుకుంది. జిల్లా సైన్స్ అధికారి కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకుని నూతన ఆవిష్కరణలతో దేశాభివృద్ధికి పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ టీ నారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.
- చిల్డ్రన్స్‌పార్కు సమీపంలోని మౌంట్‌లిటిల్ గ్రూప్స్ స్కూల్‌లో విద్యార్థుల ప్రదర్శనలు తల్లిదండ్రులను, ఆహుతులను ఆకట్టుకున్నాయి. కరస్పాండెం ట్ ధీరజ్, కోఆర్డినేటర్ దినేష్, ప్రిన్సిపాల్ రూపేష్, సిబ్బంది పాల్గొన్నారు.
- కొండాయపాళెం నగరపాలక ప్రాథమిక పాఠశాలలో సైన్స్‌డే వేడుకలు నిర్వహించారు. హెచ్‌ఎం భాస్కర్‌రావు మాట్లాడుతూ విద్యార్థులు బాల్యం నుంచే పరిశీలన, శాస్త్రీయ దృక్పథం అలవర్చుకునేలా ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. అనంతరం సైన్స్ నమూనాలను పరిశీలించి విద్యార్థులకు బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు హరీష్, కిరణ్, సోమేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.
- నగరంలోని అవెన్యూస్ పాఠశాలలో శుక్రవారం సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వ హించారు. విద్యార్థులు వివిధ అంశాలకు సంబంధించిన ప్రయోగాలు, ప్రాజెక్టులు, మోడల్స్ ప్రదర్శించారు. బుర్రకథ, హరికథ, నుక్కడ్‌నాటక్, రాజస్థానీ ఘూమర్, ఆహార ప్రదర్శనలు, రోబోటిక్ స్టాల్స్, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ ఎగ్జిబిషన్, యోగా ప్రదర్శన ఆకర్షణగా నిలిచాయి. డాక్టర్ పీ ప్రసాదరావు, బీ మనోజ్ కుమార్ తిలకించి విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్ర మంలో పాఠశాల చైర్మన్ బాబునాయుడు, డీన్ కళాకృష్ణ, కరస్పాండెంట్ కృష్ణచైతన్య, ప్రిన్సిపాల్ శ్వేత సంధ్యా. సిబ్బంది పాల్గొన్నారు.
- నగరంలోని డీకే ప్రభుత్వ డిగ్రీ మహిళా కళాశాలలో శుక్రవారం సైన్స్‌డే నిర్వహించారు. విద్యార్థినులకు పలు రకాల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందచేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ డీ గిరి, వైస్ ప్రిన్సిపాల్ రమణరావు, సిబ్బంది పాల్గొన్నారు.



అవెన్యూస్ స్కూలులో..

డిప్యూటీ మేయర్ తహసీన్ బాధ్యతల స్వీకరణ

నెల్లూరు(సిటీ), ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగర డిప్యూటీ మేయర్‌గా ఇటీవల ఏకగ్రీవంగా ఎన్నికైన తహసీన్ శుక్రవారం కార్పొరేషన్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరిం చారు. భర్త ఇంతియాజ్‌తో కలిసి ఆమె కు కేటాయించిన చాంబర్ లోపలకు వెళ్లారు. వారికి వక్ఫ్‌బోర్డు రాష్ట్ర చైర్మన్ అబ్దుల్ అజీజ్, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, నగర కమిషన ర్ సూర్యతేజ, టీడీపీ నాయకుడు వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, అంతర్జాతీయ హ్యూమన్ రైట్స్ ప్రొటక్షన్ కమిషన్ స్టేట్ చీఫ్ జనరల్ సెక్రటరీ షేక్ ఇంతియాజ్, పలువురు కార్పొరేటర్లు, నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. కార్పొరేషన్ సేవలను ప్రజలకు చేరవేయడంలో తనవం తు కృషి చేస్తానని ఈ సందర్భంగా తహసీన్ వెల్లడించారు.

రెడ్‌క్రాస్ ప్రాజెక్టులతో విశిష్ట సేవలు : చైర్మన్

నెల్లూరు (వైద్యం), ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : ఇండియన్ రెడ్‌క్రాస్‌కు చెందిన వివిధ ప్రాజెక్టుల ద్వారా ప్రజలకు విశిష్ట సేవలు అందిస్తున్నట్లు రెడ్‌క్రాస్ పాలక మండలి చైర్మన్ వాకాటి విజయకుమార్‌రెడ్డి వెల్లడించారు. శుక్రవారం రెడ్‌క్రాస్ సమావేశ మందిరంలో రెడ్‌క్రాస్ ప్రాజెక్టులపై రెయిన్‌బో కళాశాల విద్యార్థులకు చైర్మన్ వివరించారు. రెడ్‌క్రాస్‌లో 13 ప్రాజెక్టులు పని చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ వైస్ చైర్మన్ దామర్తి జనార్దన్ రాజు, కోశాధికారి సురేష్‌కుమార్‌జైన్, సభ్యులు యాలమూరి రంగయ్యనాయుడు, గుణపాటి ప్రసాద్‌రెడ్డి, యడవల్లి సురేష్ తదితరులు పాల్గొన్నారు.



● బడ్జెట్‌పై ఏవరేమన్నారంటే..

సమపాళ్లలో సంక్షేమం, అభివృద్ధి



సంక్షేమం, అభివృద్ధి సమపాళ్లలో మేళవించిన బడ్జెట్ ఇది. అన్నీ వర్గాల ప్రజలకు ఆశాజనకంగా ఉంది. గత ప్రభుత్వం చేసిన ఆర్థిక విధ్వంసాన్ని సరి చేసుకుంటూ వ్యవసాయం, పరిశ్రమలు, విద్య, ఉద్యోగ ఉపాధి అవకాశాలకు తగిన విధంగా నిధులు కేటాయించడం శుభపరిణామం. తెలుగు భాషాభివృద్ధికి రూ.10కోట్లు కేటాయించడం సంతోషకరం.

\- షేక్ ఖాసిం, కార్యదర్శి, భారతసేవా ఫౌండేషన్

రాష్ట్ర ప్రగతి పరుగులు తీసే బడ్జెట్

తెలుగు భాషాభివృద్ధికి ప్రాచుర్యం కల్పించేందుకు నిధులు కేటాయిం చడం చాలా ఆనందంగా ఉంది. యువజన, పర్యాటక, సాంస్కృతిక శాఖకు దాదాపు రూ. 500 కోట్లు కేటాయించడం సంతోషకరం. విద్యాశాఖకు మంచి కేటాయింపులు చేయడం ద్వారా ఆగిపోయిన నిర్మాణ పనులు పూర్తయ్యే అవకాశం కలుగుతుంది. పంచాయతీరాజ్ శాఖకు ప్రాధాన్యం ఇచ్చి గ్రామీణ రోడ్లు వేయించడం శుభపరిణామం. ఈ బడ్జెట్‌తో రాష్ట్ర ప్రగతి ఇక పరుగులు తీస్తుందని ఆకాంక్ష..!

\- డాక్టర్ పెరుగు రామకృష్ణ, అంతర్జాతీయ కవి, నెల్లూరు

ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు

రాష్ట్ర బడ్జెట్‌లో 2025-26 సంవత్సరానికి బ్రాహ్మణ కార్పొరేషన్‌కు రూ.345.43కోట్లు కేటాయించినందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు ధన్యవాదాలు. త్వరలో బ్రాహ్మణ కార్పొరేషన్ పథకాలను అన్నింటిని పునరుద్ధరించి బ్రాహ్మణ జాతి అభివృద్ధికి పాటుపడాలి.

\- ఇసుకపల్లి కామేశ్వర ప్రసాద్, బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు

వృద్ధులకు దుస్తుల పంపిణీ

నెల్లూరు(విద్య), ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని వాత్సల్య అనాథ శరణాలయంలో వృద్ధులకు శుక్రవారం దుస్తులు పంపిణీ చేసి స్వీట్ పంచిపెట్టారు. అసోసియేషన్ అధ్యక్షుడు చింతల అమరేంద్రరెడ్డి, కార్యదర్శి పొన్నం రవిచంద్ర, కోశాధికారి గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు : జేసీ కార్తీక్



నెమ్ము శాతాన్ని గుర్తించే పరికరం పనితీరును పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ కార్తీక్

నెల్లూరు రూరల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : చేతికందిన ధాన్యాన్ని విక్రయించడంలో దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని జేసీ కార్తీక్ రైతులకు సూచించారు. శుక్రవారం నెల్లూరు రూరల్ మండలం కలివెల పాళెంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నేతృత్వంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం అక్కడున్న రైతులతో మాట్లాడారు. ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, పండించిన ప్రతీ గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని భరోసా ఇచ్చారు. కాగా, తమ గ్రామంలో వేబ్రిడ్జి, అదనపు గిడ్డంగి అవసరం ఉందని రైతులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై తనకు ప్రతిపాదనలు పంపాలని డీసీవో గురప్పను జేసీ ఆదేశించారు. నెల్లూరు రూరల్లో గతంలో ఏర్పాటు చేసిన అన్నీ ప్రాంతాల్లో ప్రస్తుత సీజన్‌లోనూ ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖ డీఎం అర్జున్‌రావు, డీఎస్‌వో అంకయ్య పాల్గొన్నారు.

రంజాన్ ఏర్పాట్లలో లోపాలు రానివ్వొద్దు : ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి



సమీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : రంజాన్ మాసానికి సంబంధించి మసీదుల వద్ద ఎలాంటి లోపాలు లేకుండా, ముందస్తు జాగ్రత్తలతో ఏర్పాట్లు చేయాలని రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన కార్యాలయంలో ముస్లిం మత పెద్దలు, అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రతీ మసీదు వద్ద పారిశుధ్య మెరుగుకు తగు ఏర్పాట్లు చేయాలన్నారు. తాగునీరు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంహెచ్‌వో డాక్టర్ చైతన్య, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

మసీదుల పరిసరాల పరిశుభ్రత

నెల్లూరు (వైద్యం,ఆంధ్రజ్యోతి) : నగరంలోని మసీదుల వద్ద పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా కృషి చేస్తున్నట్లు టీడీపీ వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు దర్శి హరికృష్ణ వెల్లడించారు. శుక్రవారం 44వ డివిజన్ పరిధిలో ని మసీదుల వద్ద మున్సిపల్ కార్మికులతో పరిసరాలను శుభ్రం చేయించారు.

టైలర్ల అభ్యున్నతికి కృషి చేయాలి

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం నుంచి టైలర్లకు సంక్షేమ పథకాలు, పింఛన్లు వంటివి సాధించడంతోపాటు టైలర్ల అభ్యున్నతికి అసోసియేషన్ కమిటీలు కృషి చేయాలని జిల్లా టైలర్స్, వర్కర్స్ ఫెడరేషన్ గౌరవాధ్యక్షుడు బీ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. శుక్రవారం నగరంలోని జీపీఆర్ గ్రాండ్ కల్యాణ మండపంలో ప్రపంచ టైలర్స్ దినోత్సవం జరిగింది. ఆయన మాట్లాడుతూ టైలర్ల అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం నుంచి టైలర్స్ ఫెడరేషన్ సాధించేందుకు జిల్లాలోని టైలర్లు అందరూ ఐక్య కార్యచరణ చేపట్టాలని సూచించారు. 45 ఏళ్లు నిండిన టైలర్లకు పింఛన్లు ఇచ్చిన ప్రభుత్వం ఆదుకోవాలని జిల్లా కార్యదర్శి పీ యానాదయ్య విజ్ఞప్తి చేశారు. ముందుగా ట్రంకురోడ్డు రిజ్జి టైలర్స్ షాపు వద్ద పతాక ఆవిష్కరణ చేశారు. అక్కడి నుంచి ర్యాలీగా మినీబైపాస్ రోడ్డులోని జీపీఆర్ గ్రాండ్‌కు చేరుకున్నారు. జిల్లా కార్యవర్గం, నగర కార్యవర్గాన్ని టైలర్స్ ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఎన్ బాబు, ప్రధాన కార్యదర్శిగా పీ మురళీకృష్ణ, నగర అధ్యక్షుడిగా షేక్ గులమ్‌ఖాదర్, సలహాదారులుగా సుందరం, సుబ్రహ్మణ్యం, కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



పతాక ఆవిష్కరణలో టైలర్స్ సంఘం నాయకులు

'రత్నం' సప్తమ సంస్కృతి వార్షికోత్సవం



సంప్రదాయ నృత్య ప్రదర్శన చేస్తున్న బాలికలు

నెల్లూరు(విద్య), ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని కస్తూర్బా కళాక్షేత్రంలో శుక్రవారం డాక్టర్ కిషోర్స్ రత్నం విద్యాసంస్థల సప్తమ సంస్కృతి వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. చిన్నారులు వివిధ భారతీయ శాస్త్రీయ నృత్యరీతులతో కనువిందు చేశారు. విద్యాసంస్థ జీఎం రామ్మూర్తినాయుడు మాట్లాడుతూ సంస్కృతి వార్షికోత్సవంలో తొలిరోజున దేశంలోని భరతనాట్యం, కూచిపూడి తదితర నృత్యాలతో భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా విద్యార్థులు ప్రదర్శనలిచ్చారని చెప్పారు. కార్యక్రమంలో ఏవోలు తుహీనా, వాణి, సునీల్, ఖాసిం, మేనేజర్లు రాజేష్, అజయ్‌సింగ్, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

రేపు వర్చుస్ బ్లూమ్ ఫీల్డ్ వెంచర్ ప్రారంభం

నెల్లూరురూరల్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి) : ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ వర్చుస్ జిల్లాలోని మనుబోలు వద్ద మరో భారీ వెంచర్‌ను నిర్మించింది. దానిని 2వ తేదీన రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్ర మోహన్‌రెడ్డి, సినీతారలతో ప్రారంభించనున్నట్లు సంస్థ మేనేజర్లు శివాజీ, దివ్య తెలిపారు. శుక్రవారం నగరంలోని వారి కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థిరాస్తిపై పెట్టుబడికి తమ సంస్థ నమ్మకమైందన్నారు. చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారికి ఆనుకుని మనుబోలు వద్ద 70 ఎకరాల విస్తీర్ణంలో అన్నీ వసతులు, అనుమతులతో కూడిన వెంటర్‌ను తయారు చేసినట్లు చెప్పారు. మంత్రులు, ప్రజాప్రతినిధులతోపాటు సినీతారలు ఐశ్వర్య రాజేష్, నిధి అగర్వాల్ మరికొందరు ప్రారంభోత్సవానికి హాజరవుతారని తెలిపారు. ఆరోజున ప్లాట్ బుక్ చేసుకున్న వారికి అర కిలో వెండి ఉచితంగా ఇస్తామన్నారు. ఈ కార్యక్ర మంలో సంస్థ మార్కెటింగ్ మేనేజర్లు సుధాకర్, అభినవరాజు, సత్తార్, కాంచన ప్రసాద్, విజయ్ కుమార్, జయచంద్ర, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



బ్రోచర్ విడుదల చేస్తున్న వర్చుస్ మేనేజర్లు

తడి, పొడి చెత్తను విడివిడిగా సేకరించండి : మేయర్

నెల్లూరు(సిటీ), ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి) : నగరంలో ఇళ్ల నుంచి చెత్తను సేకరించేటప్పుడు తడి, పొడిది వేర్వేరుగా తీసుకోవాలని నగర మేయర్ స్రవంతి సూచించా రు. శుక్రవారం అల్లీపురం వద్దనున్న డంపింగ్ యార్డును ఆమె పరిశీలించారు. అనం తరం మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు కార్పొరేషన్ వాహనాలకే చెత్తను ఇవ్వాలని కోరారు. వ్యర్థాల రవాణా వాహనాలు విధిగా పైన వల వేయాలని ఆదేశించారు. కాగా, నగర కమిషనర్ సూర్యతేజ పడారుపల్లిలో పర్యటించారు. రోడ్లపై పాడైన పాత వాహనాలు ఎక్కువగా ఉన్నాయని, వాటిని పోలీసుల సహాయంతో బయట ప్రాంతాలకు తరలించాలని సిటీ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. ఎక్స్‌కవేటర్లతో ఖాళీ స్థలాల్లోని పిచ్చి మొక్కలను తొలగించి ఆ ఖర్చును స్థల యజమానుల నుంచి వసూలు చేయాలన్నారు.

కల్యాణ వేంకటేశ్వరుడికి గరుడసేవ

బుచ్చిరెడ్డిపాళెం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): బుచ్చిరెడ్డిపాళెం రామకృష్ణానగర్‌లోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం కల్యాణ వేంకటేశ్వరుడు గరుడువాహనంపై గ్రామోత్సవంలో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం మోహినీ అవతారం (గిన్నెభిక్ష) కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాలకు రేణంగి నరసింహాద్రి, సింహ సతీష్ కుటుంబాలు, పందిళ్లపల్లి శ్రీరాములురెడ్డి, గణేశం శ్రీనివాసులురెడ్డి, ననికంటి గురుమూర్తి కుటుంబాలు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

3.5 లక్షల మంది తల్లులకు వందనం



ఎన్నికల హామీల్లో భాగమైన తల్లికి వందనం పథకాన్ని వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమలు చేసేందుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించారు. జిల్లాలో గత వైసీపీ ప్రభుత్వం 1.65 లక్షల మంది పిల్లలకు అమ్మ ఒడిని అమలు చేయగా.. కూటమి ప్రభుత్వంలో ఆ సంఖ్య రెట్టింపు కంటే ఎక్కువ కానుంది. 1,47,190 మంది ప్రభుత్వ, 1,55,784 మంది ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు.. 62,761 మంది ఇంటర్ విద్యార్థులు.. మొత్తంగా 3,65,735 మందికి రూ.15 వేలు చొప్పున 'తల్లికి వందనం' అందనుంది. వైసీపీ ప్రభుత్వం కుటుంబంలో పిల్లలందరికీ రూ.15 వేలు ఇస్తామని, అధికారంలోకి వచ్చాక రూ.13 వేలు చొప్పున ఇంట్లో ఒక్కరికే ఇచ్చింది. అలాగే 2023-24 విద్యా సంవత్సరానికైతే పూర్తిగా ఎగ్గొట్టేసింది.

గాలేరు-నగరి.. అంతంత మాత్రమే

గాలేరు-నగరి ప్రాజెక్టుకు నిధుల కేటాయింపు ఉసూరు మనిపించింది. 2024-25లో వైసీపీ ప్రభుత్వం రూ.2438.95 కోట్లు కేటాయించగా.. విడుదల చేసింది రూ.373.58 కోట్లు మాత్రమే. కూటమి ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.488.57 కోట్లు కేటాయించింది. వాస్తవానికి గాలేరు-నగరి ప్రాజెక్టు కడప జిల్లాలో పెండింగ్ పనులు పూర్తి చేయడానికే కనీసం రూ.1400 కోట్లు అవసరం. గండికోట ప్రాజెక్టు నుంచి తిరుపతి జిల్లాకు ప్రతిపాదించిన ప్రత్యామ్నాయ డిజైన్ పనులకు మూడేళ్ల కిందటే రూ.5 వేల కోట్లు అవసరమని అంచనా వేశారు. ఇప్పుడి రూ.6 వేల కోట్లకు చేరి ఉంటుంది. కొత్త బడ్జెట్‌లో కేటాయించిన నిధులు కడప జిల్లాలో పెండింగు పనులకే చాలవు.



'గంగ'కు పెంచినా.. అరకొరే

తెలుగుగంగ ప్రాజెక్టు పరిస్థితి కూడా అలానే వుంది. ఈ ప్రాజెక్టుకు గత వైసీపీ ప్రభుత్వం 2024-25లో రూ. 453.18 కోట్లు కేటాయించింది. కేవలం రూ.150 కోట్లు మాత్రమే విడుదల చేసింది. ప్రస్తుత ప్రభుత్వం రూ.345.48 కోట్లు కేటాయించింది. కండలేరు ప్రాజెక్టు మొదలుకుని, స్వర్ణముఖి బ్యారేజీ, సోమశిల-స్వర్ణముఖి లింక్ కెనాల్, తెలుగు గంగ కాలువలు, తిరుపతికి తాగునీటి సరఫరా వరకూ పలు అంశాలు తెలుగు గంగ ప్రాజెక్టుపై ఆధారపడి ఉన్నాయి. తెలుగు గంగ కాలువలు పలుచోట్ల అసంపూర్తిగా వున్నాయి. గతంతో పోలిస్తే తెలుగు గంగకు రూ.200 కోట్లు ఎక్కువ ఇచ్చినా.. అవసరాల దృష్ట్యా ఈ కేటాయింపులు సరిపోవనే చెప్పాలి. ఈ నిధుల్లోనే ఎస్ఎస్ లింక్ కెనాల్‌కు రూ.69 కోట్లు కేటాయించాలి. అయితే గతేడాది వైసీపీ ప్రభుత్వం కేటాయించిన రూ.49 కోట్లతో పోలిస్తే రూ.20 కోట్లు అదనంగా ఇవ్వడం ఊరటనిచ్చే అంశం. స్వర్ణముఖి బ్యారేజీ అభివృద్ధికి నిధుల కేటాయింపు జరగకపోవడం గమనార్హం.



చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం సమర్పించిన తొలి బడ్జెట్‌లో తిరుపతి జిల్లాకు ఘనమైన వాటా లభించింది. జగన్ జమానాలో చతికిలబడ్డ అభివృద్ధి మళ్లీ పరుగులు తీయనుంది. ఎన్నికలకు ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల అమలు మీద 2025-26 బడ్జెట్ అధిక దృష్టి పెట్టడంతో జిల్లా పేద ప్రజల సంక్షేమానికి ప్రాధాన్యం పెరిగింది. నీటి ప్రాజెక్టులకు గత వైసీపీ ప్రభుత్వం విడుదల చేసిన నిధుల మొత్తానికన్నా ఎక్కువ కేటాయించినా.. అవసరాలకు సరిపడేలా లేవు. వర్సిటీలకు నిధుల కేటాయింపులు కూడా ఆశాజనకంగా లేదు.

\- తిరుపతి, ఆంధ్రజ్యోతి

ఇక పరుగులే!

అభివృద్ధి, సంక్షేమం సమతూకం

బడ్జెట్‌పై ప్రముఖుల అభిప్రాయాలు - 6లో



3647 మంది మత్స్యకారులకు రెట్టింపు లబ్ధి

చేపల వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు అందించే ఆర్థిక సాయాన్ని కూటమి ప్రభుత్వం రూ.10 వేల నుంచీ రూ.20 వేలకు పెంచింది. తడ మండలంలో 1613 మంది, వాకాడులో 1045, చిల్లకూరులో 813, కోటలో 176 మంది చొప్పున 3647 మంది మత్స్యకారులున్నారు. వీరికి గత వైసీపీ ప్రభుత్వంలో రూ.10 వేల చొప్పున అందగా.. ఇప్పుడు రెట్టింపు లబ్ధి చేకూరనుంది.

వర్సిటీలు టాప్ 100లో నిలిచేదెలా?

ప్రపంచవ్యాప్తంగా అత్యుత్తమ వంద యూనివర్సిటీలలో ఏపీ వర్సిటీలు ఉండేలా అభివృద్ధి పరుస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఆ ప్రకటనకు తగ్గట్టుగా జిల్లాలో వర్సిటీలకు నిధుల కేటాయింపు జరగలేదు. పద్మావతీ మహిళా వర్సిటీకి గతేడాది వైసీపీ ప్రభుత్వం రూ.72.33 కోట్లు కేటాయించగా.. కూటమి ప్రభుత్వం రూ. 67.22 కోట్లు కేటాయించింది. శ్రీ వేంకటేశ్వర వెటర్నరీ వర్సిటీకి గతేడాది బడ్జెట్‌లో రూ.168 కోట్లు కేటాయించింది అప్పటి ప్రభుత్వం. అందులో రూ.113 కోట్లు జీతాలకు, రూ.40 కోట్లు కంటింజెన్సీ కింద ఇవ్వగా రూ. 15 కోట్లు సివిల్ వర్కులకు కేటాయించారు. ఇప్పుడు రూ.165 కోట్లు కేటాయించింది. ఉద్యోగుల జీతాలు, కంటెన్జెన్సీ నిధులు రూ.154కోట్లు, సివిల్ పనులకు 11కోట్లు కేటాయించారు. ఇక, ఎస్వీయూకు గతేడాది వైసీపీ ప్రభుత్వం రూ.226.38 కోట్లు కేటాయించగా.. ఇప్పుడూ అదే మొత్తాన్నీ ఇచ్చారు. విశ్వవిద్యాలయాలకు ఏటా బడ్జెట్ కేటాయింపుల్లో కనీసం పదిశాతం పెరుగుదల ఉంటేనే వర్సిటీల సాధారణ నిర్వహణ సాధ్యం కాని పరిస్థితి. ఈ కేటాయింపులతో గ్లోబల్ టాప్ 100 వర్సిటీల జాబితాలో చేరడం ఎలా సాధ్యమన్న ప్రశ్న వినిపిస్తోంది.

శ్రీసిటీ ఐఐటీకి రూ. 19.52 కోట్లు

సత్యవేడు నియోజకవర్గం శ్రీసిటీ పరిధిలో ఏర్పాటు చేస్తున్న ఐఐటీకి ప్రభుత్వం రూ.19.52 కోట్లు కేటాయించింది. ఐఐటీ నిర్మాణానికి, ఇతర అవసరాలకు గతేడాది బడ్జెట్‌లో రూ. 39.04 కోట్లు కేటాయించగా నూతన బడ్జెట్‌లో రూ. 19.52 కోట్లు కేటాయించారు.

పెళ్లి సందడి



ఆది దంపతుల కల్యాణోత్సవానికి సర్వం సిద్ధం

జనంతో కిక్కిరిసిన మాడ వీధులు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం తెల్లవారుజామున జరిగే శివపార్వతుల కల్యాణోత్సవానికి శుక్రవారం రాత్రి నుంచే సందడి మొదలైంది. పెళ్లితంతు జరిగే శ్రీకాళహస్తిలోని కైకాలవారి పెండ్లిమండపం.. విద్యుద్దీప కాంతులతో వెలిగిపోతోంది. రంగవల్లులు.. మామిడి తోరణాలు.. అరటి చెట్లతో అలంకరించారు. ఎక్కడా లేనివిధంగా దేవుళ్లు ఆలయాన్ని వదిలి ఊర్లోకి వచ్చి వివాహం చేసుకోవడం శ్రీకాళహస్తి ప్రత్యేకత. ఈ కల్యాణోత్సవానికి వందల సంవత్సరాలుగా శాశ్వత ఉభయదారులుగా కైకాల వంశస్తులు ఉంటున్నారు. ఈ వంశానికి చెందిన చెంబేడుతో పాటు 14 గ్రామాల ప్రజలు.. తమిళనాడులోని పలు గ్రామాలకు చెందిన ఆ వంశస్తులు ఉభయదారులుగా వ్యవహరిస్తున్నారు. ఈ కల్యాణోత్సవాన్ని చూసేందుకు వచ్చిన భక్తులతో సాయంత్రం నుంచే మాడవీధుల్లో సందడి నెలకొంది. ఇదే కల్యాణ ఘడియలో వివాహం చేసుకునేందుకు పలు జంటలు తరలివచ్చాయి. నెహ్రూవీధి, నగరి వీధిలో భక్తులు, పెళ్లిబృందాలు విడిది చేయడానికి బారికేడ్లను ఆదిదంపతుల కల్యాణంలో బ్యాలవివాహాలు జరగకుండా అన్ని శాఖల అధికారుల సమన్వయంతో నిఘా పెట్టారు. మరోవైపు పట్టణంతో పాటు పరిసర గ్రామాల నుంచీ వచ్చిన భక్తులతో మాడవీధుల్లో సందడి నెలకొంది. ఇక, శుక్రవారం రాత్రి పరమశివుడు, జ్ఞానప్రసూనాంబ ఉత్సవర్లను స్వర్ణాభరణాలతో అలంకరించారు. టీటీడీ అందజేసిన పట్టువస్త్రాలను ధరించి శ్రీకాళహస్తీశ్వరుడు గజవాహనంపై.. జ్ఞానప్రసూనాంబదేవి సింహవాహనం అధిరోహించి పెండ్లిమండపానికి బయలుదేరారు. పరివారం ముందు నడుస్తుండగా.. పెండ్లి మండపానికి కదిలిన స్వామి, అమ్మవార్లను భక్తులు దర్శించుకున్నారు.

వధూవరులు: శివ పార్వతులు
ముహూర్తం: శనివారం తెల్లవారుజామున 3 గంటలు
వేదిక: శ్రీకాళహస్తిలోని కైకాలవారి పెండ్లిమండపం



శుక్రవారం అర్ధరాత్రి 12 గంటల తర్వాత ఆలయం నుంచి గజ, సింహ వాహనాలపై పెండ్లి మండపానికి బయలుదేరిన శ్రీకాళహస్తీశ్వరుడు.. జ్ఞానప్రసూనాంబదేవి









ముస్తాబైన పెండ్లిమండపం - భక్తుల కోసం ఏర్పాటు చేసిన బ్యారికేడు - మాడవీధిలో జనం

చంద్రగిరి పంచాయతీ

కార్యదర్శిపై ఆరోపణలెన్నో?



● రూ.50 వేల లంచం తీసుకొంటూ ఏసీబీకీ చిక్కిన మహేశ్వరయ్య

చంద్రగిరి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): ఏసీబీకి చిక్కిన చంద్రగిరి పంచాయతీ కార్యదర్శి మహేశ్వరయ్యపై గతంలోనూ ఎన్నో అవినీతి ఆరోపణలున్నాయి. రూ.6 లక్షల బిల్లుల మంజూరుకు రూ.50 వేల లంచం తీసుకుంటూ శుక్రవారం పట్టుబడిన ఈయన.. గతంలో పడమటి మండలాల్లో పనిచేశారు. 2022 జూన్‌లో కుప్పం నుంచి బదిలీపై చంద్రగిరికి వచ్చారు. అప్పట్లోనే చంద్రగిరి ఇందిరమ్మ కాలనీ భూకబ్జాదారులకు అక్రమంగా ఎన్‌వోసీలు ఇవ్వడం, ఇంటి ప్లానింగ్ అప్రూవల్ ఇవ్వడం.. వంటి ఘటనల్లో ఈయనపై అవినీతి ఆరోపణలు వచ్చాయి. కూటమి అధికారంలోకి రాగానే బదిలీపై వెళతారనే ప్రచారం జరిగింది. అయినా, తన పలుకుబడితో ఇక్కడే కొనసాగుతున్నారు. తిరుచానూరుకు వెళ్లాలనే ప్రయత్నాల్లో ఉన్నట్లు సమాచారం. ఈ క్రమంలో ఉపాధి హామీ పథకం బిల్లులకు సంబంధించి ఏసీబీకి చిక్కారు. చిన్నగొట్టిగల్లు మండలం పాలెం గ్రామానికి చెందిన కాంట్రాక్టర్ దినేష్‌రెడ్డి.. గత ప్రభుత్వంలో ఉపాధి హామీ పథకం కింద చంద్రగిరి పంచాయతీలో సచివాలయం, వెల్‌నెస్ సెంటర్ భవనాలను నిర్మించారు. గత నెలలోనే ఈయనకు రూ.6 లక్షల బిల్లులు మంజూరయ్యాయి. దీనికి పంచాయతీ కార్యదర్శి మహేశ్వరయ్య రూ.50 వేలు డిమాండు చేశాడు. దీనిపై ఆయన ఏసీబీ అధికారులను సంప్రదించారు. శుక్రవారం దినేష్‌రెడ్డి నుంచి కార్యదర్శి రూ.50 వేలు తీసుకొంటుండగా ఏసీబీ ఏఎస్పీ విమల కుమారి, డీఎస్పీ ప్రశాంతి, సీఐ మల్లికార్జున, సిబ్బంది రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఆయన్ను అరెస్ట్ చేసి, నెల్లూరులోని ఏసీబీ స్పెషల్ కోర్టులో హాజరుపరచగా రిమాండు విధించారు.



పంచాయతీ కార్యాలయంలో ఏసీబీ అధికారులు

ఏసీబీ దూకుడు

● 28 రోజుల్లో మూడు కేసులు

● నలుగురు అధికారుల అరెస్టు

తిరుపతి ప్రాంతీయ అవినీతి నిరోధక శాఖ అధికారులు దూకుడు పెంచారు. 28 రోజుల వ్యవధిలో మూడు కేసులు నమోదు చేశారు. ఈ కేసుల్లో నలుగురు అధికారులను నిఘావేసి పట్టుకున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అవినీతికి పాల్పడిన అధికారుల పట్ల ఉదాసీనంగా వ్యవహరించేవారు. నేతలకు అనుగుణంగా ఉంటే చాలు.. ఎన్ని ఫిర్యాదులు వెళ్లినా.. ఏమీ కాదన్న భావన ఉండేది. అప్పట్లో వాళ్లంతా ఇష్టారాజ్యంగా వ్యవహరించేవారు. ఇప్పుడు కూటమి అధికారంలోకి వచ్చినా... కొందరు అధికారులు అదే పంథాను కొనసాగిస్తున్నారు. అదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో అవినీతి నిరోధక శాఖ అధికారులు దూకుడు పెంచారు. అంచాలు డిమాండ్ చేయడం.. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టడం వంటి ఫిర్యాదులపై దృష్టి పెట్టారు. ప్రజల్లోనూ అవగాహన కల్పిస్తున్నారు. మదనపల్లె మాజీ ఆర్డీవో మురళి ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారనే ఆరోపణలపై ఏసీబీ జాయింట్ డైరెక్టర్ నేతృత్వంలో తిరుపతి ఏఎస్పీ విమలకుమారి, సిబ్బంది కలిసి గతేడాది నవంబరు 8న పలుచోట్ల ఏక కాలంలో సోదాలు నిర్వహించిన విషయం తెలిసిందే. ఆ సమయంలో అత్యంత విలువైన డాక్యుమెంట్లు, నగదు, నగలు, కీలక పత్రాలు, వివిధ లావాదేవీలకు సంబంధించిన పాసు పుస్తకాలు సీజ్ చేశారు. ఈ కేసులో ఆర్డీవో మురళిని అరెస్టు చేశారు. ఇలా ఫిర్యాదులపై స్పందిస్తున్నారు. కాగా, ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని రిజిస్ట్రేషన్, రెవెన్యూ, మున్సిపల్, ఆర్డీవో కార్యాలయాల నుంచి ఏసీబీకి ఎక్కువగా ఫిర్యాదులు వస్తున్నట్లు సమాచారం. తిరుపతి కార్పొరేషన్‌లోని ప్రణాళికా విభాగంలో నలుగురిపై కొందరు బాధితులు ఫిర్యాదులు చేసినట్లు తెలిసింది. వీటిపైనా ఏసీబీ దృష్టి పెట్టినట్లు సమాచారం.

\- తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి

● జనవరి 30న మదనపల్లె వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో నిందితుడితో చేతులు కలిపి లారీనీ కేసు నుంచి తప్పించి విడిపించడానికిగాను రామసముద్రం ఎస్ఐ వెంకటసుబ్బయ్య, మదనపల్లె రెండవ పట్టణ సీఐ రమేష్ కలిసి రూ.70,000 లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డారు. వారిద్దరిపై కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించారు.


● ఫిబ్రవరి 25న రాయచోటిలో పనిచేస్తున్న చేనేత, జౌళి శాఖ అధికారి కృష్ణ చేనేత కార్మికుల నుంచి రూ 70,000 లంచం తీసుకుంటుండగా తిరుపతి ఏసీబీ అధికారులు వలపన్ని పట్టుకున్నారు.

● తాజాగా చంద్రగిరి పంచాయతీ ఈవో మహేశ్వరయ్య కాంట్రాక్టరు నుంచి రూ.50 వేలు తీసుకుంటుండగా పట్టుకున్నారు.

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

● రాయనున్న 62,761 విద్యార్థులు ● 86 కేంద్రాల్లో ఏర్పాట్లు

తిరుపతి(విద్య), ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పరీక్షలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈనెల 20వ తేదీ వరకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగనున్నాయి. 32,213 మంది ప్రథమ, 30,548 మంది ద్వితీయ సంవత్సర విద్యార్థులు మొత్తం 62,761 మంది పరీక్షలకు హాజరుకానున్నారు. ఇందుకుగాను జిల్లా వ్యాప్తంగా 86 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ పర్యవేక్షణలో ఆర్ఐఓ జీవీ ప్రభాకర్‌రెడ్డి ఏర్పాట్లు పూర్తి చేశారు. 1,400 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. సమస్యాత్మకమైన పిచ్చాటూరు, నాగలాపురం పరీక్ష కేంద్రాల్లో భద్రతను పటిష్టం చేశారు. స్పెషల్ ఆఫీసర్‌తోపాటు ఫ్లయింగ్ స్క్వాడ్లు 4, సిట్టింగ్ స్క్వాడ్లు 8, డిపార్ట్‌మెంటల్ అధికారులు 86 మంది, చీఫ్ సూపరింటెండెంట్లు 86 మంది, కస్టోడియన్లుగా 20 మందిని నియమించారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయనున్నారు. విద్యార్థుల సహాయార్థం కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. ఫిర్యాదులు, సహాయం కోసం 0877 2237200లో కంట్రోల్ రూమ్‌ను సంప్రదించవచ్చు. నిమిషం ఆలస్యమైనా కేంద్రంలోకి అనుమతించరాదనే నిబంధన ఉందని, దీన్ని గుర్తించి విద్యార్థులు జాగ్రత్త వహించాలని ఆర్ఐఓ జీవీ ప్రభాకర్‌రెడ్డి సూచించారు.



హన్సిక

శ్రీవారి సేవలో ప్రముఖులు



వంశీ పైడిపల్లి

తిరుమల శ్రీవారిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. విధానసభ లోక్ ఫండ్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎంఆర్ సంజయ్ రథన్, ఎంఎల్సీ సత్యవతి రాథోడ్, సినీ దర్శకుడు వంశీ పైడిపల్లి, హీరోయిన్ హన్సిక ఉన్నారు.

- తిరుమల,ఆంధ్రజ్యోతి

నేడు పింఛన్ల పంపిణీ

● 2,62,461మంది లబ్ధిదారులకు రూ.112.06కోట్లు కేటాయింపు

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్లను శనివారం పంపిణీ చేయనున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ శుక్రవారం తెలిపారు. జిల్లాలో 2,62,461మంది లబ్ధిదారులకు వారి ఇళ్లవద్దే అందజేయనున్నట్లు వివరించారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.112.06 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి పంపిణీ ప్రారంభవుతుందని పేర్కొన్నారు.

ఒకరోజు అన్నదానానికి రూ.44 లక్షలు

తిరుమలలో ఒక రోజు అన్నదానం చేయాలనుకున్నవారు రూ.44 లక్షలు చెల్లించాల్సి ఉంటుందని టీటీడీ తెలిపింది. పెరిగిన సరుకులు, కూరగాయల ధరల వల్ల రూ.38 లక్షలున్న మొత్తాన్ని గత అక్టోబరులో రూ.44 లక్షలకు పెంచారు. 2023 అక్టోబరుదాకా ఈ మొత్తం 33 లక్షలుగా ఉండేది. ఇందులో ఉదయం అల్పాహారానికి రూ.10 లక్షలు, మధ్యాహ్నం భోజనానికి రూ.17 లక్షలు, రాత్రి భోజనానికి రూ.17 లక్షలు వినియోగిస్తారు. కాగా, దాతలే స్వయంగా అన్నప్రసాదాలను వడ్డించే అవకాశాన్ని టీటీడీ కల్పిస్తుంది. విరాళం అందించే దాత పేరును వెంగమాంబ అన్నప్రసాద కేంద్రంలో ఆరోజు ప్రదర్శిస్తారు.

- తిరుమల,ఆంధ్రజ్యోతి

సర్వదర్శనానికి 5 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 5 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 6 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

బుధవారం నాటి హుండీ ఆదాయం: రూ.3.72 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 58,627

తలనీలాలు సమర్పించినవారు: 15,468

అధికార నందిపై ఆదిదేవుడు



అధికార నందిపై శ్రీకాళహస్తీశ్వరుడు, కామధేనువుపై జ్ఞానప్రసూనాంబదేవి

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): తన భక్తాగ్రేసరుడైన అధికార నందిపై ఆదిదేవుడు ఊరేగుతూ భక్తులను పరవశింపజేశారు. శ్రీకాళహస్తీశ్వరాలయ మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం స్వామివారు అధికారనందిపై, అమ్మవారు కామధేనువుపై భక్తులకు దర్శనమిచ్చారు. అంతకు ముందు ఆలయంలోని యాగశాలలో కలశాలకు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. అలంకార మండపంలో స్వామిఅమ్మవార్ల ఉత్సవర్లను అలంకరించి హారతులు సమర్పించారు. స్వామి, అమ్మవార్లను రాజగోపురం వద్దకు తీసుకొచ్చి అధికార నంది, కామధేనువుపై కొలువుదీర్చారు. స్వామి అమ్మవార్లకు ముందు వరసలో శివ పరివారమైన పంచమూర్తులు సాగారు. కళాకారుల ప్రదర్శనలు, కేరళ వాయిద్యాలు, కోలాట నృత్యాలు, కీలుబొమ్మల ప్రదర్శనలు, వివిధ దేవతా మూర్తుల వేషధారణలు ఆకట్టుకున్నాయి. చతుర్మాడ వీధుల్లో భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకుని హారతులు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఈవో బాపిరెడ్డి, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

శివపార్వతుల కల్యాణానికి టీటీడీ పట్టువస్త్రాలు

ఏటా మహాశివరాత్రి ఉత్సవాల్లో కల్యాణోత్సవానికి టీటీడీ తరపున పట్టువస్త్రాలు సమర్పించడం ఆనవాయితీ. శనివారం తెల్లవారుజామున శివపార్వతుల కల్యాణోత్సం జరగనున్న నేపథ్యంలో శుక్రవారం టీటీడీ ఈవో శ్యామలరావు పట్టువస్త్రాలను తీసుకురాగా, ఆలయం వద్ద ముక్కంటి ఆలయ ఈవో బాపిరెడ్డి, అధికారులు స్వాగతం పలికారు. ఆలయంలోని అలంకార మండపానికి చేరుకుని పట్టువస్త్రాలను వేదపండితులకు అందజేశారు. వీటిని శ్రీకాళహస్తీశ్వరుడు, జ్ఞానప్రసూనాంబదేవికి అలంకరించారు. అనంతరం ఈవో శ్యామలరావు ముక్కంటిని దర్శించుకున్నారు. ఆది దంపతుల కల్యాణానికి పట్టువస్త్రాలు సమర్పించే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నట్లు టీటీడీ ఈవో చెప్పారు.



ఆలయంలో వేదపండితులకు పట్టువస్త్రాలు అందజేస్తున్న టీటీడీ ఈవో శ్యామలరావు

నేడు సభాపతి కల్యాణం : శనివారం సభాపతి కల్యాణం నిర్వహించనున్నారు. సభాపతిగా పిలవబడే నటరాజస్వామికి శివకామ సుందరితో కల్యాణం నిర్వహిస్తారు. ఈ కల్యాణం ఆలయ ప్రాంగణంలోని 16 కాళ్ల మండపం వద్ద జరుగుతుంది. సభాపతి కల్యాణం జరిగే రాత్రిని ఆనందరాత్రిగా వ్యవహరిస్తారు. నాగభూషణుడు నటరాజుగా ఆనందతాండవం చేస్తాడు. నారదుడు, తుంబరుడు, సకల యక్ష, గంధర్వ గానంతో, వాయిద్య ఘోషలతో ఆనందరాత్రి వేళ కైలాసగిరులు ప్రతిధ్వనించనున్నాయి. కాగా, శనివారం ఉదయం 11.00గంటలకు రుద్రాక్ష అంబారీ వాహన సేవ జరగనుంది.

బడ్జెట్‌పై ప్రతిస్పందన

కూటమి ప్రభుత్వం శుక్రవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై జిల్లాకు చెందిన పలువురి ప్రతి స్పందన ఇదీ..

అంకెల గారడీ

తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలకు నిధుల కేటాయింపు చూసినట్లయితే లబ్ధిదారుల సంఖ్యలో భారీగా కోత పడేటట్లు ఉంది. ప్రజలు, ప్రతిపక్షాల ఒత్తిళ్ల తట్టుకోలేక ఈ రెండు పథకాలకు నిధులు కేటాయించినట్లు కనిపిస్తుంది. హామీలను పక్కన పెట్టి, కేవలం అంకెల గారడీ చేశారు.

- మద్దిల గురుమూర్తి, తిరుపతి ఎంపీ

ప్రజారంజకం

అన్ని వర్గాల సంక్షేమంతో పాటు విద్య, వైద్యానికి పెద్దపీట వేసిన ప్రజారంజకమైన బడ్జెట్ ఇది. ఎన్నికల మ్యానిఫెస్టోలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఇచ్చిన హామీలు మొదటి ఏడాదిలోనే అమలు చేయడానికి నిధులను కేటాయించడం అభినందనీయం.

- ఆరణి శ్రీనివాసులు, తిరుపతి ఎమ్మెల్యే

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా..

రాష్ట్ర పునర్నిర్మాణానికి పునాదిలా.. ప్రజల ఆకాంక్షలకు అనుగుణమైన బడ్జెట్. మొట్టమొదటి బడ్జెట్‌లోనే సంక్షేమానికి, అభివృద్ధికి, హామీల అమలుకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చారు. సామాన్యుల కొనుగోలు శక్తి పెరిగేలా, కొత్త పన్నుల భారం మోపకుండా చూశారు.

- గాలి భానుప్రకాష్, నగరి ఎమ్మెల్యే

ఏపీ పునర్నిర్మాణానికి పునాది

ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణానికి పునాదిలా కేటాయింపులు ఉన్నాయి. గత ప్రభుత్వంలో కనుమరుగైన 73 పథకాలను కూటమి తిరిగి అమలు చేస్తోంది. సూపర్‌సిక్స్ అమలు చేయలేదని విమర్శలు చేసిన వారికి ఈ బడ్జెట్ ఒక సమాధానం.

- నరసింహయాదవ్, తిరుపతి పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు

వికసిత ఆంధ్ర బడ్జెట్

ఎన్నికల ముందు కూటమి పార్టీలు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చే దిశగా బడ్జెట్ ఉంది. వికసిత భారత్‌లో భాగంగా వికసిత్ ఆంధ్రగా కేటాయింపులు జరిగాయి. చితికిపోయిన ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడుతూ అభివృద్ధి, సంక్షేమానికి ఊతమిచ్చేలా రూపొందించారు.

- సామంచి శ్రీనివాస్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు

ఉద్యోగ, కార్మికులకు నిరాశ

ఉద్యోగ, కార్మికులను నిరాశపరిచేలా బడ్జెట్ ఉంది. ధరల నియంత్రణను ప్రస్తావించలేదు. కాంట్రాక్ట్ కార్మికుల వేతనాల పెంపు, స్కీమ్ వర్కర్ల వేతనాల గురించీ పేర్కొనలేదు. ఉద్యోగ, కార్మికులపట్ల లోపభూయిష్టంగా ఉంది.

- కందారపు మురళి, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యం

ఎన్టీఆర్ వైద్య భరోసాకు రూ.31,613 కోట్లు, రోడ్ల నిర్మాణం, మరమ్మతులకు రూ.4,220 కోట్లు కేటాయించారు. దీనిని బట్టి ఇటు సంక్షేమం, అటు అభివృద్ధికి ఈ బడ్జెట్‌లో సమ ప్రాధాన్యం ఇచ్చినట్టుగా అనిపిస్తూ ఉంది. అన్ని శాఖలకు సమ ప్రాధాన్యం ఇస్తూ బడ్జెట్ కేటాయింపులు జరిగాయి. అన్ని వర్గాలు, వృత్తులు, రంగాలను గుర్తిస్తూ దూరదృష్టితో బడ్జెట్ కేటాయింపులు చేశారు.

- డాక్టర్ కొండూరు సునీత, ఎకనమెట్రిక్స్ హెడ్, ఎస్వీయూ

ఆలోచనాత్మక బడ్జెట్

సంక్షేమానికి బడ్జెట్‌లో ప్రభుత్వం పెద్దపీట వేసింది. ఆలోచనాత్మకంగా బడ్జెట్‌ను రూపకల్పన చేశారు. అన్నివర్గాల ప్రజలు ఆనందంగా ఉండాలన్నదే లక్ష్యం.

- సుగుణమ్మ, తిరుపతి మాజీ ఎమ్మెల్యే

బీసీలకు ఉపయోగం

చరిత్రలో ఎరుగని విధంగా బీసీల అభివృద్ధి, సంక్షేమానికి కేటాయింపులు జరిగాయి. రాష్ట్ర చరిత్రలో ఈ బడ్జెట్ బీసీ బడ్జెట్‌గా నిలిచిపోనుంది.

- రాగల ఆనందగౌడ్, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

సంక్షోభంలో సంక్షేమం

ప్రస్తుత ఆర్థిక సంక్షోభంలోనూ అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలిచేలా, స్వర్ణాంధ్ర విజన్ లక్ష్యంగా సంక్షేమ బడ్జెట్‌కు రూపకల్పన జరిగింది. నీటి ప్రాజెక్టులకు ఆశాజనకంగా కేటాయింపులున్నాయి.

- నవీన్ కుమార్ రెడ్డి, బీజేపీ నేత

ఆదాయాన్ని పెంచేలా..

రాష్ట్ర ఆదాయాన్ని పెంపొందించేందుకు కృషి చేసే విధంగా ఈ బడ్జెట్ ఉంది. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అనుకూలం. పేదరిక నిర్మూలనకు ఊతమిచ్చేలా ఉంది. చిన్న తరహా పరిశ్రమలకు ప్రోత్సాహకాలు ఉండటం వల్ల ఉపాధి అవకాశాలు పెరగతాయి.

- కొండూరు మోహనకుమారరాజు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు

తెలుగుకు రూ.10 కోట్లు సంతోషకరం

మాతృభాషకున్న ప్రాముఖ్యతను ప్రభుత్వం గుర్తించింది. తెలుగు భాషా సాహిత్యాభివృద్ధికి రూ.10 కోట్లు కేటాయించింది. ఇలా ప్రత్యేక నిధులు కేటాయించడం హర్షించదగ్గ విషయం.

- సాకం నాగరాజ, తెలుగు భాషోద్యమ సమితి అధ్యక్షుడు

భారతీయ భాషల్లో తెలుగు మేటి

- తెలుగు భాషా ముగింపు సమావేశాల్లో ఎస్వీయూ రిజిస్ట్రార్ -

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): భారతీయ భాషల్లో తెలుగు మేటిగా వెలుగొందుతోందని ఎస్వీయూ రిజిస్ట్రార్ ఆచార్య మాదాల భూపతి నాయుడు పేర్కొన్నారు. రెండు రోజులు నిర్వహించిన మూడో అంతర్జాతీయ తెలుగు భాషా సమావేశాలు శుక్రవారం ముగిశాయి. ఎస్వీయూ సెనేట్ హాలులో జరిగిన ముగింపు సభలో రిజిస్ట్రార్ మాట్లాడుతూ.. తెలుగుదనానికి ఎన్టీఆర్ నిలువెత్తు సంతకమన్నారు. తెలుగు విశ్వవిద్యాలయాన్ని ఎన్టీఆర్ స్థాపించిన విషయాన్ని గుర్తు చేశారు. యూనివర్సిటీల్లో తెలుగు భాష పరిశోధనలు సాగాలని ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి అభిప్రాయపడ్డారు. తెలుగు భాష గొప్పతనంపై పద్యాలు పాడారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆచార్య సుధారాణి, సదస్సు సంచాలకులు ఆచార్య రాజేశ్వరమ్మ, నిర్వహణ కార్యదర్శి ఆచార్య పీసీ వేంకటేశ్వర్లు, సలహాదారు రేమిళ్ళ మూర్తి పాల్గొన్నారు.

తీర్మానాలు

● ప్రాచీన తెలుగు గ్రంథాలను వచనంలోకి మార్చాలి. ● తెలుగు గొప్పదనాన్ని చాటేలా గేయాలు రాయాలి. ● బోధన, పాలనలో తెలుగును పటిష్టంగా అమలు చేయాలి. ● ప్రతి ఒక్కరూ ఇంటా బయటా తెలుగులో వ్యవహరించాలి.



ముగింపు సభలో ప్రసంగిస్తున్న ఆచార్య భూపతి నాయుడు

దైనందిన జీవితంలో సైన్సు పాత్ర కీలకం

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): దైనందిన జీవితంలో సైన్సు పాత్ర ఎంతో కీలకమని షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ అన్నారు. శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం షార్‌లో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు. శాస్త్రవేత్త సర్ సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా షార్ డైరెక్టర్ మాట్లాడుతూ ఆధునిక ప్రపంచంలో సాంకేతిక పరిజ్ఞానం లేని జీవితాన్ని ఊహించలేమన్నారు. ప్రపంచాన్ని శాసిస్తూ, నడిపించే శక్తిగా సైన్సు కీలకపాత్ర పోషిస్తోందన్నారు. దేశానికే గర్వకారణమైన శాస్త్రవేత్త సీవీ రామన్ ఫిబ్రవరి 28న తన ప్రఖ్యాత 'రామన్ ఎఫెక్ట్'ను కొనుగొన్నారు. ఈ ప్రాచుర్యం చెందిన శాస్త్రీయ పరిశోధనకు గౌరవ సూచకంగా 1987 నుంచి ఫిబ్రవరి 28న జాతీయ సైన్స్ దినోత్సవాన్ని జరుపుకోవడం విశేషమన్నారు. సైన్స్ అద్భుతతను, దాని ప్రభావాన్ని మనందరికీ తెలియజేయడంతో జాతీయ సైన్స్ దినోత్సవం ముఖ్య మైలురాయిగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో షార్ ఎంఎస్‌ఏ డిప్యూటీ డైరెక్టర్ గోపికృష్ణ, షార్ ఉద్యోగులు పాల్గొన్నారు.



సీవీ రామన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న షార్ డైరెక్టర్, కంట్రోలర్ శ్రీనివాసులురెడ్డి, ఉద్యోగులు

నేడు జీడీనెల్లూరుకు సీఎం రాక

చిత్తూరు కలెక్టరేట్/తిరుపతి కలెక్టరేట్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా గంగాధర నెల్లూరులో శనివారం సీఎం చంద్రబాబు పర్యటించనున్నారు. సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారు. ఉదయం 11.25 గంటలకు తిరుపతి విమానాశ్రయం చేరుకుంటారు.అక్కడినుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 11.50 గంటలకు జీడీనెల్లూరు మండలం రామానాయుడుపల్లెకు చేరుకుంటారు. మధ్యాహ్నం 12 నుంచి 12.20 వరకు ప్రజాప్రతినిధులతో సమావేశమౌతారు. ఒంటిగంటకు గంగాధరనెల్లూరుకు చేరుకుని ఎన్టీఆర్ భరోసా పెన్షనర్ల ఇండ్లకు చేరుకుని పింఛన్ పంపిణీ చేస్తారు.అనంతరం 'పది సూత్రాలు' అంశంపై అక్కడ 10 ప్రభుత్వశాఖలు ఏర్పాటు చేసిన ప్రదర్శనశాలను 1.30- 1.55 గంటల వరకు పరిశీలిస్తారు. 1.55 నుంచి 2.55 వరకు గ్రామస్థులతో ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించి ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు.అనంతరం రోడ్డుమార్గాన రామానాయుడుపల్లికి 3 గంటలకు చేరుకుంటారు. అక్కడే 25 నిమిషాల పాటు స్థానిక టీడీపీ నేతలతో సమావేశమవుతారు.అనంతరం తిరుగు ప్రయాణమవుతారు. సీఎం పర్యటనకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. శుక్రవారం ప్రభుత్వ విప్ వి.ఎం.థామస్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, చుడా చైర్మన్ కఠారి హేమలత, టీడీపీ జిల్లా అధ్యక్షుడు సీ.ఆర్.రాజన్,నేతలు కలెక్టర్ సుమిత్ కుమార్, ఎస్పీ మణికంఠ ఏర్పాట్లను పరిశీలించారు.



గంగాధరనెల్లూరు దళితవాడలో ప్రభుత్వ విప్ థామస్,టీడీపీ నేతలతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

రుయా ఉద్యోగులు ఎస్వీ వైద్య కళాశాలకు మార్పు

తిరుపతి(వైద్యం), ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని రుయాస్పత్రి ఉద్యోగులను ఎస్వీ వైద్య కళాశాల కిందకు మారనున్నారు. దీనికి సంబంధించి గత వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన 168 జీవో.. మార్చి ఒకటి నుంచి అమల్లోకి రానుంది. రుయాలోని సూపరింటెండెంట్, ఏడీ, ఏవో, ఆఫీస్ సూపరింటెండెంట్, ఒక సీనియర్ అసిస్టెంట్.. తప్ప మిగిలిన దాదాపు 900 మందికిపైగా ఉద్యోగులను ఎస్వీ వైద్య కళాశాలకు అనుసంధానం చేస్తూ వీరి రికార్డులను కళాశాలలోని ఏడీకి పంపించారు. ఇకపై వీరు రుయాస్పత్రిలో పనిచేసినా జీతాలు, అరియర్స్ అన్నీ ఎస్వీ వైద్య కళాశాల నుంచే విడుదల చేస్తారు. ఇకపై ఎస్వీ వైద్య కళాశాల ఉద్యోగులగానే వీరిని గుర్తిస్తారు. వైద్యకళాశాల ఏడీ పరిధిలో విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది.

ఎస్వీయూ దూరవిద్యా విభాగం డైరెక్టర్ రాజీనామా

- కొత్త డైరెక్టర్ నియామకానికి పేర్ల పరిశీలన

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ దూరవిద్యా విభాగ డైరెక్టర్ ప్రొఫెసర్ తవమణి తన పదవికి రాజీనామా చేశారు. ఆమె సమర్పించిన రాజీనామాకు ఉన్నతాధికారులు కూడా ఆమోదం తెలిపినట్లు తెలుస్తోంది. డీడీఈలో బోటనీ ప్రొఫెసర్‌గా ఉన్న తవమణి వైసీపీ ప్రభుత్వ హయాంలో దూరవిద్యా డైరెక్టర్‌గా నియమితులయ్యారు. ఇటీవల దూరవిద్యా పరీక్షల నిర్వహణలో తలెత్తిన గందరగోళం నేపథ్యంలో ఆమె పదవి నుంచి వైదొలగాలని నిర్ణయించుకున్నట్టు తెలుస్తోంది. ఈ క్రమంలోనే తన పదవికి రాజీనామా చేసినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో కొత్త వారిని నియమించేందుకు ఉన్నతాధికారులు కసరత్తు చేస్తున్నట్టు సమాచారం. ఎస్సీ సామాజిక వర్గానికి కేటాయించాలని అధికారులు ఆలోచిస్తున్నట్టు తెలుస్తోంది. జువాలజీ విభాగ ప్రొఫెసర్ కిషోర్, ఇంగ్లిషు విభాగ ప్రొఫెసర్ సుమకిరణ్ పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి.

రీసర్వే పక్కాగా నిర్వహించండి

రెవెన్యూ అధికారులకు కలెక్టర్ ఆదేశం

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): రీసర్వే పక్కాగా చేపట్టి భూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం రెవెన్యూ అధికారులతో రీసర్వే, భూ సంబంధిత అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పీజీఆర్ఎస్, ఇతర గ్రీవెన్స్ నుంచి వచ్చిన భూ సంబంధిత మ్యుటేషన్, సర్వే, పాసుపుస్తకం, రీసర్వే, పాసుపుస్తకాలు ఇతర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. రీసర్వే ప్రక్రియలో ఎటువంటి తప్పులు లేకుండా చేయాలని సూచించారు. గత ప్రభుత్వ హయాంలో రీసర్వే రాళ్లపై రాతలను చెరిపేసే ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

ఎన్టీఆర్ వైద్యసేవల్లో ఆటంకం లేకుండా చూడండి

పేదలకు, ప్రభుత్వ ఉద్యోగులకు, పెన్షనర్లకు ఎన్టీఆర్ వైద్యసేవలు ఆటంకం లేకుండా అందించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. శుక్రవారం రాత్రి కలెక్టరేట్‌లో డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ పథకానికి అనుబంధంగా ఉన్న ఆస్పత్రుల మెడికల్ కోఆర్డినేటర్లతో ఆయన సమావేశమయ్యారు. ఎన్టీఆర్ వైద్య సేవలలో ఎవరినైనా ఇబ్బందిపెట్టినా, తప్పుడు నివేదికలు సమర్పించినా చర్యలు తీసుకుంటామన్నారు. పూర్తి ఉచితంగా సేవలు అందించాలని తెలిపారు. రోగులకు అవసరమైన మందులను కొనుగోలు చేయాలని బలవంతం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎన్టీఆర్ వైద్య సేవల జిల్లా సమన్వయకర్త రాజశేఖర్, మేనేజరు శివకుమార్, రుయా అడిషనల్ సీఎస్ఆర్ఎంవో హరికృష్ణ పాల్గొన్నారు.

నేటి నుంచి పలు ఎక్స్‌ప్రెస్ రైళ్ల నంబర్ల మార్పు

తిరుపతి(సెంట్రల్), ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే పరిధిలో పది ఎక్స్‌ప్రెస్ రైళ్లకు శనివారం నుంచి నంబర్లు మారినట్లు సీపీఆర్వో ఎ.శ్రీధర్ తెలిపారు. విశాఖపట్నం-కడప(18521), కడప-విశాఖపట్నం (18522), విశాఖపట్నం- గుంటూరు(22875), గుంటూరు-విశాఖపట్నం (22876), భువనేశ్వర్- రామేశ్వరం(20895)గా మారుతాయి. అలాగే రామేశ్వరం-భువనేశ్వర్ (20896) 9 నుంచి, భువనేశ్వర్-పుదుచ్చేరి(12897) 4నుంచి, పుదుచ్చేరి-భువనేశ్వర్ (12898) 5 నుంచి, భువనేశ్వర్-చెన్నై సెంట్రల్ (12829) 6 నుంచి, చెన్నై సెంట్రల్-భువనేశ్వర్(12830) మార్చి 7వ తేదీ నుంచి అమల్లోకి వస్తాయని వెల్లడించారు. ప్రయాణికులు గుర్తించి, టిక్కెట్ రిజర్వేషన్ చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

కూతురి జ్ఞాపకాలు మరవలేక... రైలు కిందపడి తండ్రి ఆత్మహత్య



శామ్యూల్ జయకుమార్, లేహానిస్సీ (ఫైల్‌ఫొటోలు)

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): నెల రోజుల క్రితం పెళ్లిపీటలెక్కాల్సి రోజున కూతురు గూడూరు పంబలేరు వాగులో శవమై తేలింది. అప్పటి నుంచి కుమార్తె జ్ఞాపకాలను మరిచిపోలేక మనోవేదనకు గురైన తండ్రి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకొన్న హృదయ విదారకర ఘటన శుక్రవారం సూళ్లూరుపేటలో చోటుచేసుకొంది. సూళ్లూరుపేట పట్టణంలోని రాఘవయ్యపేటకు చెందిన శామ్యూల్ జయకుమార్ (59) శుక్రవారం తెల్లవారుజామున స్థానిక రైల్వేగేటు సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకొన్నాడు. మృతుడి బంధువుల సమాచారం మేరకు... జయకుమార్ కూతురు లేహానిస్సీకి బంధువుల అబ్బాయితో జనవరి 30వ తేదీన వివాహం జరిపించేందుకు గత ఏడాది డిసెంబరు 14న నిశ్చితార్థం చేశారు. ఈ నేపథ్యంలో జనవరి 20న లేహానిస్సీ కళాశాలకు వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి వెళ్లింది. తిరిగి ఇంటికి రాకపోవడంతో జనవరి 21న సూళ్లూరుపేట పోలీసులకు తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. జనవరి 29న కళాశాల పక్కనే ఉన్న పంబలేరు వాగులో శవమై తేలడంతో వివాహ వేడుకలు జరగాల్సిన ఇంట్లో విషాదం చోటుచేసుకొంది. అప్పటి నుంచి జయకుమార్ కూతురి జ్ఞాపకాలను తలచుకొంటూ మనోవేదనకు గురై లోలోపల కుమిలిపోయాడు. గురువారం రాత్రి బయటకు వెళ్లిన ఆయన శుక్రవారం ఉదయం రైలు పట్టాలపై శవమై కనిపించాడు. మృతుడి వివరాలు సేకరించిన రైల్వే హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసరావు బంధువులకు సమాచారం ఇచ్చారు. నెలరోజుల వ్యవధిలోనే తండ్రి, కుమార్తె మృతి చెందడంతో జయకుమార్ ఆత్మహత్యతో బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కంటైనర్ కింద పడి మోటర్ సైక్లిస్టు మృతి



మృతి చెందిన చెంచురామయ్య

పెళ్లకూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): కంటైనర్ కిందపడి మోటర్ సైక్లిస్టు మృతి చెందిన ఘటన పెళ్లకూరు మండలంలోని సవటకండ్రిగ సమీపంలో 71వ జాతీయ రహదారిపై శుక్రవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు వివరాలు... నెల్లూరు జిల్లా కోవూరు మండలం వేగూరు రామపురం ఎస్టీ కాలనీకి చెందిన చలంచర్ల చెంచు రామయ్య(58) కుటుంబం తమ బాతులను మేపేందుకు టెంకాయతోపు వద్దకు ఇటీవల వచ్చింది. వరి కోతలు పూర్తయిన పొలాల్లో టెంట్లు వేసుకొని బాతులను మేపుకుంటున్నారు. శుక్రవారం మధ్యాహ్నం కొత్తూరు వద్ద ఉన్న ఓ హోటల్‌లో భోజనం తీసుకుని మోటర్ సైకిల్‌పై బయలుదేరాడు. మార్గమధ్యంలో సవటకండ్రిగ వద్ద వెళ్తుండగా కంటైనర్ లారీ ముందు వెళ్తున్న మరో లారీని ఢీకొని అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కంటైనర్ సైకిల్‌పై వెళ్తున్న చెంచురామయ్యపై పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని క్రేన్ సహాయంతో కంటైనర్‌ను పైకిలేపి మృతదేహాన్ని వెలికితీసి నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. జీవనాధారమైన బాతులను మేపుకునేందుకు వచ్చి విగతజీవిగా మారిన చెంచురామయ్య మృతదేహాన్ని చూసిన బంధువుల రోదనలు మిన్నంటాయి.

జయంపులో పీహెచ్‌సీ ఏర్పాటయ్యేనా!

- 2022లో ఆస్పత్రి నిర్మాణానికి స్థల సేకరణ
- ఇప్పటికీ పునాది కూడా తీయని వైనం
- వైద్యం కోసం గ్రామీణ ప్రజలు తిప్పలు


జయంపులో పీహెచ్‌సీ నిర్మాణం కోసం సేకరించిన స్థలం

బాలాయపల్లి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి) మండలంలోని అనేక గ్రామాలకు కూడలిగా ఉన్న జయంపు గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటుపై నీలినీడలు కమ్ముకున్నాయి. గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఆరోగ్య సమస్యలు వస్తే బాలాయపల్లి పీహెచ్‌సీకి వెళ్లాల్సి వస్తుండడంతో జయంపు గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయాలని గత వైసీపీ ప్రభుత్వం నిర్ణయించింది. 2022లో ఆస్పత్రి నిర్మాణ పనులు చేపట్టేందుకు అధికారులు హడావుడిగా స్థల సేకరణ చేపట్టారు. వెంటనే ఇద్దరి వైద్యాధికారులు, పీహెచ్‌వో, సూపర్‌వైజర్‌ను నియమించారు. కానీ పీహెచ్‌సీ నిర్మాణానికి పునాదులు కూడా తీయకుండా వదిలేశారు. తాత్కాలికంగా అద్దె భవనంలోనైనా పీహెచ్‌సీ ఏర్పాటు చేయకపోవడంతో నియమితులైన వైద్యులు, సూపర్‌వైజర్ బాలాయపల్లి పీహెచ్‌సీలో విధులు నిర్వహిస్తున్నారు. జయంపుతో పాటు పరిసర గ్రామాల ప్రజలకు ఆరోగ్య సమస్యలు వస్తే బాలాయపల్లి పీహెచ్‌సీకి, లేదా వెంకటగిరి, గూడూరు ఆస్పత్రులకు వెళ్లాల్సిందే. అత్యవసర సమయంలో బయట ప్రాంతాలకు వెళ్లాలంటే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సరైన సమయంలో చికిత్స అందక కొందరు రోగులు ప్రాణాపాయ స్థితిలోకి వెళ్లిన ఘటనలూ ఉన్నాయని వాపోతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి జయంపు గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పారిశుధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలి



సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద సీఐటీయూ నాయకుల ధర్నా

గూడూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులందరినీ దశలవారీగా పర్మినెంట్ చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆప్కాస్ విధానాన్ని రద్దు చేసే యోచనను మానుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. తమ సమస్యలను పరిష్కరించాలని పారిశుధ్య కార్మికులు ఆందోళనా కార్యక్రమాలు చేపడుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం సరికాదన్నారు. ఇకనైనా న్యాయమైన సమస్యలను పరిష్కరించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీఐటీయూ నాయకులు అన్నారు. కార్యక్రమంలో గోపినాథ్, శివకుమార్, బీవీ రమణయ్య, ప్రసాద్, వెంకటరమణ, కోటేశ్వరరావు, రాజేష్, సంపూర్ణమ్మ, నారాయణమ్మ, పద్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

వీధి వ్యాపారుల సంఘం జిల్లా సభలను విజయవంతం చేయాలి


కరపత్రాలను పంపిణీ చేస్తున్న సీపీఐ నాయకులు

గూడూరు అర్బన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ఈనెల 4, 5 తేదీల్లో నిర్వహించనున్న వీధి వ్యాపారుల సంఘం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి శివకుమార్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో మహాసభలకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ పరిధిలోని చిన్న వ్యాపారస్తుల నుంచి తోపుడు బండ్ల వారు ఇబ్బందులు పడుతున్నారన్నారు. మహాసభల్లో వీధి వ్యాపారుల సమస్యలపై చర్చించి, వాటిని పరిష్కరించుకునేందుకు నిర్ణయాలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ప్రభాకర్, శశికుమార్, నారాయణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కామేశ్వరరావు సేవలు ఆదర్శనీయం


కామేశ్వరరావును సత్కరిస్తున్న ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు

పెళ్లకూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఎంపీడీవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన పిల్లెల కామేశ్వరరావు వీడ్కోలు సభ శుక్రవారం జరిగింది. ఎంపీడీవో ప్రమీలారాణి, ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్‌రెడ్డి, ఎంఈవో మించల శంకరయ్య, టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, జీలపాటూరు, బంగారంపేట సర్పంచులు కందమూడి శివకుమార్, దేవారెడ్డి నాగేంద్రప్రసాద్‌రెడ్డితో పాటు పలువురు ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. అనంతరం ఎంపీడీవో మాట్లాడుతూ కామేశ్వరరావు విధి నిర్వహణలో చిత్తశుద్ధితో వ్యవహరించి అందరి మన్నలు పొందారని కొనియాడారు. ఆయన సేవలు ఆదర్శనీయమని అన్నారు. కార్యక్రమంలో ఏవో అన్నపూర్ణ రావు, పీఆర్ ఏఈ వెంకటేష్, పంచాయతీ కార్యదర్శులు మధుమోహన్‌దాస్, సమ్మన శ్రీహరి, టీడీపీ నాయకుడు మాడుపూరు మురళీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ ఉద్యోగులు ఫ్రంట్‌లైన్ వారియర్స్


సభలో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాసులు

డక్కిలి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ ఉద్యోగులు ఫ్రంట్‌లైన్ వారియర్స్ అని తహసీల్దార్ శ్రీనివాసులు అన్నారు. స్వచ్ఛంద పదవీ విరమణ చేసిన రెవెన్యూ కార్యాలయ సీనియర్ సహాయకుడు సుధీర్ బాబుకు శుక్రవారం రాత్రి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలు వంటివి జరిగినప్పుడు అందరికంటే ముందుండేది రెవెన్యూ శాఖ సిబ్బందేనని అన్నారు. శాఖలో పనిచేసి స్వచ్ఛంద పదవీ విరమణ పొందిన సుధీర్ సేవలు మరువరానివని కొనియాడారు. ఎస్‌ఐ శివశంకర్ గౌడ్, డిప్యూటీ తహసీల్దార్ ప్రసన్న, మండల సర్వేయర్ రాజగోపాల్, ఏఎస్‌వో వెంకటయ్య, టీడీపీ మండల అధ్యక్షుడు పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి, ప్రధాన కార్యదర్శి కుమార్, డీలర్ల అసోయేషన్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, వెంబులూరు మాజీ సర్పంచు శ్రీరాం సత్యనారాయణ తదితరులు సుధీర్ బాబును సత్కరించారు.

4న బీసీ కార్పొరేషన్ రుణాల ఇంటర్వ్యూలు

నాయుడుపేట, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట మున్సిపాలిటీ పరిధిలోని 25 వార్డుల్లో బీసీ కార్పొరేషన్ రుణాలకు సంబంధించి ఇంటర్వ్యూలు 4వ తేదీన స్థానిక అంబేడ్కర్ భవనంలో నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ పజులుల్లా తెలిపారు. దరఖాస్తుదారులు ఒరిజినల్ ధృవీకరణ పత్రాలతో ఇంటర్వ్యూలకు హాజరుకావాలని కోరారు.

సిద్దవరంలో సివిల్ రైట్స్‌డే

కోట, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సిద్దవరంలో శుక్రవారం సివిల్ రైట్స్‌డే నిర్వహించారు. డీటీ అజ్మతుల్లా ఖాన్‌తో పాటు పలు శాఖల అధికారులు పౌర హక్కుల గురించి గిరిజనులకు అవగాహన కల్పించారు. అదే విధంగా రాజ్యాంగపరంగా సంక్రమించిన హక్కుల గురించి వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల ప్రాముఖ్యాన్ని వివరించాలి

కోట, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సిద్దవరం అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం సెక్టార్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలు పంచాయతీలకు చెందిన అంగన్వాడీ వర్కర్లతో అంగన్‌వాడీ కేంద్రాల విశిష్టత, విద్యా బోధన, అందిస్తున్న పథకాలు, సమయపాలన, తదితర అంశాలపై వర్కర్లకు సూపర్‌వైజర్ కృష్ణమ్మ అవగాహన కల్పించారు.

పారిశుధ్య కార్మికుల నిరసన

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఆప్కాస్‌ను రద్దు చేయొద్దంటూ సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం పారిశుధ్య కార్మికులు ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన చేశారు. అనంతరం ఆర్డీవో కార్యాలయం ఏవో రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో లక్ష్మయ్య, వెంకటరత్నం, చినబాబు, చెంగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు

గూడూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ పరీక్షలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. పట్టణంలోని ఎస్‌కేఆర్ జూనియర్ కళాశాల, స్వర్ణాంధ్ర భారతి, సెయింట్ మేరీస్, డీఆర్ డబ్ల్యూ, నారాయణ జూనియర్ కళాశాలల్లోని 5 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఉదయం 9నుంచి 12 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా బెంచీలు ఏర్పాటు చేయడంతో పాటు సీసీ కెమెరాల పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకున్నారు. అర్థగంటకు ముందే విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు సూచించారు.

నాయుడుపేట: పట్టనంలోని ఎస్‌పీజీసీ ప్రభుత్వ జూనియర్ కళాశాల, శ్రీవేమ, ఎల్‌ఏ సాగరంలోని గురుకుల కళాశాలలో ఇంటర్ పరీక్షలు నిర్వహించనున్నారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

డక్కిలి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవులపల్లి గ్రామంలో బెల్టు షాపు నడుపుతున్న నరసింహులు అనే వ్యక్తి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి 8 మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకొన్నామని ఎస్‌ఐ శివశంకర్ గౌడ్ తెలిపారు.

విద్యార్థులు సైన్స్‌పట్ల మక్కువ పెంచుకోవాలి



గూడూరులో విద్యార్థినులకు బహుమతులను అందజేస్తున్న ఎంఈవో కాంచన - నాయుడుపేటలో విద్యార్థుల ప్రదర్శనను పరిశీలిస్తున్న ఎంఈవో మునిరత్నం

గూడూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చిన్నతనం నుంచే సైన్స్‌పట్ల మక్కువ పెంచుకోవాలని ఎంఈవో కాంచన అన్నారు. శుక్రవారం గూడూరు పట్టణంలోని జడ్పీ బాలిక ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు. పలు పోటీల్లో గెలుపొందిన విద్యార్థినిలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మాధవిలక్ష్మి, సుమాలక్ష్మి, శివనారాయణ, ఉషశ్రీ, సుభాషిణి తదితరులు పాల్గొన్నారు. అలాగే నారాయణ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో సైన్స్ డే నిర్వహించారు. ప్రిన్సిపాల్ లక్ష్మీకాంత్, శ్రీధర్, రఘురాం, ప్రిస్కిల్లా, పద్మయ్య, భవానీ తదితరులు పాల్గొన్నారు. అలాగే గాయత్రి పాఠశాలలో నిర్వహించిన సైన్స్ ఎక్స్‌పోను ఎంఈవో కాంచన తిల కించారు. స్థానిక వీఎస్‌ఆర్ పాఠశాలలో విద్యార్థులు సైన్స్ దినోత్సవం నిర్వహించారు. విద్యార్థుల ప్రదర్శనలను ఐడీబీఐ బ్యాంకు మేనేజర్ మహేంద్ర రావు తిలకించి అభినందించారు. కార్యక్రమంలో బాలకృష్ణంరాజు, అన్నపూర్ణా, శాంతిప్రియ, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

చిల్లకూరు: మండలంలోని చింతవరం రెస్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను రిటైడ్ హెచ్‌ఎం సంపత్‌కుమార్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శివకుమార్, డాక్టర్ శేఖర్, సుల్తాన్ అహ్మద్, కరస్పాండెంట్ బాలచెన్నయ్య, చైర్మన్ వెంకట సుబ్బయ్య, శ్రీనివాసులు, ప్రభాకర్, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

చిట్టమూరు: మండల పరిధిలోని కొత్తగుంట టీఎంఆర్ పాఠశాలలో సైన్స్ దినోత్సవం జరుపుకున్నారు. విద్యార్థులు తాము రూపొందించిన వివిధ నమూనాలను ప్రదర్శించారు. విద్యాసంస్థ అధినేతలు మనోహర్ రెడ్డి, విజయలక్ష్మి, ప్రిన్స్‌పాల్ రహంతుల్లా, ఉపాధ్యాయులు గురు ప్రసాద్, రూపేష్, నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేట: విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీ సేందుకు సైన్స్ ప్రయోగాలు ఎంతో దోహదపడుతాయని ఎంఈవో మునిరత్నం అన్నారు. పట్టణంలోని నారాయణ పాఠశాలలో విద్యార్థులు తయారు చేసిన ప్రదర్శనలను ఆయన పరిశీలించారు. మేనకూరులోని జడ్పీ ఉన్నత పాఠశాలలో జేవీవీ ఆధ్వర్యంలో మూఢనమ్మకాల నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పేర్నాటి రామకృష్ణ, స్నేహలత, సుదాదేవి, సుబ్రహ్మణ్యం, రియాజ్, ఏవో గౌస్‌భాషా పాల్గొన్నారు.

కోట: మండల పరిధిలోని చిట్టేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కోటలోని ప్రగతి పాఠశాల, విద్యానగర్‌లోని శ్రీనివాస ఉన్నత పాఠశాలల్లో జాతీయ సైన్స్ దినోత్సవం జరిగింది. హెచ్‌ఎంలు నిర్మలాదేవి, సురేందర్ రెడ్డి, పసుపులేటి కిషోర్ పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీలకు బడ్జెట్‌లో అగ్రతాంబులం: నెలవల

నాయుడుపేటటౌన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): బడ్జెట్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అగ్ర తాంబులాన్ని ఇచ్చారని సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. శుక్రవారం శాసన సభలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో సుమారు రూ.70వేల కోట్లు ఎస్సీ, ఎస్టీ, బీసీల సంక్షేమానికి కేటాయించడం హర్షనీయమన్నారు. సూపర్‌సిక్స్ పథకాలను అమలకు ప్రాధాన్యం ఇస్తూ బడ్జెట్ జనరంజక బడ్జెట్ ప్రవేశపెట్టిన ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌కు, ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

సూపర్ సిక్స్ పథకాలకు అరకొర కేటాయింపులే: కిలివేటి

తడ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్ పథకాలకు బడ్జెట్‌లో అరకొరగా నిధులు కేటాయించారని మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య విమర్శించారు. తల్లికి వందనం, దీపం పథకాలకు పూర్తిస్థాయిలో కేటాయింపులు జరగలేదని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, నిరుద్యోగ భృతి, డ్వాక్రా మహిళల సున్నా వడ్డీ పథకాలకు మొండి చెయ్యి చూపారని విమర్శించారు.

విద్యాశాఖ కార్యాలయం ప్రారంభం


విద్యాశాఖ భవనాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

తడ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మండల విద్యాశాఖ నూతన కార్యాలయాన్ని శుక్రవారం ప్రారంభించారు. స్థానిక పేనాసోనిక్ పరిశ్రమ వీఎస్‌ఆర్ నిధుల్లో నుంచి రూ.20 లక్షలతో నూతన భవనాన్ని నిర్మించారు. దీనిని ఆ పరిశ్రమ ఎండీ సెంథిల్, ఎంపీడీవో విజయ్‌కుమార్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంఈవోలు సరస్వతి, మల్లిఖార్జునరావు, ప్రధానోపాధ్యాయులు ఉస్మాన్‌భాషా సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వసంతోత్సవం


వసంతోత్సవం నిర్వహిస్తున్న వేదపండితులు

నాయుడుపేట, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేటలోని ప్రసూనాంబ నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం వసంతోత్సవం వైభవంగా నిర్వహించారు. స్వామివారు, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను స్వర్ణముఖి నదిలోకి తీసుకెళ్లి చక్రస్నానం చేయించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు గూడూరు ప్రభావతి, సుధీర్ రెడ్డి, ఉగ్గుముడి భాస్కర్ రెడ్డిలు, అవదానం సుధీర్, అంకయ్య, మునిరత్నం పాల్గొన్నారు.

పీ4 సర్వే సమగ్రంగా చేపట్టాలి

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): పీ4 సర్వేను సమగ్రంగా చేయాలని ఎంపీడీవో మురళికృష్ణ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని మంగళంపాడు, దామానెల్లూరు గ్రామాల్లో పీ4 సర్వేను ఎంపీడీవో పరిశీలించారు. సిబ్బందికి సూచనలిచ్చారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గురుకుల అధ్యాపకురాలు శశికళకు తెలుగు భాషా పురస్కారం


పురస్కారం అందుకొంటున్న ఉపాధ్యాయురాలు శశికళ

నాయుడుపేట, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని వెంకటేశ్వర విశ్వ విద్యాలయంలో రెండు రోజులుగా జరుగుతున్న తెలుగు భాషా అంతర్జాతీయ సదస్సులో నాయుడుపేటకు చెందిన శశికళ శుక్రవారం ఉత్తమ పురస్కారం అందుకున్నారు. నాయుడుపేట మండలం పుదూరు బాలికల గురుకులంలో అధ్యాపకురాలుగా పనిచేస్తున్న శశికళ తెలుగు భాషాభివృద్ధి, ఫేస్‌బుక్ సమూహాలు అనే అంశాలపై అధ్యయన పత్రాలను అందజేయడంతో సదస్సు కన్వీనర్ వెంకటేశ్వర్లు, ఆర్.మూర్తి శారు. పురష్కారం అందజేశారు.

సర్వేలను పూర్తి చేయాలి

తడ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపట్టిన సర్వేలను సకాలంలో పూర్తి చేయాలని డీఎల్‌డీవో జాలిరెడ్డి ఆదేశించారు. శుక్రవారం తడ కండ్రిగ పంచాయతీ కార్యాలయంలో ఆయన రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం ఆయన అధికారులతో మాట్లాడుతూ పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని, సమస్యలపై సత్వర పరిష్కారం చూపాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు కళాదాబ్రియల్, మస్తాన్, ఆర్‌డబ్ల్యూఎస్ఏఈ హరికృష్ణ పాల్గొన్నారు.

అన్నదానం

గూడూరు అర్బన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక టవర్‌క్లాక్ కేంద్రం వద్ద జనసేన నాయకుడు పేటేటి చంద్రనీల్ పుట్టినరోజు సందర్భంగా పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో పడియాల శ్రీహరి, ఉదయ్‌భాస్కర్, యోగి, సూర్య, మనోజ్‌కుమార్, చరణ్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు



నగదు బహుమతి అందుకుంటున్న విద్యార్థిని

కోట, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): కోటలోని ఏవీకేఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో మెరిట్ సాధించిన విద్యార్థులకు శుక్రవారం ప్రోత్సాహక నగదు బహుమతులు అందజేశారు. ఇన్‌చార్జ్ హెచ్‌ఎం రమాదేవి ఆధ్వర్యంలో విశ్రాంత హెచ్‌ఎం నెల్లూరు సుబ్రహ్మణ్యం చేతుల మీదుగా 60మంది విద్యార్థులకు నగదు పురస్కారం అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఉదయభాస్కర్, వ్యాయామ ఉపాధ్యాయుడు వలీ అహ్మద్, నాగయ్య, సుబ్బయ్య, శ్రీనివాసులురెడ్డి, విద్యాకమిటీ చైర్మన్ హజీరా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రీ సర్వే పరిశీలన

వెంకటగిరిటౌన్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెవిరెడ్డిపల్లి, పూలరంగడుపల్లి గ్రామాల్లో రీ సర్వేను గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా శుక్రవారం పరిశీలించారు. లబ్ధిదారులు ఇచ్చిన అర్జీల మేరకు సర్వేలు నిర్వహిస్తున్నామన్నారు. గ్రీవెన్స్‌డేలో వచ్చే అర్జీలను ఏడు రోజుల్లో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ రాంబాబును ఆదేశించారు.

సర్వీసు రోడ్డు నిర్మించాలని రైతుల ఆందోళన


సాగరమాల రోడ్డు పనులను అడ్డుకొన్న రైతులు

నాయుడుపేట, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట నర్సారెడ్డి కండ్రిగ వద్ద సాగరమాల రోడ్డు పనులను శుక్రవారం రైతులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాగరమాల రోడ్డు కోసం దాదాపు 300 ఎకరాలు ఇచ్చామన్నారు. రైతులకు ఇబ్బందులు లేకుండా సర్వీసు రోడ్డు ఏర్పాటు చేస్తామని అప్పట్లో అధికారులు హామీ ఇచ్చారని తెలిపారు. పుదూరు, విన్నమాల, పెరికిలంపాటి కండ్రిగ, మర్లపల్లి, అన్నమేడు, కాపులూరు, చిలమత్తూరు గ్రామాల్లో సాగరమాల రోడ్డుకు ఇరువైపులా రైతుల పొలాలు ఉన్నాయన్నారు. 13 అడుగుల ఎత్తులో రోడ్డు నిర్మిస్తుండడంతో రైతులు తమ పొలాల్లోకి రాకపోకలకు అవకాశం ఉండదన్నారు. భూసేకరణ సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం సర్వీసు రోడ్డు నిర్మాంచాలని రైతులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు జె.వెంకటకృష్ణారెడ్డి, సన్నారెడ్డి హరినాథరెడ్డి, ధనుంజయరెడ్డి, భాస్కర్‌రెడ్డి, సునీల్, శివకుమార్, హమరేంద్రరెడ్డి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలు

చిల్లకూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన చిల్లకూరు దళితవాడ సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు... గూడూరు మండలం దివిపాళెం గ్రామానికి చెందిన సుజాత గూడూరు వైపు స్కూటర్‌పై వెళుతుండగా ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో సుజాతకు తీవ్ర గాయాలవడంతో గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ఇటుక బట్టీలకు విద్యుత్ కనెక్షన్ల తొలగింపు

కోట, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ కనెక్షన్ల పేరుతో విద్యుత్ కనెక్షన్లు తీసుకుని ఇటుక బట్టీలకు వినియోగిస్తున్న సర్వీసులను ఆ శాఖ అధికారులు తొలిగించారు. కోట మండలంలో వెంకన్నపాలెం, రంగన్నగుంట, తిమ్మానాయుడు పాలెం, వంజివాక, కొక్కుపాడు, సూరిశెట్టిపాలెం తదితర ప్రాంతాల్లో పెద్దసంఖ్యలో ఇటుక బట్టీలు ఉన్నాయి. కొంతమంది వ్యాపారులు వ్యవసాయ కనెక్షన్ల పేరుతో సర్వీసులు పొందారు. నిబంధనలకు విరుద్ధంగా ఇసుకల బట్టీకు విద్యుత్ వినియోగిస్తుండడంతో ఆ శాఖ అధికారులు శుక్రవారం తనిఖీలు చేశారు. 13 కనెక్షన్లను తొలిగించారు.

క్వారీకి భూముల అప్పగింతపై ప్రజాభిప్రాయ సేకరణ


కార్యక్రమంలో ఆర్డీవో కిరణ్మయి, కాలుష్య నియంత్రణ అధికారి రాజశేఖర్

ఓజిలి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలం భువనగిరిపాళెంలో ఏర్పాటైన్న సుజిత్ ఇన్‌ఫ్రా మెటల్ క్వారీకి అవసరమైన అదనపు భూముల అప్పగింత కోసం శుక్రవారం భువనగిరిపాళెం ప్రాథమిక పాఠశాల ఆవరణలో ప్రజాభిప్రాయ సేకరణ జరిగింది. సూళ్లూరుపేట ఆర్డీవో కిరణ్మయి, తిరుపతి కాలుష్య నియంత్రణ బోర్డు ఈఈ రాజశేఖర్ పాల్గొని స్థానికులతో మాట్లాడారు. సర్వే నెంబరు 1లో ఉన్న రెండు హెక్టార్ల భూములను క్వారీకి అప్పగించేందుకు అభ్యంతరం లేదంటూ గ్రామస్తులు తెలిపారు. సమావేశంలో తహసీల్దారు పద్మావతి, నాయుడుపేట రూరల్ సీఐ సంగమేశ్వరరావు, ఓజిలి ఎస్‌ఐ స్వప్న, ఆర్‌ఐ విజయకుమార్, వీఆర్వో కస్తూరయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్యాడ్‌లు, పెన్నుల వితరణ

ఓజిలి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలం కురుగొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం సైన్స్ దినోత్సవం నిర్వహించారు. గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు, విశ్రాంత పారామెడికల్ అధికారి దార్ల అంకయ్య పదో తరగతి విద్యార్థులకు ప్యాడ్‌లు, పెన్నులు వితరణగా అందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు మేకల శారదాదేవి, ఉపాధ్యాయులు రవి, రమణ, సుధాకర్, మాధవయ్య ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాలయ్య పాల్గొన్నారు.

వైభవంగా నాగేశ్వరస్వామి గ్రామోత్సవం


గ్రామోత్సవంలో ఉత్సవ కమిటీ సభ్యుడు శ్రీహరిరెడ్డి, టీడీపీ నాయకులు సుధాకర్ రెడ్డి, రమేష్ తదితరులు

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని నాగేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారికి అభిషేకాలు నిర్వహించి విశేష పూజలు చేశారు. అనంతరం శివ, పార్వతుల ఉత్సవ విగ్రహాలను పుష్పాలతో అలంకరించి మండలపంలో కొలువుదీర్చారు. సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించారు. ఉత్సవ కమిటీ సభ్యుడు ముప్పాళ్ల శ్రీహరిరెడ్డి, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్‌రెడ్డి, పట్టణ అధ్యక్ష, కార్యదర్శిలు ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, కమిటి సభ్యులు ఆదినారాయణ రెడ్డి, శాంతి, రాజశేఖర్, రాము, చెన్నం శ్రీనివాసులు, సాయి తదితరులు పాల్గొన్నారు.